ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

బుధవారం | 20-05- 2026 | సంపుటి: 17, సంచిక: 47, | నిజామాబాద్, | పేజీలు: 12, | వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ



## పెండింగ్ బిల్లుల చెల్లింపులకు

# ప్రభుత్వం సిద్ధం

- సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష
- జిల్లా మంత్రులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్న సీఎం
- ఉమ్మడి పాలమూరుకు నీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, మే 19 (ప్రజాకలం) :

పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఎంసీఆర్ హెచ్ఆర్డీలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం ఈ మేరకు కీలక సూచనలు చేశారు. జిల్లాలో కొనసాగుతున్న ప్రధాన ప్రాజెక్టుల పనులు ఆలస్యం కాకుండా భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తెలంగాణలో అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టులలో ఒకటిగా ప్రభుత్వం భావిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి అయితే ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి పరిస్థితులు పూర్తిగా మారిపోతాయని, లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశముందని తెలిపారు. అందువల్ల భూసేకరణ విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తరువాయి 2వ పేజీలో...

## పబ్లిక్ ప్రాంగణాల్లో వీధి కుక్కలకు నో

- సుప్రీంకోర్టు పాత ఉత్తర్వులకే మద్దతు
- వ్యాక్సినేషన్ చేసినా తిరిగి వదలొద్దు
- రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంపై ఆగ్రహం
- ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యమని స్పష్టం



న్యూఢిల్లీ, మే 19:

దేశవ్యాప్తంగా వీధి కుక్కల సమస్యపై సుప్రీంకోర్టు మరోసారి కఠిన వైఖరి ప్రదర్శించింది. పాఠశాలలు, ఆసుపత్రులు, కళాశాలలు, బస్సు స్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రదేశాల్లో వీధి కుక్కలను తిరగనివ్వకూడదని గతంలో ఇచ్చిన ఆదేశాలను మార్చేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది.

తరువాయి 2వ పేజీలో...

# పెట్రో బాంబు

## వరుసగా రెండోసారి పెరిగిన ధరలు

### హోర్ముజ్ జలసంధి సంక్షోభం ప్రభావం

### భారీ నష్టాల్లో ప్రభుత్వ ఆయిల్ కంపెనీలు



హైదరాబాద్, మే 19 (ప్రజాకలం) :

దేశ ప్రజలకు మరోసారి ఇంధన ధరల షాక్ తగిలింది. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే గత 11 వారాలుగా స్థిరంగా కొనసాగిన పెట్రోల్, డీజిల్ ధరలకు బ్రేక్ పడింది. చమురు మార్కెటింగ్ సంస్థలు ధరల పెంపును మళ్లీ ప్రారంభించడంతో వారం రోజుల వ్యవధిలోనే రెండోసారి ధరలు పెరిగాయి. తాజా పెంపులో పెట్రోల్‌పై లీటరుకు 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు భారమయ్యాయి. అయితే ఈ పెరుగుదల ఇక్కడితో ఆగదని, రాబోయే రోజుల్లో లీటరుకు మరో రూ.25 వరకు పెరిగే అవకాశం ఉందని అంతర్జాతీయ ఆర్థిక సంస్థ నోమురా అంచనా వేయడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధ వాతావరణం తీవ్రరూపం దాల్చడంతో ప్రపంచంలోనే అత్యంత కీలకమైన ముడిచమురు రవాణా మార్గమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. దీని ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు సరఫరా దెబ్బతిని ధరలు ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి. ఈ పరిస్థితుల్లో భారత్‌కు చమురు దిగుమతులు మరింత భారంగా మారాయి. ముఖ్యంగా రష్యా, వెనిజులా దేశాల నుంచి అదనపు ప్రీమియం చెల్లించి క్రూడ్ ఆయిల్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన ధరలు దేశీయ వినియోగదారులపై నేరుగా ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. పరిస్థితి తీవ్రతను గమనించిన ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ప్రజలకు ఇంధన వినియోగంలో పొదుపు పాటించాలని సూచించారు. అవసరం లేని ప్రయాణాలను తగ్గించుకోవాలని,

తరువాయి 2వ పేజీలో...

## దేశం నుండి నక్సలిజాన్ని

# నిర్మూలించాం

## డెడ్ లైన్ కు ముందే.. మావోయిస్టు రహితంగా భారత్

### మావోయిస్టురహితంగా బస్తర్ : అమిత్ షా - భయాందోళనలు వీడి స్వేచ్ఛదిశగా బస్తర్



ఛత్తీస్‌గఢ్: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో నక్సలిజానికి వ్యతిరేకంగా పోటారం చేశామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. బస్తర్ లో తొపాకుల హింస వీడి అభివృద్ధి చేయాలనేదే లక్ష్యమని తెలిపారు. గిరిజన సంప్రదాయాన్ని పరిరక్షించాలనేది ప్రధాని లక్ష్యమని వెల్లడించారు. డెడ్ లైన్ కు ముందే మావోయిస్టు రహిత భారత్ గా మారిందని వివరించారు. భయాందోళనల నుంచి స్వాతంత్రం దిశగా బస్తర్ పయనిస్తోందన్నారు. భవిష్యత్తులో బస్తర్ లో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. బస్తర్.. మావోయిస్టు రహితంగా మారిందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ..”మార్చి 31, 2026 తర్వాత నేను బస్తర్‌కు రావడం ఇదే మొదటిసారి. ఇక్కడే కేంద్ర ప్రాంతీయ మండలి 26వ సమావేశం జరిగింది. బస్తర్ ప్రజల మధ్య ఎక్కడ చూసినా ఉత్సాహం, భవిష్యత్తు పట్ల నమ్మకం నిండిన వాతావరణం కనిపిస్తోంది. బస్తర్ నక్సల్ రహిత ప్రాంతంగా మారడం మనందరికీ ఎంతో సంతోషకరమైన విషయం. మా నక్సల్ రహిత ఉద్యమానికి బీజేపీయేతర ప్రభుత్వాలు చాలానే మద్దతు ఇచ్చాయి. కానీ ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఈ నక్సల్ రహిత ఉద్యమంలో మాకు మద్దతు ఇవ్వలేదు. డిసెంబర్ 13, 2023న ఇక్కడ బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, బస్తర్‌లో మిగిలి ఉన్న నక్సలైట్లను మేము లక్ష్యంగా చేసుకున్నాము. భద్రతా దళాల శౌర్యం, ధైర్యం, త్యాగాల ఫలితంగా, మార్చి 31, 2026 అనే నిర్ణీత గడువు తేదీకి ముందే దేశం నుండి నక్సలిజం పూర్తిగా నిర్మూలిం చబడింది.” అని అమిత్ షా పేర్కొన్నారు.

## కలం కౌంటర్




## 23న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# యాదగిరిగుట్టకు రాక

- 100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఈనెల 22న యాదగిరిగుట్టను సందర్శించనున్న కంచి పీఠాధిపతి శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి

యాదగిరిగుట్ట, మే 19 (ప్రజాకలం) :

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు ఈనెల 23న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం కార్యనిర్వాహణాధికారి భవానీ శంకర్ తెలిపారు. 100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.



తరువాయి 2వ పేజీలో...



## పెండింగ్ బిల్లుల చెల్లింపులకు

# ప్రభుత్వం సిద్ధం

మొదటి పేజీ తరువాయి...

జిల్లాలోని ఇతర సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ వ్యవహారాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. భూసేకరణ నిధుల విడుదలలో ఆలస్యం జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, రైతులకు చెల్లింపులు సమయానికి జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపుల విషయంలో కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని సీఎం ఆదేశించారు. సంబంధిత జిల్లా అధికారులతో తరచూ సమావేశాలు నిర్వహించి ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రాజెక్టులు పూర్తి అయితే రైతులకు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరుతుందని, సాగునీటి విస్తీర్ణం పెరిగి వ్యవసాయ రంగం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, జి. మధుసూదన్ రెడ్డి, టి. మేఘా రెడ్డి, కె. రాజేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ ప్రాంగణాల్లో వీధి కుక్కలకు నో

మొదటి పేజీ తరువాయి...

ఇప్పటికే నవంబర్ 25న జారీ చేసిన ఉత్తర్వులే యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టి కీలక వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కలను పట్టుకుని వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత మళ్లీ అదే పబ్లిక్ ప్రాంగణాల్లో వదిలేయడాన్ని అనుమతించబోమని ధర్మాసనం స్పష్టంచేసింది. ప్రజల భద్రతకు భంగం కలిగే పరిస్థితులను ప్రభుత్వం సహించరాదని పేర్కొంది. వీధి జంతువుల నిర్వహణకు సంబంధించి యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా రూపొందించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ చట్టబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కూడా సుప్రీంకోర్టు పూర్తిగా కొట్టివేసింది.

జంతు సంరక్షణ పేరుతో ప్రజల భద్రతను ప్రమాదంలోకి నెట్టలేమని ధర్మాసనం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా వీధి కుక్కల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండగా, వాటి నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు పూర్తిగా విఫలమయ్యాయని కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జంతువుల జనన నియంత్రణ కార్యక్రమాలు అనేక ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా సాగుతున్నాయని, సరిపడా నిధులు కేటాయించకపోవడం వల్ల పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని వ్యాఖ్యానించింది. స్థానిక సంస్థలు, మున్సిపల్ యంత్రాంగాలు, రాష్ట్ర ప్రభుత్వాలు వీధి కుక్కల నియంత్రణను అత్యంత సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందని ధర్మాసనం సూచించింది. ప్రజలపై కుక్కల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, తక్షణమే అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించింది. పబ్లిక్ ఏరియాల్లో చిన్నారులు, వృద్ధులు, రోగులు భయాందోళనలకు గురికాకుండా ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రజల ప్రాణ భద్రత, ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వాల మొదటి బాధ్యత అని ధర్మాసనం మరోసారి గుర్తుచేసింది.

# పెట్రో బాంబు

మొదటి పేజీ తరువాయి...

ఇంధన వినియోగాన్ని నియంత్రించాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులకు మళ్లీ వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలు చేసే అవకాశాలపై కూడా ఆలోచించాలని సూచించినట్లు సమాచారం. ఇక ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీల పరిస్థితి కూడా రోజురోజుకూ క్లిష్టంగా మారుతోంది. గత వారం లీటరుకు రూ.3 చొప్పున ధరలు పెంచినప్పటికీ నష్టాలు మాత్రం తగ్గడం లేదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం సంస్థలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ విక్రయాల్లో రోజుకు సుమారు రూ.1,380 కోట్ల వరకు నష్టాలను చవిచూస్తున్నాయని నోమురా, ఎలారా క్యాపిటల్ సంయుక్త నివేదిక వెల్లడించింది. అంతేకాదు గ్యాస్ సిలిండర్ ఒక్కింటిపై రూ.420 నుంచి రూ.670 వరకు నష్టం వస్తోందని నివేదిక పేర్కొంది. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే 2 నుంచి 10 ఏళ్లలో ప్రభుత్వ రంగ ఆయిల్ సంస్థలు తమ పెట్టుబడులను పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ భారీ నష్టాల నుంచి ఆయిల్ కంపెనీలను గట్టెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం 2022 రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలో అనుసరించిన విధానాన్నే మళ్లీ అమలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంటే రోజుకు కొన్ని పైసల చొప్పున పెట్రోల్, డీజిల్ ధరలను క్రమంగా పెంచే దిశగా మోడీ సర్కార్ ముందుకెళ్లవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో ఇప్పటికే ద్రవ్యోల్బణ భారం మోస్తున్న సామాన్య ప్రజలకు రాబోయే రోజుల్లో మరింత ఆర్థిక భారం తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# 23న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదగిరిగుట్టకు రాక

మొదటి పేజీ తరువాయి...

మంగళవారం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 23న ఉదయం 9 గంటల 27 నిమిషాలకు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుంటారని అనంతరం, టెంపుల్ సిటీ నందు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వేద పాఠశాల శంకుస్థాపన కార్యక్రమంలో కంచి పీఠాధిపతి శ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో పాల్గొంటారని అనంతరం ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుంది తెలిపారు.

దేవస్థానం కొండపైన నూతనంగా కళ్యాణమంటపం, దీక్షాపరుల సదనం,కొండ కింది నుండి కొండపై వరకు మెట్ల దారి వెంట పైకప్పు షెడ్డును నిర్మించడం, పిఆర్ఓ ఆఫీస్ ఎదురుగా నూతనంగా మాడవీధులకు వెళ్ళేందుకు మెట్ల మార్గం (ఎక్సలేటర్) సదుపాయం ను పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కంచి పీఠాధిపతి శంకరా విజయేంద్ర సరస్వతి పాల్గొంటారని తెలిపారు.

కంచి పీఠాధిపతి శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి వారు ఈనెల 22న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు రానున్నారని తెలిపారు. శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి వారు ఈనెల 22వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి విచ్చేయుచున్నారని 4 గంటల నుండి 4: 45 నిమిషాల వరకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న అనంతరం కొండపైన కళావేదిక వద్ద సాయంత్రం 6 గంటలకు భజన కార్యక్రమంలో పాల్గొంటారని,32 మంది చతుర్వేద పారాయణం అనంతరము విజయేంద్ర సరస్వతి వారు ప్రసంగం ఉంటుందని ఈ కార్యక్రమానికి భక్తులు స్థానికులు అధిక సంఖ్యలో రావాలని ఈ ఓ భవాని శంకర్ తెలిపారు.

# ఉపాధి కూలీల చెంతకు ఎమ్మెల్యే

### - కుక్కలగూడూరులో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పర్యటన - ఉపాధి కూలీలకు మజ్జిగ,టోపీల పంపిణీ

పెద్దపల్లి,మే19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ఉపాధి హామీ కూలీలు,రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ వినూత్నంగా స్పందించారు.పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని కుక్కలగూడూరు గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయన,మండుతున్న భానుడి ఎండలను సైతం లెక్కచేయకుండా,స్వయంగా ట్రాక్టర్ నడుపుకుంటూ నేరుగా కూలీలు పని చేస్తున్న ప్రదేశానికి చేరుకున్నారు.కూలీలతో పాటు స్థానిక రైతులతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి ఇబ్బందులను, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన లబ్ధిదారులందరికీ చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని భరోసా ఇచ్చారు.అనంతరం రైతులతో కలిసి పంటల సాగు,ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులు,నీటి వసతి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ క్రమంలోనే తీవ్రమైన ఎండల దృష్ట్యా కూలీల ఆరోగ్యం కాపాడటం అందరి బాధ్యతని పేర్కొంటూ వారికి ఎండదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు,చల్లని మజ్జిగతో పాటు ఎండ నుంచి రక్షణ కోసం టోపీలను పంపిణీ చేశారు.ఓ సామాన్యుడిలా ఎమ్మెల్యే తమ వద్దకు వచ్చి సమస్యలు అడగడమే కాకుండా,ఎండలో అండగా నిలవడం పట్ల కూలీలు,రైతులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# దళితులను ఆలయ ప్రవేశానికి నిరాకరణ

### ఎల్లమ్మ బోనాలతో దళితుల భారీ రాస్తారోకో - అధికారుల చొరవతో సర్దుమణిగిన వివాదం



పెద్దపల్లి,మే19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నా,కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా కుల వివక్ష రూపంలో అమానవీయ ఘటనలు వెలుగుచూడటం ఆందోళన కలిగిస్తోంది.పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకున్న ఒక ఉదంతం స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామంలో గౌడ కులస్తులు నిర్వహించిన ఎల్లమ్మ బోనాల ఉత్సవాల సందర్భంగా, దళిత సామాజిక వర్గానికి చెందిన వారిని ఆలయ ప్రవేశానికి నిరాకరించడమే కాకుండా,వారిని అవమానపరిచేలా ప్రవర్తించినట్లు ఆరోపణలు వచ్చాయి.ఈ వివక్షకు నిరసనగా ఆగ్రహం వ్యక్తం చేసిన దళితులు, మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు ఎల్లమ్మ బోనాలతో ప్రధాన రహదారిపై బైఠాయించి భారీ రాస్తారోకో నిర్వహించారు.ఘటనపై సమాచారం అందుకున్న రెవెన్యూ,పోలీస్ అధికారులు తక్షణమే స్పందించి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రారంభంలో స్థానిక అధికారులు ఇరు వర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఆశించిన ఫలితం లభించలేదు.పరిస్థితి సున్నితంగా మారడంతో పెద్దపల్లి డిసిపి రాంరెడ్డి, సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు, కాల్వశ్రీరాంపూర్ తహసిల్దార్ రాముడు, ఎస్ఐ వెంకటేష్‌లు స్వయంగా రంగంలోకి దిగారు.ఇరు పక్షాల ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చలు జరిపి,చట్టపరమైన నిబంధనలను వివరించి వారిని సముదాయించడంతో వివాదం శాంతించింది.ఈ ఘటనపై పెగడపల్లి దళితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ స్పష్టం చేశారు.సమాజంలో కులాల మధ్య దూరం తగ్గుతోందని భావిస్తున్న తరుణంలో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు పునరావృతం కావడంపై సామాజిక విశ్లేషకులు విచారం వ్యక్తం చేస్తున్నారు.ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించాల్సింది పోయి,కొందరు వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కులాల మధ్య వైషమ్యాలు రేపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.గతంలోనూ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో దళితుల మధ్య గ్రూపులు సృష్టించడం,అలాగే అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ స్థలం,జమ్మి చెట్టు వివాదాల్లో ఎస్సీ,బీసీ వర్గాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు నాటి సుల్తానాబాద్ సిఐ రాములు సమక్షంలో సమస్యలు పరిష్కారమయ్యాయి.గతంలో పెద్ద రాతుపల్లిలోనూ ఇలాంటి ఘటనే జరగగా,ప్రస్తుత పెగడపల్లి ఉదంతం వెనుక కూడా కొందరు స్వార్థపరుల ప్రమేయం ఉండి ఉండవచ్చని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. మరోవైపు,ప్రతి నెలా నిర్వహించే పౌర హక్కుల దినోత్సవ సభలను కేవలం నామమాత్రంగా నిర్వహించకుండా,రాజ్యాంగ హక్కులు, చట్టాలపై గ్రామీణ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.అలాగే కొన్ని వర్గాల ప్రతినిధులు సైతం బాధితుల అభ్యున్నతిని ఆశించకుండా,తమ సొంత లాభాల కోసమే అమాయకులను వాడుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ,ప్రజల భావోద్వేగాలతో ఆడుకుంటున్న బాధ్యులపై పోలీస్ ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి,చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని సీపీఐ వినూత్న నిరసన

ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, మే 19: పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ట్రాక్టర్‌కు తాడు కట్టి లాగుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కందుకూరి స్వర్ణ (శైలజ) మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో పెట్రోల్ ధర లీటరుకు రూ.113కు, డీజిల్ ధర రూ.101కు చేరిందని తెలిపారు. ప్రభుత్వం పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14 వరకు అదనపు భారం మోపిందని విమర్శించారు.ఇంధన ధరల పెరుగుదలతో నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరిగిపోయాయని, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా ఖర్చులు పెరగడంతో రైతులు, ఆటో కార్మికులు, చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. రవాణా రంగం పూర్తిగా కుదేలవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎలిశాల నాగరాజు, సీనియర్ నాయకులు వల్లభనేని సత్యనారాయణ, మాజీ సర్పంచ్ భద్రమ్మ, పూస రాఘవులు, ఏడిద సుబ్బారావు, పీడియాల రంగమ్మ, గడ్డం వెంకటేశ్వర్లు, పద్దం సత్తెమ్మ,సత్యరాజు , జుట్టు పాక రవి, దానే సావిత్రి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.







## అర్హులైన జర్నలిస్టులకు

# ఇళ్లస్థలాలు కేటాయించాలి

- హౌసింగ్ సొసైటీ కి 23 ఎకరాల స్థలాన్ని అప్పగించాలి
- జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న జర్నలిస్టులకు తీరని అన్యాయం
- రాష్ట్ర క్యాబినెట్ లో ఇళ్లస్థలాలపై వెంటనే ఆమోదం తెలపాలి
- టి యు డబ్ల్యూ జే టిజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ
- ఖమ్మంలో జర్నలిస్టుల నిరసన ప్రదర్శన




ఖమ్మం మే 19 (మహారథి)

జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణి జర్నలిస్టు వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయని, గత ప్రభుత్వం క్యాబినెట్ లో 23.2 ఎకరాల భూమిని ఖమ్మం జర్నలిస్టులకు కేటాయిస్తూ జీవో జారీ చేశారని, కానీ వాటిని అమలు చేయడంలో నేటి పాలక పక్షాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టీజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మం ప్రెస్ క్లబ్ నుంచి మయూరి సెంటర్ మీదుగా అమరవీరుల స్థూపం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద జర్నలిస్టులు నివాళులు అర్పించిన అనంతరం జరిగిన సభలో టి యు డబ్ల్యూ జె (టి జె ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యలు పరిశీలిస్తామని అనేక వాగ్దానాలు చేసిన నేటి పాలకులు అధికారంలోకి వచ్చాక జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ద్వంద వైఖరి అవలంబించడం బాధాకరం అన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా జర్నలిస్టులకు కేటాయించిన 23.2 ఎకరాల భూమిని హౌసింగ్ సొసైటీ ద్వారా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో కాలయాపన చేయడం మంచిది కాదన్నారు. ఈనెల 21న జరిగే క్యాబినెట్ సమావేశంలో సరైన నిర్ణయం తీసుకొని జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు వచ్చే విధంగా ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనేక చీకటి జీవోలు జారీ చేస్తూ కోత విధించే విధంగా వ్యవహరించడం సరైంది కాదు అన్నారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు రామిశెట్టి విజేత, జిల్లా ఉపాధ్యక్షులు మందుల ఉపేందర్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కీ గోపి, నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా వీడియో గ్రాఫర్స్ అధ్యక్షులు నాగరాజు,ఎలక్ట్రానిక్ మీడియా నగర కార్యదర్శి కె .అశోక్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పానకాలరావు, ముత్యాల కోటేశ్వరరావు, రేపాక యాదగిరి, పులి శ్రీను ,మూల జీవన్ రెడ్డి, నాయకులు మురళి, నరేష్, నల్లమోతు శ్రీను, ఉల్లోజు రమేష్, జక్కుల వెంకటరమణ, హుస్సేన్, ఈసంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, శ్రీధర్, ఎన్ రమేష్, సాయి, రామకృష్ణ, తోట గణేష్, పెంటి వెంకటేశ్వర్లు, ఉత్కంఠం శ్రీనివాస్, మహిళ జర్నలిస్ట్ రోజా, రవీందర్ ,నాయుడు, వేణుగోపాల్, శేఖర్, మధు, సుధాకర్, బాబు, లింగయ్య, సతీష్ ,మహేష్, నరసింహారావు, నాగేశ్వరరావు, గుండు శ్రీను, వెంకటేష్ ,తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ప్రజలకు వైద్య పరీక్షలు



రుద్రంగి, మే 19, (ప్రజాకలం ప్రతినిధి)

జన జాతీయ గరిమ ఉత్తవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలోని గిరిజనతండా గ్రామాల్లో వైద్యాధికారులు గ్రామస్తులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలను అందించేందుకు, గిరిజనుల ఆరోగ్య సంరక్షణకు జన జాతీయ గరిమ ఉత్తవ్ కార్యక్రమం ఏర్పాటు చేసి వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. గిరిజన తండాల్లోని ప్రజలకు జనరల్ హెల్త్ పరీక్షలు, మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు, రక్త హీనత వంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ శ్యామాల, సర్పంచ్లు మాలోత్ రాందాస్, దేగావత్ సరిత, నరహరినాయక్, వైద్యాధికారులు రేణుక, హెచ్ఎస్ కౌసల్య, ఎంఎలెచ్పీలు లక్ష్మీప్రసన్న, అర్చన, నవ్య, ఎఎన్ఎంలు కృష్ణవేణి, కవిత, రజిత, రాజేశ్వరి, విజయ, ఏఎన్ఎంలు కృష్ణవేణి, కవిత, ఆశాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నగదు లావాదేవీల సమయంలో

# అప్రమత్తంగా ఉండాలి

### మెట్ పల్లి సీఐ సురేష్ బాబు, ఎస్సై పబ్బా కిరణ్ కుమార్







మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 19 (ప్రజా కలం) నగదు లావాదేవీల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెట్ పల్లి సిఐ సురేష్ బాబు ఎస్ఐ పబ్బా కిరణ్ కుమార్ లు సూచించారు. ఈ సందర్భంగా వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మెట్పల్లి పట్టణంలో బ్యాంకులు, ఏటియం కేంద్రాల వద్ద నగదు లావాదేవీలు చేసిన వ్యక్తులను గమనించి, ద్విచక్ర వాహనాలలో ఉంచిన డబ్బును అపహరించే ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. గత రెండు రోజులలో ఇలాంటి రెండు కేసులు నమోదయ్యాయన్నారు.ప్రజలు నగదు డ్రా చేసిన వెంటనే జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నగదు వాహనాలలో ఉంచి వెళ్లవద్దని, అనుమానాస్పద వ్యక్తులు గమనిస్తే అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకులు, ఏటియంల వద్ద అపరిచితుల సహాయం తీసుకోవద్దన్నారు. నగదు తీసుకున్న వెంటనే నేరుగా ఇంటికి లేదా సురక్షిత ప్రదేశానికి వెళ్లాలన్నారు. బ్యాంకుల పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు లేదా వాహనాల సమాచారం వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ సొమ్మును భద్రంగా భద్రపరుచుకునే విషయంను తేలికగా తీసుకోకుండా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరమని ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ నగదు, విలువైన వస్తువులను కాపాడుకోవాలని వారు తెలిపారు. ఏదైనా ఆపద పొంచి ఉంటే అత్యవసర సమాచారం కోసంలో 100 కు, ఎస్ఐ 8712656794, 8712656819 సమాచారం అందించవచ్చని ఆయన వెల్లడించారు.

# విద్యార్థులకు నైపుణ్యాల శిక్షణపై అవగాహన

### - జిల్లా క్రీడాధికారి సురేష్

పెద్దపల్లి,మే19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లా యువజన,క్రీడా శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ వర్చువల్ మీటింగ్ కార్యక్రమం విజయవంతంగా పూర్తయినట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఎ.సురేష్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ వర్చువల్ మీటింగ్ కార్యక్రమానికి కళాశాల నుండి 255 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారని,ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రస్తుత పోటీ ప్రపంచంలో అవసరమైన వివిధ స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, స్పోర్ట్స్ యూనివర్సిటీ,స్కిల్ యూనివర్సిటీ కోర్సుల గురించి పూర్తి అవగాహన కల్పించారు.వీటితో పాటు దేశ సేవలో భాగస్వామ్యం అయ్యేందుకు వీలుగా అగ్నివీర్ నియామకాలు,ఆర్మ్డ్ ఫోర్సెస్,పారా మిలిటరీ ఫోర్సెస్‌లో ఉన్న విభిన్న కెరీర్ అవకాశాలు,ఉద్యోగాల గురించి విద్యార్థులకు సవివరంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్,వైస్ ప్రిన్సిపాల్,ట్రైనింగ్ ఆఫీసర్లు,అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్లు,తదితరులు పాల్గొన్నారు.



# బావిలో మట్టికుప్పలు పడి ఇద్దరు కూలీల మృతి

### - మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

పెద్దపల్లి,మే19:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

వ్యవసాయ బావి పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు మట్టికుప్పలు కూలి ఇద్దరు కూలీలు మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.ఈ ఘోర ప్రమాదం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బయ్యారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది.స్థానికుల సమాచారం ప్రకారం..బయ్యారం గ్రామంలోని ఒక వ్యవసాయ బావిలో కూలీలు పనులు నిర్వహిస్తుండగా,ఒక్కసారిగా వారిపై ప్రమాదవశాత్తు పెద్ద ఎత్తున మట్టికుప్పలు పడిపోయాయి.ఈ ప్రమాదంలో ఇద్దరు కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.మృతుల పూర్తి వివరాలు,ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

**బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే హామీ**

కూలీల మృతి పట్ల రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ప్రమాద



వార్త తెలియగానే ఆయన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి,వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కష్టాల్లో ఉన్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకుంటామని,తమ ప్రభుత్వం వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యం

### రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ - రూ.7.36 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



గోదావరిఖని,మే19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు మరింత మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు.మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి సెంటర్ లో 7 కోట్ల 36 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు,బీటీ రోడ్లు, వరదనీటి కాలువలు మరియు తాగునీటి సరఫరా వ్యవస్థ అభివృద్ధి పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని తెలిపారు.రహదారులు, డ్రైనేజీ,తాగునీటి సదుపాయాల మెరుగుదలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని పేర్కొన్న ఆయన,చేపట్టిన ప్రతి పని నాణ్యతతో,నిర్దిష్ట కాల వ్యవధిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అలాగే రామగుండం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని,ప్రజల సహకారంతో నగరాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, అరుణశ్రీ,నగర మేయర్,డిప్యూటీ మేయర్,స్థానిక కార్పొరేటర్లు,ముఖ్య నాయకులు,మున్సిపల్ అధికారులు,తదితరు పాల్గొన్నారు.

# మొక్కజొన్న నిల్వలకు పక్కా ఏర్పాట్లు

### - నేటి నుంచే కొనుగోలు కేంద్రాల నుండి తరలింపు

### - అదనంగా 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం సిద్ధం -జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,మే19:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్నను నిల్వ చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.ప్రస్తుతం అందుబాటులో ఉన్న గోదాములకు అదనంగా పెద్దపల్లి మండలం రంగాపూర్‌లోని ఐజీ గోదాంలో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు.మంగళవారం పెద్దపల్లి మండలం రంగాపూర్‌లోని ధాన్యం గోదాములను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మే 20 నుంచి పెద్దపల్లి జిల్లాలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుండి రంగాపూర్ ఐజీ గోదాముకు మొక్కజొన్న రవాణా ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.నిల్వ ప్రక్రియలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూసేందుకు ముందస్తుగా తగినంత మంది హమాలీలను అందుబాటులో ఉ



ంచుకోవాలని సూచించారు.మొక్కజొన్న కొనుగోలు, రవాణా,నిల్వ ప్రక్రియలను అధికారులు పరస్పర సమన్వయంతో నిర్వహించాలని, ఎక్కడా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.గోదాముల వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పించి,నిల్వ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక ఎదుగుదలతోనే సమాజాభివృద్ధి



### - జిల్లా కోఆర్డినేటర్ దయా అరుణ

పెద్దపల్లి,మే19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

మహిళలు సామాజికంగా,ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ అన్నారు.పెద్దపల్లి మండల జాగృతి మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సంక్షేమం కోసం అనేక రకాల పథకాలను అమలు చేస్తున్నాయని,వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మహిళలు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని,ఆపద సమయాల్లో ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం,పోక్సో చట్టం,పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టాల గురించి ఆమె క్షుణ్ణంగా వివరించారు.మహిళలు తమ వ్యక్తిగత పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆపదలో ఉన్న మహిళలు,బాలలు,వృద్ధుల రక్షణ కోసం ప్రభుత్వం కేటాయించిన 1098, 181, 14567, 155326 టోల్ ఫ్రీ నెంబర్ల పనితీరును,అలాగే మిషన్ వాత్సల్య స్కీమ్ ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు.మహిళా,శిశు,దివ్యాంగ మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా అందుతున్న సేవలను లబ్ధిదారులు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీమతి సిహెచ్.శాంతి,మండల సమాఖ్య,వీఓ ఆఫీస్ బేరర్లుతోపాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ఇద్దరు మహిళల మృతికి కారణమైన వ్యక్తి రిమాండ్

గొల్లపల్లి మే 19 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన పురాణం లస్మ క్క, మోతే పొచవ్వ అనే మహిళలు మార్చి 29 న గుంజపడుగు గ్రామం నుండి జగిత్యాలకు వెళ్తుండగా, గుంజపడుగు గ్రామ శివారులో రంగదామునిపల్లి గ్రామానికి చెందిన నర్ర పవన్ ద్విచక్ర వాహనంతో అతివేగంగా వచ్చి పురాణాశీ లస్మక్క ,మోతే పోషవ్వను డీ కోనగా పురాణాశీ లస్మక్క చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందగా మోతే పోషవ్వ హాస్పిటల్లో చికిత్స పొందుతూ మూడు రోజులకు మృతి చెందింది.ఈ ఘటనపై పురాణశీ సంజీవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, తాగిన మత్తులో అతివేగంగా వాహనాన్ని నడిపి ఇద్దరి మృతికి కారణమైన నర్రా పవన్ ను అదుపులోకి తీసుకన్నా సి ఐ రాంనర్సింహారెడ్డి రిమాండ్‌కు తరలించారు ఈ సందర్భంగా సి ఐ. ఎ . రాం నర్సింహారెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి అతి వేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వలన అమాయకుల ప్రాణాలు కోల్పోతున్నారని ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ, బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు.లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నీటి సరఫరా బంద్

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 19 (ప్రజాకలం) మున్సిపల్ కొళాయి నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాస్ గౌడ్ విలేకరులకు తెలిపారు. మిషన్ భగీరథ పంప్ హౌస్ దగ్గర వాల్ మరమ్మత్తు కారణంతో పాటు కొత్తగా వాల్ వేయడం జరుగుతుందని, ఈ నెల 21 న మిషన్ భగీరథ మంచినీరు సరఫరా జరగదన్నారు. ముఖ్యంగా మున్సిపల్



కులాయి నీటి వినియోగదారులు గమనించి ఒక్కరోజు ముందు మిషన్ భగీరథ మంచి నీరు అవసరాలకు సరిపడా నీరును నిలువ ఉంచుకొని పట్టణ ప్రజలు సహకరించగలరని మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు.

# వేములవాడ గోశాలకు 111 గడ్డి కట్టలు బహుకరించిన వెలుగు శేఖర్



ధర్మపురి, మే 19 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం గాదేపల్లి గ్రామానికి చెందిన వెలుగు శేఖర్ గత నాలుగు సంవత్సరాలుగా వేములవాడలోని గోశాలకు ప్రతి సంవత్సరం 111 గడ్డి ఇవ్వడం జరుగుతుంది. అదేవిధంగా మంగళవారం రోజున 111 గడ్డి కట్టలను గోశాల నిర్వాహకులకు అందజేయడం జరిగింది. వెలుగు శేఖర్ మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆశీ స్సుల తో పంటలు మంచిగా పండడం తో గోశాలకు గడ్డిని తీసుకురావడం జరిగిందని ఆయన అన్నారు. గడ్డి కట్టలు లోడ్ చేసి రైతులు గడ్డి ట్రాక్టర్ వెంట వచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధర్మారం, మే 19 : ( ప్రజా కలం ప్రతినిధి ) సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం రోజున ఉదయం ధర్మారం మండలం లోని కొత్తూరు గ్రామం లో ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్, గ్రామ సర్పంచ్ భూక్య సంగీత కలిసి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించ డం జరిగింది. అనంతరం ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ లోని మక్కల కొనుగోలు కేంద్రం కొత్తూరు పరిసర గ్రామాల రైతులకు దూరం అవుతున్న నేపథ్యం లో మంత్రి అడ్లూరి ఆదేశానుసారం కొత్తూరు గ్రామం లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. అలాగే దళారులని నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రంలోనే రైతులు మక్కలు విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాల ని తెలిపారు. ఈ కార్యక్రమం లో కొత్తూరు గ్రామ సర్పంచ్ భూక్యా సంగీత ఆంజనేయులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కొత్త నర్సింహులు, బోట్లవనపర్తి, నర్సింహులపల్లి బంజేరుపల్లి తండా కె గ్రామాల సర్పంచ్ లు రంజిత్ యాదవ్, ఆవుల మల్లయ్య, వాగ్య నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, హమాలీలు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉచిత ఏఐ జీవన నైపుణ్యాల శిక్షణ

### - జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రంగారెడ్డి



పెద్దపల్లి,మే 19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ,జీవన నైపుణ్యాలు అంశాలపై నాలుగు రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతో ఈ నెల మే 27 నుండి 30 వరకు ఈ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ శిక్షణకు 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు వయస్సు ఉండి,ఇంటర్మీడియట్, డిప్లొమా లేదా ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన పెద్దపల్లి జిల్లా అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు.ఆసక్తి గల అభ్యర్థులు మే 26 సాయంత్రం 5 గంటల లోపు పని దినాలలో కరీంనగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు స్టడీ సర్టిఫికెట్స్,కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు,ఆధార్ కార్డ్ జిరాక్స్ ప్రతులతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.ఈ ఉచిత శిక్షణకు సంబంధించిన ఇతర పూర్తి వివరాల కోసం అభ్యర్థులు 08782-268686 నెంబర్‌ను సంప్రదించాలని,జిల్లాలోని అర్హులైన యువతీ యువకులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో ఆయన కోరారు.

ప్రజా కలం
బుధవారం, మే 20, 2026

## ఒకప్పుడు అప్రతిహతం.. నేడు హతం!

దేశంలో కమ్యూనిజం సిద్ధాంతాలను బలోపేతం చేసిన కమ్యూనిస్టు పార్టీలు.. తాజా ఎన్నికలతో కనుమరుగయ్యాయి. ప్రజా పాలనలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన సీపీఐ, సీపీఎం పార్టీలు.. పలు రాష్ట్రాల్లో అధికారం చెలాయించాయి. అయితే.. ఒక్కొక్క దశలో ఎదురైన అనేక సంఘర్షణల కారణంగా కాలానికి అనుగుణంగా దూసుకుపోయే తత్వాన్ని అలవరుచుకోని కారణంగా.. ప్రజా క్షేత్రంలో తమను తామే ఓడించుకుని.. అధికారానికి దూరమయ్యారు. తాజాగా కేరళలో ఎల్‌డీఎఫ్ కూటమి సైతం ఓటమి పాలవడంతో దేశంలో ఎక్కడా కమ్యూనిస్టుల ప్రభుత్వం లేకుండా పోయింది. మొత్తం 36 రాష్ట్రాల్లో ఎక్కడా కమ్యూనిజం ప్రభావం కూడా కనిపించకపోవడం గమనార్హం. 1980వ దశకంలో, సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష పార్టీలు కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లను ఏకకాలంలో పాలించాయి. లోక్‌సభలోనూ సత్తా చాటాయి. 2004లో 60కి పైగా సీట్లు గెలుచుకుని అత్యున్నత స్థాయికి చేరుకున్నాయి. భారత్-అమెరికా అణు ఒప్పందంపై లోక్‌సభలో దాదాపు 60 మంది ఎంపీలు ఉన్న వామపక్ష కూటమి మద్దతు ఉపసంహరించుకోవడంతో, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం బలపరీక్షను ఎదుర్కోవలసి వచ్చింది. ఇది అప్పట్లో పెను సంచలనంగా మారింది. పశ్చిమ బెంగాల్‌లో 1977 నుండి 2011 వరకు వామపక్ష కూటమి అధికారంలో ఉంది. ఈశాన్య రాష్ట్రం త్రిపురను 1993 నుండి 2018 వరకు పాలించింది. ఇక, కేరళలో ప్రతి ఐదేళ్లగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ తాజా ఎన్నికల్లో అధికారం కోల్పోయింది. 1977లో పశ్చిమ బెంగాల్‌లో సీపీఐ(ఎం) అధికారంలోకి వచ్చింది. తద్వారా ఏ రాష్ట్రంలోనైనా ఏ పార్టీకి దక్కని సుదీర్ఘ నిరంతర పాలనను నాంది పలికింది. జ్యోతి బసు 23 సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2000లో బుద్ధదేబ్ భట్టాచార్య సీఎం అయ్యారు. ఆ తర్వాత వామపక్షాలు మరో 11 సంవత్సరాల పాటు బెంగాల్‌ను పాలించాయి. ఈశాన్య రాష్ట్రం త్రిపురలో 1993 నుండి 2018 వరకు వామపక్షాలు అధికారం దక్కించుకున్నాయి. 1993లో రాష్ట్రంలో వామపక్షాలు ఘనవిజయం సాధించాయి. అసెంబ్లీలోని 60 స్థానాలకు గాను సీపీఐ(ఎం) ఒక్కటే 44 స్థానాలను గెలుచుకుంది. 1998 వరకు దశరథ్ దేబ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత మాణిక్ సర్కార్ బాధ్యతలు స్వీకరించి 20 సంవత్సరాలు పాటు ఆ పదవిలో కొనసాగారు. త్రిపురలో 25 ఏళ్ల వామపక్ష కూటమి పాలన 2018లో బీజేపీ అనూహ్యంగా ఓడించడంతో ముగిసింది. 2023లో బీజేపీ విజయాన్ని పునరావృతం చేసింది. కేరళలో సీపీఐ(ఎం) పేలవమైన ప్రదర్శనతో వామపక్షాల చివరి కంచుకోట కూలిపోయింది. ప్రస్తుత ఓట్ల లెక్కింపు సరళి ప్రకారం, ఈ దక్షిణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సునాయాసమైన ఆధిక్యాన్ని సాధించింది. 2016లో అధికారంలోకి వచ్చిన పినరయి విజయన్ నేతృత్వంలోని సీపీఐ(ఎం) లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం అధికారం నుంచి దిగిపోయింది. 1977 తర్వాత తొలిసారిగా భారతదేశంలో కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రి లేక పోవడం గమనార్హం. మరో వైపు దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకుల ఉద్యమాలకు పెట్టింది పేరుగా ఈ పార్టీ ప్రాభవం దక్కించుకుంది. గత వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్ర మహోన్నతమైనది. రష్యా అక్టోబర్ విప్లవ ప్రభావంతోనే ఇండియాలో కూడా 1925లోనే రాడికల్ హ్యూమనిస్టు యంయన్.రాయ్, దత్,యస్ఏ డాంగే, తదితర కార్మిక నేతల నేతృత్వంలో "కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా" సీపీఐ కి అంకురార్పణ జరిగింది. అనాటి బ్రిటిష్ వలసవాదులు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో అప్పట్లో రహస్యంగా పనిచేయవలసి వచ్చింది. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులు ఎన్నెన్నో ఉద్యమాలు చేశారు. గ్రామీణ రైతాంగ ఉద్యమాలు మొదలు, పట్టణ పారిశ్రామిక కార్మికుల ఉద్యమాలు, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు , ఉపాధ్యాయ, బ్యాంకు, రైల్వే, ఆర్టీసీ , ఎలక్ట్రిసిటీ , టెలిఫోన్, ప్రభుత్వ ఉద్యోగులైతేనేమి, బీడీ కార్మికులు, పారిశుద్ధ కార్మికులైతేనేమి, ఇళ్ల స్థలాల ఉద్యమాలైతే నేమి , జీతాలు, కూలీలు, బోనసులు, పని పరిస్థితుల మెరుగుదల మొదలైన వన్నీ కోట్లది ప్రజలకు అందిన మేరకు అవన్నీ కమ్యూనిస్టు ఉద్యమాల ఫలితాలే. లక్షలాది కమ్యూనిస్టు కార్యకర్తల , నాయకుల త్యాగాల ఫలితమే నేడు అమలులో ఉన్న ప్రావిడెంటు ఫండ్ , పెన్షన్, సెలవులు, 8 గంటల పని, తదితర సౌకర్యాలు. ఆదివాసీ గిరిజనులకు,పేదలకు కొన్నియినా భూములు దక్కాయంటే కమ్యూనిస్టులు, నక్సలైట్లు, మావోయిస్టులు, వేలాది మంది ప్రాణ త్యాగాలతో సాధించి పెట్టినవే. ఇంతటి మహత్తర ఉద్యమాల చరిత్ర వేల వేల పేజీలు వేలాది పుస్తకాలుగా డాక్యుమెంట్లుగా రికార్డుయి వున్నాయి.నిజానికి కాంగ్రెస్ పార్టీ గురించి చాలా మంది చర్చిస్తారు. కానీ, కాంగ్రెస్ కంటే కూడా ముందుగానే గ్రామాల్లో పరిఢవిల్లిన పార్టీ సీపీఐ అంటే ఆశ్చర్యం వేస్తుంది. ఏ గ్రామానికి వెళ్లినా.. నాలుగు రోడ్ల కూడలిలో ఎర్ర జెండా ఎగిరేసే దిమ్మెలు దర్శనమిస్తాయి.కనీసంలో కనీసం పది మంది అయినా.. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో కనిపిస్తారు. అలా ఒకప్పుడు ప్రాభవాన్ని సంతరించుకున్న పార్టీ, పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర తదితర రాష్ట్రాల్లో అధికారంలోకి కూడా వచ్చింది. నైజాం రాజరికం ఉన్న తెలంగాణ రాష్ట్రంలో భూస్వామ్య శృంఖలాలు తెంచడంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైనది.ఆంధ్రమహాసభ కార్యక్రమం లో రహస్యంగా ప్రవేశించి గ్రంధాలయ ఉద్యమం,రాత్రి బడులు లాంటి చిన్న చిన్న సంస్కరణల ద్వారా రైతాంగ ఉద్యమానికి పునాదులు వేసింది.వివరకు అది 'తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం' గా మారి ఐదు లక్షల గ్రామాలకు ఎర్రజెండా విస్తరించింది."దున్నే వానికే భూమి"కీలక నినాదం ను ముందుకు తేవడం ద్వారా దేశంలో భూసంస్కరణలు అమలు జరపడానికి కమ్యూనిస్టులు పోరాటమే మూలం. సైద్ధాంతిక గందరగోళం మధ్య నరైన పంథాలో పయనం సాగించలేకపోయిన భారత కమ్యూనిస్ట్ పార్టీ 1964లో రెండుగా చీలింది. సీపీఐ నుంచి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) సీపీఎం పార్టీ అవతరించింది. సీపీఐకి చండ్ర రాజేశ్వరరావు, నల్లమల గిరి ప్రసాద్, సీపీఎంకు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య లాంటి దిగ్గజాలు నేతృత్వం వహించారు. కమ్యూనిస్టు పంథా విషయంలో తిరిగి సీపీఎం పార్టీలో తలెత్తిన విభేదాల మూలంగా 1967లో మరో చీలికకు దారితీసి 'నక్సల్ బరీ 'గ్రామంలో తలెత్తిన తిరుగుబాటుతో (భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు, లెనినిస్ట్ పార్టీ ,సీపీఐ(ఎంఎల్)గా ఉనికిలోకి వచ్చింది.బెంగాల్ నక్సల్బరీ రైతాంగ ఉద్యమం విభేదాలలోనే చారుమజుందార్, కానుసన్యాల్, వినోద్ మిశ్రా లాంటి నేతలు నక్సలైట్ ఉద్యమానికి బాటలు వేశారు. ఆంధ్రప్రదేశ్ లో దేవులపల్లి వెంకటేశ్వరరావు,తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి,పైలా వాసుదేవరావు, కొండపల్లి సీతారామయ్య లాంటి నేతలు పనిచేశారు. కమ్యూనిస్టు ఉద్యమంలో నిజానికి1948 నుండే చీలికలు మొదలయ్యాయి. 1948లో శిబ్దాక్ ఘోష్ విడిపోయి వేరే పార్టీని ఉద్యమాలను నిర్మించారు. అది నేటికీ బలమైన ట్రేడ్ యూనియన్ గా జాతీయ స్థాయిలో కొనసాగుతుంది. నేటికి కూడా కమ్యూనిస్టులు అనేక చీలికలు పేలికలు కావడంతో వారి ఉద్యమాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లోనే సీపీఐ ఎంఎల్ లో అనేక చీలికలు కనిపిస్తాయి. జనశక్తి, ప్రజాపంథా, ప్రతిఘటన, ప్రజాప్రతిఘటన, లిబరేషన్, న్యూడెమోక్రసీ, మావోయిస్టు పార్టీ యూసీసీఆర్ఐ ఎంఎల్ ఇలా చెప్పుకుంటూ పోతే పదుల సంఖ్యలో చీలికలుగా కమ్యూనిస్టు పార్టీ ముక్కలుచెక్కలైంది.నేడు వివిధ పార్టీలుగా , గ్రూపులుగా ఉన్నప్పటికీ వారంత కమ్యూనిస్టు వారసులే అని పేర్కొనవచ్చు. రష్యా, చైనా తదితర తమ్యూనిస్టు దేశాలు కూడా మార్కెట్ ఎకానమీలో భాగమై ముందుకు సాగుతున్నాయి. అంబేద్కర్, నెహ్రూ, లోహియా , కమ్యూనిస్టులు ఎంతో ఆశలు పెట్టుకున్న సోషలిజేషన్ స్థానంలో యూ టర్న్ తీసుకొని ప్రపంచీకరణ పేరిట ప్రయివేటీకరణ ముందుకు సాగుతున్న దశ. ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం స్థానంలో తిరిగి పన్నెండు, పద్నాలుగుగంటల పని విధానం చాపకింది నీరులా ముందుకు వస్తున్నది. సంఘటిత శక్తుల్లో నిరసం ఆవహించింది. వందేళ్లలో ఊహించని వారెందరో ఆర్థిక వ్యవస్థల్లో ఎదిగి రాజకీయాలను నిర్దేశిస్తున్నారు.

## పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం రావాలి

### జాతీయ హరిత దళం జిల్లా కో-ఆర్డినేటర్ గూళ్ళ అంజన్ కుమార్




పెద్దపల్లి,మే19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని,దీనిపై ప్రజల్లో విస్తృత చైతన్యం రావాలని జాతీయ హరిత దళం జిల్లా కో-ఆర్డినేటర్ గూళ్ళ అంజన్ కుమార్ పిలుపునిచ్చారు.తెలంగాణ ప్రభుత్వ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో, తెలంగాణ జాతీయ హరిత దళం సహకారంతో పెద్దపల్లి మండలం అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 99 రోజుల పర్యావరణ అవగాహన కార్యక్రమంలో భాగంగా లక్ష్యంతో కూడిన వేసవి శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు.రక్షించడం-సంరక్షించడం-ప్రోత్సహించడం అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు,స్థానిక పర్యావరణ సమస్యలపై చర్చలు జరిపారు.ఈ సందర్భంగా ఉపరితల,భూగర్భ జలాల కొరత, జ్జల వనరుల కాలుష్యం,గాలి కాలుష్యం,వ్యర్థాల నిర్వహణ సమస్యలు,ప్లాస్టిక్ కాలుష్యం,పరిశుభ్రత లోపం,పచ్చదనం తగ్గిపోవడం వంటి కీలక అంశాలపై అంజన్ కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు స్కిట్స్, డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించగా యోగా,డ్రాయింగ్ పోటీలు ఏర్పాటు చేశారు.పోటీలలో విజేతలైన విద్యార్థులకు పెద్దపల్లి జిల్లా విద్యాధికారి జి.శారద సర్టిఫికెట్లు అందజేశారు.కార్యక్రమం ముగింపులో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో తాము భాగస్వాములు అవుతామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పిఎం.షేక్,వేసవి శిబిరం పీఎం, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం,జీవశాస్త్ర ఉపాధ్యాయులు శ్రీనివాస్,సురేందర్,వంగ అశోక్,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## కొనుగోలు చేసిన వరి ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలి

### మిల్లులకు ధాన్యంతో వచ్చిన లారీలను త్వరగా అన్లోడ్ చేసి పంపించాలి -జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్

ఎండపల్లి, మే 19 : ( ప్రజా కలం ప్రతినిధి )

జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలనే ఉదేశ్యంతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం రోజున పెగడపల్లి మండలం నంచర్ల, దేవి కొండ, రాం నగర్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎండపల్లి మండల కేంద్రంలోని వాయుపుత్ర రైస్ మిల్, గుల్లకోట గ్రామంలోని వరి ధాన్యం కొను గోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శ కంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో ఎటు వంటి నిర్లక్ష్యం ఉండ కూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసు కోవాలని సంబంధిత అధికారులకు తెలి పారు. అదే విధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదే విధంగా మిల్లుల వద్ద త్వరగా అన్ లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అవసరం మేరకు



అందుబాటులో ఉంచు కొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయడం తో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లుల లో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, లోడింగ్, అన్‌లోడింగ్ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ పరి శీలించి సంబంధిత అధికారుల ను, మిల్లర్లను వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లుల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్య వేక్షణ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అలాగే రైతులు విక్రయించిన ధాన్యం సకాలం లో మిల్లులకు చేరేలా చర్యలు తీసు కోవాలని అన్నారు. ఈ కార్య క్రమంలో జగిత్యాల ఆర్డీవో పులి మధు సూదన్ గౌడ్, డిసిఎస్ఓ జితేందర్ రెడ్డి, డీఎస్ఓ మనోజ్, తహసిల్దార్ ఎడ్ల అనిల్, సంబంధిత అధికారులు, సీసీ జక్క శ్రీనివాస్, బెత్తపు లత, గర్వంద రాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతుకు కల్లం కష్టం.. అక్రమార్కులకు మట్టి లాభం

### - పాలకుల నిర్లక్ష్యంపై మాజీ ఎమ్మెల్యే దాసరి ధ్వజం



పెద్దపల్లి,మే19:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి నియోజకవర్గంలో వరి,మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో మరియు చెరువులు, గుట్టల మట్టి అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.మంగళవారం పెద్దపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర,గౌరవం,రక్షణ కల్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు.ఈ ఏడాది రైతులు ఎంతో నమ్మకంతో భారీ ఎత్తున మొక్కజొన్న సాగు చేసినప్పటికీ,ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కొనుగోళ్లు పూర్తిగా నత్తనడకన సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పెద్దపల్లి మార్కెట్ యార్డ్‌లో వందలాది మొక్కజొన్న కుప్పలు పేరుకుపోయినా తూకాలు సకాలంలో జరగడం లేదని,దీంతో రైతులు ఎండనక, రేయనక కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తూ పంటను కాపాడుకోవాల్సిన దయనీయ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఒకవేళ వర్షం పడితే తడిసిన ధాన్యానికి నాణ్యత తగ్గిందనే నెపంతో కొనుగోలు చేయరని, దీనివల్ల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని హెచ్చరించారు. సంచుల కొరతను సాకుగా చూపి అధికారులు రైతులను బయట మార్కెట్లోనే అధిక ధరలకు బార్దాన్ కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, దీనివల్ల ఒక్కో సంచిపై రైతుకు రూ.9 వరకు అదనపు భారం పడుతోందని విమర్శించారు.మరోవైపు వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ,రైస్ మిల్లుల అలాట్‌మెంట్‌లో జరిగిన జాప్యం వల్ల పెద్ద మొత్తంలో ధాన్యం ఇంకా కల్లాల్లోనే మురిగిపోతోందని దాసరి మనోహర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాలకు విరుద్ధంగా మిల్లుల్లో సంచికి 40 కిలోల 650 గ్రాములకు బదులుగా అక్రమంగా 42 కిలోల తూకం వేస్తూ, క్వింటాలుకు దాదాపు 5 కిలోల వరకు తరుగు పేరిట కోతలు పెడుతూ రైతును నిలువునా దోచుకుంటున్నారని మండిపడ్డారు.గతంలో సన్న,సూపర్ ఫైన్ రకాల వరికి అదనపు ధర ఇచ్చేవారని,కానీ ఈసారి అన్నింటినీ కామన్ రకంగా చూపించి గ్రేడ్-1 రకాల రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.ఈ అదనపు ధాన్యం,తరుగు పేరిట దోచుకుంటున్న సొమ్ము మిల్లర్లకా, అధికారులకా లేక ప్రజాప్రతినిధులకా వెళ్తోందో జిల్లా యంత్రాంగం సమాధానం చెప్పాలని నిలదీశారు.రైతులెవరూ కూడా కొనుగోలు కేంద్రాల్లో అదనపు తూకానికి ఒప్పుకోవద్దని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.నియోజకవర్గంలో రైతుల సమస్యలతో పాటు మట్టి మాఫియా విచ్చలవిడిగా చెరువులు,గుట్టలను మింగేస్తోందని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు.వార్తాపత్రికల్లో వరుస కథనాలు వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇటుక బట్టీల కోసం చెరువుల్లోని నీటికి గండి కొట్టి మరీ వదిలేస్తూ,భూసారాన్ని అక్రమార్కులకు అప్పగించడం అమానుషమన్నారు.శివపల్లి,చీమలపేట, పెగడపల్లి, పాలితం,గోపయ్యపల్లి,తురకల మద్దికుంట, ఎదులాపూర్ ప్రాంతాల్లో ఎలాంటి మైనింగ్ అనుమతులు లేకుండా గుట్టలను తవ్వేస్తున్నారని, పెగడపల్లిలో హైకోర్టు స్టే ఉన్నప్పటికీ అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయని ధ్వజమెత్తారు.మా ఊరి మట్టిని ఇవ్వం అని ప్రశ్నిస్తున్న స్థానిక గ్రామస్తులను అక్రమ కేసులు, జైలు శిక్షలతో బెదిరించడం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమన్నారు.మట్టి తవ్వకాల ద్వారా వచ్చే సీనరేజ్ నిధులు నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఉపయోగపడాల్సి ఉండగా,వాటిని ప్రత్యేక ఖాతాల ద్వారా మళ్లించి గ్రామీణాభివృద్ధిని దెబ్బతీస్తున్నారని విమర్శించారు.ఈ నేపథ్యంలో మొక్కజొన్న రైతులకు వెంటనే సరిపడా బార్దాన్ సరఫరా చేసి కొనుగోళ్లు పూర్తి చేయాలని,వరి తూకాన్ని నిబంధనల ప్రకారం 40 కిలోల 650 గ్రాములకే పరిమితం చేసి మిల్లర్ల తరుగు దోపిడీని అరికట్టాలని, గ్రేడ్-1 రకాల ధాన్యానికి న్యాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు.అలాగే రాత్రి వేళల్లో అక్రమంగా తిరిగే మట్టి లారీలపై కఠిన చర్యలు తీసుకుంటూ,చెరువు మట్టిని స్థానిక రైతులకే కేటాయించాలని,మైనింగ్ ఆదాయాన్ని నిబంధనల ప్రకారం గ్రామాలకే చేరేలా జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పు రాజకుమార్,మార్కు లక్ష్మణ్,తాన్నత్రి మోహన్ రావు,గుణపతి,జూపల్లి సందీప్ రావు,బోయిని రాజమల్లు, సలేంద్ర రాములు,ఓదెలు,పెంచల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, నాంసాని సరేష్ బాబు, దయాకర్,ముత్యాల రాజయ్య,పోసాని శ్రీనివాస్,గోపి,కాశిపాక వాసు,రేవల్లి తిరుపతి,సర్వేష్,చాంద్ పాషా,పల్లె మధు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## ధర్మపురి పట్టణంలో విజయలక్ష్మి లాడ్జిని సీజ్ చేసిన అధికారులు

### - పోలీసుల సమక్షంలో లాడ్జిని సీజ్ చేసిన మున్సిపల్ కమిషనర్

### - కరీంనగర్ పీఎంజె జ్యువెలరీ కేసు లో నిందితులు దోపిడికి ముందు లాడ్జిలో మకాం



ధర్మపురి, మే 19 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణం లో మంగళవారం రోజున పోలీసుల సమక్షంలో మున్సిపల్ అధికారులు విజయలక్ష్మి లాడ్జిని సీజ్ చేశారు ఈమధ్య కరీంనగర్ పీఎంజే జ్యువలరీ కేసులో నింది తులు దోపిడికి ముందు ధర్మపురి పట్టణం లో విజయలక్ష్మి లాడ్జిలో మాకం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు మంగళవారం రోజున అధికారులతో కలిసి విజయలక్ష్మి లాడ్జీని సీజ్ చేశారు. ఇట్టి సీజ్ చేసిన కార్యక్రమం లో ధర్మపురి సిఐ ఎలపాటి రామ్ నరసింహారెడ్డి, ధర్మపురి ఎస్సై జి మహేష్, పోలీస్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, పాల్గొన్నారు.

## జిల్లా కాంట్రాక్టర్ల జేఏసీ కన్వీనర్‌గా మోలుమూరి చంద్రశేఖర్



పెద్దపల్లి,మే19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) తెలంగాణ బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ కాంట్రాక్టర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్‌గా మోలుమూరి చంద్రశేఖర్ నియామకమయ్యారు.ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర జేఏసీ చైర్మన్ మంద శ్యామ్ అధికారిక ప్రకటన విడుదల చేశారు.సామాజిక వర్గాల వారీగా కాంట్రాక్టర్ల హక్కుల పరిరక్షణకు,వారి సమస్యల పరిష్కారానికి చంద్రశేఖర్ చొరవ చూపుతారనే నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించినట్లు రాష్ట్ర నాయకత్వం పేర్కొంది.జిల్లా కన్వీనర్‌గా ఎన్నికైన మోలుమూరి చంద్రశేఖర్‌కు పలువురు నాయకులు,కాంట్రాక్టర్లు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.జిల్లాలో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి,కాంట్రాక్టు రంగంలో సామాజిక న్యాయం సాధనకు చంద్రశేఖర్ నిరంతరం కృషి చేస్తారని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర చైర్మన్ మంద శ్యామ్ కి కృతజ్ఞతలు తెలిపారు.పెద్దపల్లి జిల్లాలోని బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ కాంట్రాక్టర్లందరినీ ఏకం చేసి,వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతానని ఆయన స్పష్టం చేశారు.

## ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్యకు 41వ వర్ధంతి నివాళులు



ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, మే-19: అమరజీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి కార్యక్రమాన్ని ఎటపాక మండలం గ్రామంలో మంగళవారం నాడు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పూనెం వెంకట్రావు అధ్యక్షత వహించారు. ముందుగా సుందరయ్య గారి చిత్రపటానికి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఐ.వి. పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సభ్యులు పూలతో సుందరగారికి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఐ వి మాట్లాడుతూ "సుందరయ్య అడుగు జాడల్లో మనమందరం నడుచుకోవాలనీ, రాబోయే తరాలకు సుందరయ్య జీవిత చరిత్రను తెలియపరచలన్నారు.అనంతరం ప్రస్తుత పరిస్థితులు మన కర్తవ్యం" అనే అంశంపై సభ్యులు చర్చించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కాకా అర్జున్ దొర, పార్టీ మండల కమిటీ సభ్యులు ఇరపా సత్యం, బుద్ధుల భద్రయ్య, సోందె రామారావు, జి.హుస్సేన్, పూనెం వెంకట్రావు, సవలం రాము, సీసం అర్జున్, పెనుబల్లి భీష్మారావు, జి.కమల, పూనెం కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

### పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

### సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మాతరావు

పాలేరు మే 19( ప్రజా కలం న్యూస్ ) మోడీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను ఇష్టం వచ్చినట్లు పెంచి సామాన్యుల నడ్డి ఇరుస్తుందని పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మాతరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రం లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ముందుగా సిపిఎం పార్టీ ఆఫీస్ నుండి మండల కేంద్రం వరకు పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా ఆటో కి తాడ్లు కట్టి మండల సెంటర్ వరకు లాగారు. ఈ సందర్భంగా సన్మతరావు మాట్లాడుతూ. దేశ ప్రధాని మోడీ మొన్న జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఎన్నికల ముందు అసలు దేశంలో పెట్రోల్ డీజిల్ రేట్లు పెంచే ప్రసక్తే లేదని ప్రకటించిన మోడీ 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే పెట్రోల్, డీజిల్ రేటు పెంచి తన బుద్ధుని చాటుకున్నాడని ఆయన విమర్శించారు వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, సిపిఎం సీనియర్ నాయకులు శీలం గురుమూర్తి, పాలేరు డివిజన్ కమిటీ సభ్యులు బిక్కసాని గంగాధర్,హాళావత్ నరసింహ, నాయకులు ఎల్లంపల్లి అశోక్, పడిశాల శేషయ్య, ఎర్రబోయిన సురేష్, జవ్వాజి శ్రీను, ఉప్పయ్య, ఉన్నం బాబురావు, నవీన్, వీరబాబు, వీరన్న, నాగేశ్వరరావు, ప్రసాద్, వెంకటేశ్వరరావు, వెంకటనారాయణ, శ్రీను, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు



## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యువతకు నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక కార్యక్రమం



నిర్మల్ మే19 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా పట్టణంలోని రాజీవ్ గాంధీ సాంకేతిక శిక్షణ కేంద్రంలో యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం యువత నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అధికారులు, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి యువతకు అవగాహన కల్పించారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్డ్ టెక్నాలజీ లప్రాధాన్యత ఎక్కువగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుత సాంకేతికతకు తగ్గట్టుగా తమ నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ కల్పనలో యువతకు ఏ విధంగా తోడ్పాటు అందిస్తుందో వివరించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, ఎల్డీఎం రాంగోపాల్, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఐటిఐ అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ వర్క్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా కి అన్నారం పాలకమండలి సభ్యుల వినతిపత్రం అందజేత




( వరంగల్/ పర్వతగిరి) మే 19, ప్రజాకలం ప్రతినిధి. మంగళవారం అన్నారం షరీఫ్ దర్గా అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా తెలంగాణ స్టేట్ వక్ బోర్డు ఆఫీసులో అన్నారం గ్రామ అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేసి గ్రామపంచాయతీ పాలకమండలి, గ్రామంలోని వివిధ పార్టీల నాయకులతో వక్ఫ్బేడ్ చైర్మన్ అజ్మతుల్లా గారిని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయ్యుబ్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట శాసనసభ్యులు నాగరాజు ఆదేశాల మేరకు, చైర్మన్ ను కలిసి గ్రామంలో చేయవలసిన పనులను వినతి పత్రాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్, గ్రామ సీనియర్ నాయకులు గొడుగు బిక్షపతి, గ్రామ పార్టీ అధ్యక్షులు గొడుగు రమేష్, గొడుగు వినయ్, పాలకమండలి సభ్యులు రామకృష్ణ, ముంజంపల్లి నాగరాజు, రాపోలు అనిత, రవీందర్, కొండేటి కొమరమ్మ, రామచందర్, దొంతమల పవన్ కళ్యాణ్, వస్తాం రాధిక సుధాకర్, బత్తిని జలంధర్, గ్రామానికి చెందిన ప్రముఖులు ఉమ్మ గాని రవీందర్, డాక్టర్ బాబు, సీనియర్ నాయకులు మోటపోతుల సారంగపాణి, తదితరులు పాల్గొని గ్రామ అభివృద్ధి ప్రణాళిక తయారు చేసి సమర్పించడం జరిగింది.

## విద్యుత్ తీగలకు తగిలి పాడిగేదె మృతి

### ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలి వేడుకోలు

మల్హర్, మే 19 ప్రజాకలం ప్రతినిధి : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పాడిగేదె మృతి చెందిన సంఘటన మంగళవారం ఉదయం మండలంలోని పెద్దతూండ్ల పంచాయతీ పరిధిలోని గాదంపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... అజ్మీర సారమ్మ (భర్త మంగు నాయక్) కు చెందిన గేదె రోజులాగే ఉదయం మేతకు



వెళ్ళింది. ఆ సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. చనిపోయిన గేదె విలువ సుమారు 60,000 రూపాయల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. ఈ గేదె ద్వారా వచ్చే పాల ఆదాయం ఆ కుటుంబానికి ఏకైక జీవనాధారం. పాడిగేదె మరణంతో తమ ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని బాధితురాలు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు నష్టపరిహారం అందించి, ఆర్థికంగా ఆదుకోవాలని ఆమె వేడుకుంటున్నారు.

## వర్ధన్నపేట ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా నాంపెల్లి రవీందర్ ఏకగ్రీవ ఎన్నిక

### - గ్రామాభివృద్ధికి సమిష్టి కృషితో ముందుకు సాగుతా

### - మండల నూతన అధ్యక్షుడు నాంపల్లి రవీందర్

మే 19(ప్రజాప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట) వర్ధన్నపేట మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వర్ధన్నపేట ఉప సర్పంచ్‌ల ఫోరం సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశంలో కట్రియాల గ్రామ ఉప సర్పంచ్ నాంపెల్లి రవీందర్‌ను మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి హాజరైన వివిధ గ్రామాల ఉప సర్పంచ్‌లు రవీందర్ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ ఆయనను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నాంపెల్లి రవీందర్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారం, ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ కోసం సమిష్టిగా కృషి చేస్తానని తెలిపారు. గ్రామ పంచాయతీల బలోపేతం, అభివృద్ధి పనుల్లో పారదర్శకత, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల ఉప సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకులు రవీందర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో మండలంలోని ఉప సర్పంచ్‌లకు మరింత గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ఉప సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం నూతన అధ్యక్షుడికి ఘన సన్మానం నిర్వహించారు.



## కూసుమంచిలో రైతు నేస్తం కార్యక్రమం

### - పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ప్రారంభం; రైతులకు 50% సబ్సిడీ, డీలర్లకు అప్రమత్తత సూచనలు

పాలేరు మే 19( ప్రజా కలం న్యూస్)

కూసుమంచి మంగళవారం రైతు వేదికలో జరగుతున్న రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, కూసుమంచి రైతు వేదిక ప్రతినిధులు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

మంత్రివర్యుడు కార్యక్రమంలో రైతులకు పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత గురించి వివరణ ఇచ్చారు మరియు ఈ విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం సబ్సిడీలతో పొందవచ్చని తెలిపారు. అనంతరం విత్తిన డీలర్ల కోసం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించి, డీలర్లకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు అందించాలని, ఎప్పటికైనా మార్కెట్ రేట్ (ఎమ్మార్పీ) కంటే ఎక్కువ ధరలో విక్రయించరానని సూచించారు. కృత్రిమ కొరత సృష్టించడం, బ్లాక్ మార్కింగ్ చేయడం ఇంకా రసీదు ఇవ్వకుండా అమ్మకాలు నిర్వహించడం తట్టుకోదగినదేనని ఆయన హెచ్చరించారు. విత్తనాల విక్రయంపై పోలీసులు గ్రామాల్లో అనుమతి లేకుండా అమ్మకాలు జరిగితే వెంటనే మండల




వ్యవసాయ అధికారికి సమాచారం ఇవ్వాలని మంత్రివర్యుడు కోరారు. అదనంగా హెచ్టి పత్తి (హాట్ ) విత్తనాల వివిధ పరిమితుల నేపథ్యంలో ఆ విత్తనాలను విక్రయించడం, కొనుగోలు చేయడం లేదా సాగించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. డీలర్లు తమ స్టాక్ రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు.

కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సతీష్, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్ బిక్షం, మండల వ్యవసాయ అధికారి శ్. రామడుగు వాణి, వ్యవసాయ విస్తారం అధికారులు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని విస్తృతంగా పెంచాలి

### అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్ల పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

### మోడల్ సోలార్ విలేజ్‌లలో రెండు నెలల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు పూర్తి చేయాలి

### సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలి

### గిరిజన ప్రాంతాలు, మిగిలిన హాబిటేషన్లకు వంద శాతం విద్యుత్ కనెక్టివిటీ కల్పించాలి

### విద్యుత్ శాఖ పనులపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం, మే 19( ప్రజా కలం న్యూస్ )

జిల్లాలో గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని విస్తృతంగా పెంచాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్యుత్ శాఖ పనుల పురోగతిపై టీజీఎన్‌పీడీసీఎల్, టీజీ రెడ్‌కో అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రత్యేకంగా గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటు లోకి రావాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. మిగిలిన అన్ని హాబిటేషన్లు, గృహాలకు వంద శాతం విద్యుత్ కనెక్టివిటీ కల్పించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను ప్రత్యక్షంగా సందర్శించి విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో 52 అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుదీకరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని అత్యంత త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ లైన్ల పనులను అత్యుత్తమ నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి వంద మీటర్లను ఒక బ్లాక్‌గా గుర్తిస్తూ భవిష్యత్తులో నిర్వహణ, మరమ్మత్తులు అవసరమైన సమయంలో ఖచ్చితమైన ప్రాంతాన్ని సులభంగా గుర్తించే విధంగా వ్యవస్థ రూపొందించాలని సూచించారు. జిల్లాలో విద్యుత్ స్తంభాలపై కేబుల్, నెట్ లైన్లు ఉండటం వల్ల అంతరాయాలు కలగకుండా సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. మధిర పట్టణంలో అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా కేబుల్, ఇంటర్నెట్ సేవల సంస్థలతో సమన్వయ సమావేశం నిర్వహించాలని సూచించారు. విద్యుత్ లైన్లతో పాటు కేబుల్, నెట్ లైన్లను కూడా భూగర్భంలో ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. భవిష్యత్తులో మున్సిపల్, త్రాగునీటి, తదితర శాఖల పనుల సమయంలో భూగర్భ విద్యుత్ లైన్లు దెబ్బతినకుండా స్పష్టమైన సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రత్యేక అండర్‌గ్రౌండ్ కంపార్ట్‌మెంట్ కేటాయింపు సాధ్యతను కూడా పరిశీలించాలని సూచించారు. జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా అన్ని రంగాలకు సరిపడేలా సబ్‌స్టేషన్ మౌళిక వసతులను నవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. సబ్‌స్టేషన్ నిర్మాణాలకు సంబంధించిన భూసమస్యలను అత్యంత త్వరగా పరిష్కరించాలని, ప్రతి సబ్‌స్టేషన్ పనిని వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. సాంకేతికంగా అనుకూలమైన భూమి అందుబాటులో లేని ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ చేపట్టాలని, అవసరమైన అంచనాలు సక్రమంగా పూర్తి చేసి త్వరితగతిన సమర్పించాలని అధికారులకు సూచించారు. ఖమ్మం జిల్లాలో ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద రెండు చోట్ల ఒక మెగావాట్ సోలార్ ప్రాజెక్టులు నిర్మిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో ఒక ప్రాజెక్టు పూర్తయిందని, రెండవ ప్రాజెక్టు పనులు ఈ నెలాఖరులోగా పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. మోడల్ సోలార్ విలేజ్ పథకం క్రింద ఖమ్మం జిల్లాలో 27 గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో బోనకల్ మండలంలోని 22 గ్రామాలు ఉన్నాయని చెప్పారు. గృహ జ్యోతి పథకం లబ్ధిదారుల ఇళ్లలో 2 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి ఇంటి ద్వారా సుమారు 240 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ప్రజలకు నెలకు 300 నుండి 400 రూపాయల వరకు ఆదాయం లభించడంతో పాటు ఉచిత విద్యుత్ ప్రయోజనం కూడా అందుతుందని వివరించారు. మోడల్ సోలార్ విలేజ్‌లలో వ్యక్తిగత గృహాలు, ప్రభుత్వ సంస్థలు కలిపి మొత్తం 9 వేల 418 నిర్మాణాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటును వచ్చే రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 27 గ్రామాల్లో మొత్తం 4,371 మంది రైతులకు సోలార్ పంప్‌సెట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. టీజీ రెడ్‌కో పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని మరింత పెంచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాస చారి, టెక్నికల్ డిఈ బాబురావు, డిఈలు రామారావు, నాగేశ్వర రావు, రమేష్, భద్రుపవర్, శ్రీనివాస రావు, రెడ్కో జి.ఎం. అజయ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం నిల్వ కొరకు మరిన్ని స్థలాలు సమకూర్చుకోవాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ మే19 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో ధాన్యం నిల్వ చేయుటకు మరిన్ని స్థలాలు సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు, నిల్వ ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే గోదాములకు తరలించాలని చెప్పారు. ముందస్తు జాగ్రత్త చర్యగా అదనంగా, ధాన్యం నిల్వ చేయడానికి అవకాశం ఉన్న ప్రదేశాలు సమకూర్చుకోవాలన్నారు. ఇతర జిల్లాల్లో గోదాములు అందుబాటులో ఉంటే, ఆ ప్రదేశాలు గుర్తించి ధాన్యం అక్కడికి తరలించాలని వివరించారు. ధాన్యం నిరంతరాయం



గా తరలింపునకు అనుగుణంగా తగినన్ని లారీలు, తగినంత మంది హమాలీలు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డిఎం మార్క్ ఫెడ్ మహేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ మే19 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లాలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండలాల వారి జిల్లాలో ఇప్పటి వరకు పూర్తిచేసిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని అన్నారు. అందుబాటులో లేని రైతులకు సంబంధించి వివరాలను వివిధ మార్గాల్లో అన్వేషించాలని సూచించారు. రిజిస్ట్రీ ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సంబంధమైన ఇబ్బందులు ఉంటే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ మొత్తం ఎటువంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఇతర అధికారులు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**జిల్లాలో ఇసుక అక్రమ త్రవ్వకాలు పూర్తిగా నిర్మూలించాలి:**

జిల్లాలో ఇసుక అక్రమ త్రవ్వకాలు పూర్తి స్థాయిలో నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇసుక రీచ్ లను గుర్తించాలన్నారు. అక్రమ ఇసుక త్రవ్వకాలని పూర్తిస్థాయిలో నివారిస్తామని చెప్పారు. కేవలం మన ఇసుక వాహనం యాప్ ద్వారానే ఇసుక అమ్మకాలు పారదర్శకంగా జరగాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చూడాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టినా, రవాణా చేసిన చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో నిఘా ఉంచాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, భూగర్భ జల అధికారి శ్రీనివాస బాబు, డిపిఓ శ్రీనివాస్, రాయల్టీ ఇన్స్పెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో అస్తవ్యస్తం.. ధాన్యం పశువుల పాలు..

### - కాంటాలు పెట్టడంలో తీవ్ర ఆలస్యం

### - హమాలీల కొరతతో పేరుకుపోతున్న కుప్పలు

### - ఆందోళనలో అన్నదాతలు.. పట్టించుకోని అధికారులు..



మల్హర్, మే 19 ప్రజాకలం ప్రతినిధి... ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పాలకుల నిర్లక్ష్యం, అధికారుల తూతూమంత్రం పర్యవేక్షణ కారణంగా అన్నదాతల కష్టం పశువుల పాలవుతోంది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా కాంటాలు పెట్టకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు హమాలీల రాక మందగించడంతో కల్లాల్లోనే ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయి. మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలో కొనుగోలు కేంద్రాల్లో స్థలం సరిపోకపోవడంతో పలువురు రైతులు విధిలేక తాడిచెర్ల సొసైటీ కార్యాలయ సమీపంలో ధాన్యాన్ని కుప్పలుగా పోశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ ధాన్యాన్ని పశువులు తినేయడం, తొక్కేయడంతో పంట మొత్తం పశువుల పాలైన సంఘటన చోటుచేసుకుంది. ఓ వైపు అకాల వర్షాల భయం, మరోవైపు పశువుల కాపలాతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కంటికి రెప్పలా కాపాడుకున్న పంట కళ్లముందే నాశనమవుతుంటే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు కేవలం నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారని, క్షేత్రస్థాయిలో సమస్యలను పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, హమాలీల సంఖ్యను పెంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది.

## తీవ్ర శ్వాస సమస్యతో మహిళకు అత్యాధునిక గుండె చికిత్స

### - ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండానే గుండెకు చికిత్స




హనుమకొండ మే 19 ప్రజా కలం ప్రతినిధి

తీవ్ర శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట వంటి సమస్యలతో బాధపడుతున్న 38 ఏళ్ల మహిళకు వరంగల్ మెడికవర్ హాస్పిటల్ వైద్యులు అత్యాధునిక గుండె చికిత్స ద్వారా కొత్త జీవం ప్రసాదించారు.

సమగ్ర వైద్య పరీక్షల్లో ఆమె గుండెలో సుమారు 3 సెం.మీ పరిమాణంలో ఉన్న పెద్ద ఏట్రియల్ సెప్టల్ డిఫెక్ట్ – అంటే గుండెలో రంధ్రం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ సమస్యకు ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే ఆధునిక ¬ూణ డివైస్ క్లోజర్ విధానం ద్వారా విజయవంతంగా చికిత్స అందించారు. ఈ ప్రక్రియను వరంగల్ మెడికవర్ హాస్పిటల్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా. సంతోష్ మోదాని నేతృత్వంలోని కార్డియాలజీ బృందం విజయవంతంగా నిర్వహించింది. కాథెటర్ ఆధారిత సాంకేతికతతో ప్రత్యేక డివైస్‌ను గుండె వరకు తీసుకెళ్లి రంధ్రాన్ని శాశ్వతంగా మూసివేశారు. పెద్ద శస్త్రచికిత్స అవసరం లేకపోవడంతో రోగి వేగంగా కోలుకుంటున్నారని, వారం రోజుల్లోనే సాధారణ జీవితానికి తిరిగి చేరుకునే అవకాశముందని వైద్యులు తెలిపారు. వరంగల్ మెడికవర్ హాస్పిటల్‌లో ఇదే తొలి విజయవంతమైన ¬ూణ డివైస్ క్లోజర్ కేసు కావడం విశేషమని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఈ విజయంతో ప్రాంతీయ ప్రజలకు అత్యాధునిక ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ సేవలను అందించడంలో మెడికవర్ హాస్పిటల్ మరో ముందడుగు వేసిందన్నారు. ఈ సందర్భంగా డా. సంతోష్ మోదాని మాట్లాడుతూ, "సరైన రోగులలో ASD డివైస్ క్లోజర్ ఓపెన్ హార్ట్ సర్జరీకి ఉత్తమ ప్రత్యామ్నాయం. ఈ విధానంతో తక్కువ నొప్పి, తక్కువ రోజులు ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం, త్వరితగతిన కోలుకునే అవకాశం వంటి అనేక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు.

# వైసీపీ గ్రాఫ్ పెరిగిందా... తగ్గిందా?



విజయవాడ : ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు సమీపిస్తోంది. వచ్చే నెల 12 నాటికి రెండేళ్లు పూర్తికానుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమైన ఈ రెండు సంవత్సరాల్లో.. ఆ పార్టీకి గ్రాఫ్ పెరిగిందా? తగ్గిందా? అంటే సరైన సమాధానం దొరకని పరిస్థితి. అయితే ఒక్క మాట మాత్రం చెప్పగలం. గతంలో అధికారంలో ఉన్నప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరును ఇప్పటికీ ప్రజలు మర్చిపోలేక పోతున్నారు.. అదే సమయంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేసి చూపిస్తోంది. ముఖ్యంగా పారిశ్రామిక పెట్టుబడులతో పాటు అభివృద్ధి పనులను చేసి ప్రజల దృష్టి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు మళ్లకుండా చూస్తోంది. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుణ పాఠాలు నేర్చుకోలేదు. ప్రజలను ఒప్పించే ప్రయత్నం చేయలేదు. వారితో మమేకం కాలేకపోతోంది కూడా. అమరావతి రాజధాని అంశం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నీడలా వెంటాడుతూనే ఉంది. ప్రధానంగా జగన్మోహన్ రెడ్డి తాజాగా ప్రతిపాదన చేసిన మావిగన్ పై ప్రజల్లో ప్రతికూలత తెచ్చింది. ఆయన మాటలను ప్రజలు చాలా తేలిగ్గా తీసుకున్నారు. అదేదో కొత్త ప్రతిపాదన కంటే అమరావతిపై విషం చిమ్మడమే అనేది మెజారిటీ ప్రజల అభిప్రాయం. గతసారి టిడిపి అధికారంలోకి వచ్చినప్పుడు అమరావతిలో గ్రాఫిక్స్ చేశారు అంటూ జగన్మోహన్ రెడ్డి చెప్పిన మాటలను ప్రజలు నమ్మారు. ఇప్పుడు కూడా అమరావతిపై పదే పదే ఆ తరహా ప్రచారం చేయడానికి ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. మొన్నటి ఎన్నికల్లో అమరావతి రాజధాని అనేది ఒక అజెండాగా తీసుకున్నారు ప్రజలు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. అయినా పదేపదే దాని జోలికి వెళ్లి ప్రజా వ్యతిరేకతను మూట కట్టుకుంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. జగన్మోహన్ రెడ్డి శాసనసభకు హాజరు కాకపోవడం సైతం ఆ పార్టీకి మైనస్. కేవలం ప్రతిపక్ష హోదా ఇస్తేనే ప్రజల గురించి సభకు వచ్చి మాట్లాడతానని జగన్ చెప్పడాన్ని ఎవరు హర్షించడం లేదు. పైగా ప్రజల మధ్యకు జగన్మోహన్ రెడ్డి వచ్చింది చాలా తక్కువ. ప్రస్తుతం ఆయన తన సొంత పార్టీ నేతల అరెస్టు సమయంలోను.. వారి ఇళ్లల్లో పరామర్శలకు.. వివాహాలకు మాత్రమే హాజరయ్యారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఆందోళనల సమయంలో సైతం ఆయన హాజరుకావడం లేదు. అదికూడా ఆ పార్టీ గ్రాఫ్ తగ్గించింది. పైగా స్థానికంగా కూడా ఉండడం లేదు. ఇతర రాష్ట్రంలోనాలుగు రోజులు పాటు ఉంటే.. తాడేపల్లిలో మూడురోజులు గడుపుతున్నారు. వీకెండ్ సర్వీసులు బెంగళూరు నుంచి ఉండడంతో ప్రజలు పెద్దగా నమ్మడంలేదు జగన్మోహన్ రెడ్డిని. అన్నింటికీ మించి వైఫల్యాలను అధిగమించడం లేదు ఆ పార్టీ. టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు తెస్తోంది. దీనిని ఆహ్వానించడం లేదు జగన్మోహన్ రెడ్డి. విశాఖకు ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ వచ్చింది. అనుబంధా ఐటీ పరిశ్రమలు వచ్చాయి. అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన జరిగింది. రాయలసీమలో తయారీ రంగ పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. అమరావతిలో అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి. వీటికి ఆహ్వానించక పోగా.. భూ సమీకరణ, భూ సేకరణ పేరుతో అడ్డు తగులుతున్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. ఇలాంటి కారణాలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పడిపోతుంది తప్ప.. ఎంత మాత్రం పెరగడం లేదన్నది విశ్లేషకుల మాట. చూడాలి ఆ పార్టీ పరిస్థితి ఎలా ఉంటుందో..

# చిన్న నేతలపై జ'గన్'



## ఎలివేషన్ ఇస్తున్న మాజీ సీఎం

కర్నూలు : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం కోసం తహతహలాడుతోంది. 2029 ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది. అందుకోసం ఏ చిన్న అవకాశాన్ని కూడా జారవిడుచుకోవడం లేదు. ముఖ్యంగా పార్టీలో చేరికలను ప్రోత్సహించి.. బలోపేతం చేయాలన్నది జగన్మోహన్ రెడ్డి ప్రణాళిక. అందులో భాగంగా రేపల్లె నియోజకవర్గంలో మోపిదేవి శ్రీనివాసరావు అనే నేతను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. పేరులో మోపిదేవి ఉండడంతో.. ఒకప్పటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణకు సమీప బంధువు అని అంతా భావించారు. అయితే ఆయన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గత ఎన్నికల్లో పోటీ చేశారని.. ఆయనకు అక్షరాల 2800 ఓట్లు వచ్చాయని.. నోటాకు కంటే కాస్త ఎక్కువ ఓట్లు అని ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రచారం నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేరికల విషయంలో ఇప్పుడు భిన్న ప్రచారం నడుస్తోంది. ఆ పార్టీలో చేరేందుకు హేమా హేమీలు ముందుకు వచ్చేవారు. అటువంటిది ఓ రెండు వేల ఓట్లు వచ్చిన నాయకుడిని చేర్చుకోవడంలో జగన్మోహన్ రెడ్డి చూపించిన శ్రద్ధ ఇప్పుడు హైలెట్ అవుతోంది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ నుంచి సాకే శైలజానాథ్ చేరిన తర్వాత.. పెద్ద పెద్ద తలకాయలు వస్తాయని అంతా భావించారు. కానీ ఇప్పుడు చిన్న నాయకులను సైతం చేర్చుకునేందుకు జగన్మోహన్ రెడ్డి అంత ఆసక్తి చూపిస్తుండడం మాత్రం విశేషం. జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసినప్పుడు రాజశేఖర్ రెడ్డి సన్నిహితులకు కనీస స్థానం లేదు ఆ పార్టీలో. ఇప్పుడు వారిని రమ్మంటూ పార్టీ నుంచి ఆహ్వానాలు అందుతున్నాయి. కానీ చిన్న నాయకులను సైతం పార్టీలో చేర్చుకునే క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అతి ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. కాంగ్రెస్ పార్టీని విభేదించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేశారు జగన్ మోహన్ రెడ్డి. ఎంతోమంది నేతలకు అవకాశాలు కల్పించారు. 151 మందికి ఎమ్మెల్యేలుగా ఛాన్స్ ఇచ్చారు. ఓ 40 మంది వరకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. ఓ 40 మంది వరకు ఎంపీలుగాఅవకాశం ఇచ్చారు. ఓ 50 మంది వరకు మంత్రులుగాఛాన్స్ కల్పించారు. వందలాది మందికి రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు ఇచ్చారు. అటువంటి జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు ఓ చిన్న నేతను పార్టీలో చేర్చుకునే క్రమంలో ఇస్తున్న ప్రాధాన్యంఅంతా ఇంత కాదు. ఒకప్పుడు ఎమ్మెల్యేలతోపాటు మంత్రులు కలిసేందుకు కూడా అపాయింట్మెంట్ లభించేది కాదు. అటువంటిది ఇప్పుడు ఒక చిన్న నాయకుడు కూడా పెద్ద నేతగా పరిగణిస్తుండడం మాత్రం గొప్ప విషయం..

### కర్నూలులో సైతం

కర్నూలు జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి యాక్టివ్ పాలిటిక్స్ చేస్తున్నారు. ఇటీవల కర్నూలు నగరంలో పర్యటించారు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి. మంత్రిగా ఉన్న టీజీ భరత్ పైనే ఆరోపణలు చేశారు. అనేక రకాల విమర్శలు చేశారు. అదే స్థాయిలో టిడిపి నుంచి ఆయనపై కౌంటర్ అటాక్ ప్రారంభం అయింది. ఏదైనా వివాదం సృష్టించాలి అనుకుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి రంగంలోకి దిగుతారు అనేది టిడిపి నేతలు వాదన. జగన్మోహన్ రెడ్డి వాడుకుంటున్న మనిషిగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పై ఒక విమర్శ ఉంది. దానినే గుర్తు చేస్తున్నారు టిడిపి నేతలు. ఆయన కంటే వెనుక రాజకీయాల్లోకి వచ్చిన ఆయన సోదరి, అంటే పెదనాన్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుమార్తె శబరి ప్రస్తుతం ఎంపీగా ఉన్నారు. కానీ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాత్రం చట్టసభలకు ఇంతవరకు ఎన్నిక కాలేకపోయారు. కర్నూలు జిల్లాలో బైరెడ్డి కుటుంబానికి ప్రత్యేక రాజకీయ ప్రస్థానం ఉంది. ఆ ఫ్యామిలీ ఆది నుంచి తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ వచ్చింది. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తండ్రి కూడా ఎమ్మెల్యేగా వ్యవహరించారు. మంత్రి పదవి చేపట్టారు. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సైతం టిడిపి ద్వారా ఎన్నో పదవులు పొందారు. చట్టసభలకు ఎన్నికయ్యారు. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తమ్ముడు కుమారుడే సిద్ధార్థ రెడ్డి. ఆయనపై పలుమార్లు కేసులు నమోదయ్యాయి. ఫ్యాక్షన్ తరహాలో కామెంట్స్ చేస్తుంటారు. తనకు జైలు జీవితం కొత్త కాదు అన్నట్టు మాట్లాడుతుంటారు. తెలుగుదేశం పార్టీలో కొనసాగిన బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ సమయంలోనే సిద్ధార్థ రెడ్డి సైతం వైసీపీలో చేరారు. అయితే రాజశేఖర్ రెడ్డి తిరిగి బిజెపిలోకి వచ్చి అక్కడి నుంచి.. టిడిపిలో చేరిపోయారు. ప్రస్తుతం ఆయన కుమార్తె ఎంపీగా ఉన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటారు. పిట్ట కథలతో ప్రత్యర్థులపై విరుచుకుపడుతుంటారు. అయితే చట్టసభలకు ఇంతవరకు ఛాన్స్ ఇవ్వలేదు జగన్మోహన్ రెడ్డి. పక్క జిల్లాల్లో సైతం చాలామంది నేతలకు అవకాశం కల్పించింది జగన్మోహన్ రెడ్డి. అటువంటిది ఉద్దేశపూర్వకంగానే బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని జగన్మోహన్ రెడ్డి పట్టించుకోవడం లేదన్న విమర్శ ఉంది. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సొంత నియోజకవర్గం నందికొట్కూరు ఎస్సీలకు రిజర్వ్ చేయబడింది. మరి అటువంటిప్పుడు సిద్ధార్థ రెడ్డికి ఎంపీ సీటు ఇవ్వచ్చు కదా. లేకుంటే వేరే అసెంబ్లీ నియోజకవర్గం కేటాయించవచ్చు కదా? అనే ప్రశ్న వినిపిస్తూ ఉంటుంది. 2014లో ఛాన్స్ దక్కలేదు. 2019లో అవకాశం ఇవ్వలేదు. 2024లో పరిగణలోకి తీసుకోలేదు. అయితే సిద్ధార్థ రెడ్డి మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం గట్టిగానే తపన పడుతున్నారు. ఎక్కడైనా వివాదాస్పద అంశాలను హైలెట్ చేయాలనుకుంటే జగన్మోహన్ రెడ్డి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని ప్రయోగిస్తారన్న టాక్ ఉంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# భారీగా టూ ఇయర్స్ వేడుకలు

విజయవాడ : ఏపీలో టీడీపీ కూటమి పాలనకు రెండేళ్లు పూర్తి కావొస్తోంది. జూన్ 12వ తేదీతో కూటమి పార్టీలు అధికార పగ్గాలు చేపట్టి రెండేళ్లు పూర్తి అయ్యి.. మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త వితంతు పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. జూన్ 12వ కొత్త వితంతు పింఛన్లు జారీ చేయనున్నట్లు మంత్రి ఆదివారం ప్రకటించారు. నెలకు రూ.4 వేలు చొప్పున వీరికి అందించనున్నారు. కొత్త పింఛన్లకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొలుత వితంతు పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించిన ఏపీ ప్రభుత్వం.. ఇందుకు ముహూర్తం ఫిక్స్ చేసింది. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి మూడో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జూన్ 12న వితంతు పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ఏపీ వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు ఆదివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడిన అచ్చెన్నాయుడు.. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి కానున్న నేపథ్యంలో జూన్ 12 నుంచి కొత్త వితంతు పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు త్వరలోనే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా వితంతువుల పింఛన్ల కింద 1.53 లక్షల మంది వరకూ అర్హులుంటారని సెర్ప్ అంచనా వేస్తోంది. నెలకు రూ.4వేల చొప్పున లక్షా 53 వేల మందికి వితంతు పింఛన్లు అందించేందుకు సుమారుగా రూ.61 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చాక స్పౌజ్ పింఛన్లు అందిస్తున్న సంగతి తెలిసిందే. స్పౌజ్ కేటగిరి కింద పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే.. అతని పింఛను మరుసటి నెలలోనే అతని భార్య పేరు మీదకు మార్చుతున్నారు. ఈ కేటగిరీ కింద ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా 2.30 లక్షల మందికి కొత్త పింఛన్లు అందించారు. అయితే పింఛను అందని భర్త చనిపోతే పరిస్థితి వేరుగా ఉంది. చనిపోయిన వ్యక్తి భార్యకు వితంతు పింఛన్ అందించటంలో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే జూన్ 12న అర్హులైన వితంతువులకు పింఛన్లు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది.

# ఒకే నెలలో రెండు సార్లు పెంపు

ఒంగోలు : ప్రతి రోజూ ఉదయాన్నే కప్పు కాఫీ లేదా టీతో రోజును మొదలుపెట్టే సగటు భారతీయుడికి చేదు వార్త. నిత్యావసర వస్తువుల ధరలు ఇప్పటికే ఆకాశాన్ని తాకుతుండగా, ఇప్పుడు ఆ సెగ పాల వరకు పాకింది. దేశీయ పాల ఉత్పత్తుల దిగ్గజాలు అమూల్ , మదర్ డైరీ మరోసారి వినియోగదారులపై ధరల భారాన్ని మోపాయి. లీటర్ పాలపై ఏకంగా రూ. 2 మేర పెంచుతున్నట్లు ప్రకటించి సామాన్యుడి బడ్జెట్‌ను అతలాకుతలం చేశాయి. ఈ కొత్త ధరలు మే 14 నుంచి అమల్లోకి రావడం గమనార్హం. నిజానికి అమూల్ సంస్థ ఈ నెల 1వ తేదీనే పాల ధరలను పెంచింది. ఆ దెబ్బ నుంచి జనం ఇంకా కోలుకోకముందే, కేవలం రెండు వారాల వ్యవధిలోనే మళ్ళీ ధరలు పెంచడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. పశుగ్రాసం ధరలు పెరగడం, ప్యాకేజింగ్ మెటీరియల్ ఖర్చులు భారం కావడం, వీటన్నింటికీ తోడుఅంతర్జాతీయంగా నెలకొన్నఇంధన సంక్షోభం వల్లరవాణా ఖర్చులు విపరీతంగా పెరగడమేఈ నిర్ణయానికి ప్రధాన కారణమని కంపెనీలు చెబుతున్నాయి. మరోవైపు రైతులకు చెల్లించే పాల సేకరణ ధరలను కూడా పెంచామని, ఆ భారాన్ని సర్దుబాటు చేసేందుకే వినియోగదారులపై ఈ వడ్డన తప్పలేదని అమూల్ తెలిపింది.

మారిన ధరల ఇవే

అత్యధికంగా అమ్ముడయ్యే ఫుల్ క్రీమ్, టోన్డ్ పాల ధరలు ఇప్పుడు రూ. 70 మార్కును దాటేశాయి.

అమూల్ కొత్త రేట్లు: అమూల్ గోల్డ్ (ఫుల్ క్రీమ్): రూ. 68 నుంచి రూ. 70కి చేరింది.

అమూల్ తాజా (టోన్డ్): రూ. 55 నుంచి రూ. 57కి పెరిగింది.

అమూల్ ఆవు పాలు: లీటరు రూ. 60.

అమూల్ గేదె పాలు: లీటరు రూ. 78.

మదర్ డైరీ కొత్త రేట్లు:

ఫుల్ క్రీమ్ పాలు: రూ. 70 నుంచి రూ. 72కి పెరిగింది.

టోన్డ్ పాలు: రూ. 58 నుంచి రూ. 60కి చేరింది.

ఆవు పాలు: లీటరు రూ. 62.

టోకెన్ పాలు: లీటరు రూ. 58.

# ఏపీ నుంచి రాజ్యసభకు అన్నామలై?



విజయవాడ : తమిళనాడు రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన మాజీ ఐపీఎస్ అధికారి కె. అన్నామలై ఇప్పుడు పెద్దల సభలో అడుగుపెట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే నెలలో ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాల్లో ఒకదానిని బీజేపీకి కేటాయించాలని కూటమి నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ స్థానంలో ఎవరిని పంపాలనే విషయంపై బీజేపీ హైకమాండ్ సుదీర్ఘంగా చర్చించి, చివరకు అన్నామలై పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. అన్నామలైను ఏపీ నుంచి రాజ్యసభకు పంపడం వెనుక బీజేపీ పెద్ద వ్యూహమే పన్నింది. తమిళనాడులో బీజేపీ ఎదలేకపోతోంది. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుని పని చేసినా ప్రయోజనం లేకపోయింది. ఇప్పుడు అక్కడ సనాతన ధర్మ వివాదం ఉంది. ఈ కోణంలో విజయ్ ప్రభుత్వాన్ని సమర్థవంతంగా ఢీకొట్టాలంటే అన్నామలైకు జాతీయ స్థాయి హోదా ఉండాలని బీజేపీ భావిస్తోంది. ఎంపీగా ఆయనకు దక్కే హోదా, తమిళనాడులో ఆయన గళాన్ని మరింత బలోపేతం చేస్తుందని, తద్వారా హిందూత్వ ముద్రతో బీజేపీని బలోపేతం చేయాలని అనుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ నుంచి ఎన్నికైన పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ నత్వానీ , సానా సతీష్‌ల పదవీ కాలం త్వరలో ముగియనుంది. అసెంబ్లీలో కూటమికి ఉన్న అఖండ మెజారిటీ దృష్ట్యా ఈ నాలుగు స్థానాలు ఏకగ్రీవంగా కూటమి ఖాతాలో పడటం ఖాయం. ఇందులో రెండు స్థానాలను టీడీపీ, ఒకటి జనసేన, మరొకటి బీజేపీ పంచుకునే అవకాశాలు ఉన్నాయి. బీజేపీ తన కోటా స్థానాన్ని అన్నామలైకు కేటాయించాలని చంద్రబాబు నాయుడుతో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. తమిళనాడులో అన్నామలై కేంద్ర మంత్రి కాబోతున్నారన్న ప్రచారంజరుగుతోంది. అన్నాడీఎంకేతో పొత్తు కోసం ఆయనను బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించడంతో ..ఆయనకు ప్రాధాన్యత ఇవ్వాలని పార్లమెంటుకు పంపడం ద్వారా ఆయన స్థాయిని పెంచాలని బీజేపీ యోచిస్తోంది. గతంలోనే విజయసాయిరెడ్డి రాజీనామా సమయంలోనే అన్నామలై పేరు వినిపించినా, అప్పట్లో ఏపీ నేతకే అవకాశం దక్కింది. కానీ ఈ సారి మాత్రం అన్నామలై రాజ్యసభ ఎంట్రీ ఖాయమని తమిళ పొలిటికల్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. తమిళనాడులో అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు కొనసాగుతోంది. అయితే మెజార్టీ ఎమ్మెల్యేలు టీవీకేతో చేరిపోయారు. అన్నామలై రాజ్యసభ ఎంపీగా ఉంటే కూటమిలో ఆయన పాత్ర మరింత కీలకం కానుంది. అటు డీఎంకే, ఇటు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీలను ఎదుర్కోవడానికి అన్నామలై వంటి దూకుడున్న నేత అవసరమని బీజేపీ హైకమాండ్ గట్టిగా నమ్ముతోంది. ఏపీ నుంచి ఆయన పెద్దల సభకు వెళ్తే, అటు ఏపీ అభివృద్ధికి, ఇటు తమిళనాడు రాజకీయ బలోపేతానికి వారధిగా నిలుస్తారని భావిస్తున్నారు.

# కొడాలి, వల్లభనేనిలకు క్లాస్



విజయవాడ : ఏపీలో అత్యంత హాట్ నియోజకవర్గాలు గుడివాడ, గన్నవరం. కృష్ణాజిల్లాలోని ఈ రెండు నియోజకవర్గాలు ఎప్పుడు హాట్ టాపిక్ గా నిలిచేవి. ఎందుకంటే ఇక్కడ ఎమ్మెల్యేలుగా ఉండే కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్ తరచు వివాదాస్పద వ్యాఖ్యలు చేసేవారు. ముఖ్యంగా రాజకీయ అవకాశం కల్పించిన తెలుగుదేశం పార్టీతో పాటు చంద్రబాబుపై విరుచుకుపడేవారు. ఆయన కుమారుడు లోకేష్ పై సైతం వ్యక్తిగత కామెంట్లు చేసేవారు. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఈ ఇద్దరు నేతలు ఒక వెలుగు వెలిగారు. ఇందులో కొడాలి నాని మంత్రిగా కూడా వ్యవహరించారు. అటు వంశీ మోహన్ ఎమ్మెల్యే గా ఉండేవారు. మొన్నటి ఎన్నికల్లో ఆ ఇద్దరూ ఓడిపోయారు. ముందుగా అనారోగ్యానికి గురయ్యారు. ఇంకొకరు జైలుకు వెళ్లి అనారోగ్యం పాలయ్యారు. అయితే ఇప్పుడు ఆ ఇద్దరూ నియోజకవర్గాలకు దూరంగా ఉన్నారు. దీంతో వైసిపి కార్యకలాపాలు నిలిచిపోయాయి. అందుకే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి పిలిచి మాట్లాడినట్లు తెలుస్తోంది. మొన్ననే రేపల్లెలో మోపిదేవి శ్రీనివాసరావు అనే కాంగ్రెస్ నాయకుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు మొన్నటి ఎన్నికల్లో నోటా తో సమానంగా ఓట్లు వచ్చాయి. అయినా సరే అవసరం ఉంది కాబట్టి జగన్మోహన్ రెడ్డి మోపిదేవి శ్రీనివాసరావును పిలిచి పార్టీ కండువా కప్పారు. స్థానిక వైసీపీ ఇన్చార్జ్ మోహన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తారని.. ఆయన గెలుపు బాధ్యతలు తీసుకుంటే.. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నామినేటెడ్ పదవి ఇస్తానని జగన్ హామీ ఇచ్చారు. అయితే ఇప్పుడు గుడివాడ తో పాటు గన్నవరంలో అదే ఫార్ములా తో అడుగులు వేస్తున్నారట జగన్. అందుకే ఆ ఇద్దరు నేతలను పిలిచి చర్చించారట. వారి అభిప్రాయాన్ని సేకరించారట. గుడివాడలో ఇవే తనకు చివరి ఎన్నికలు అని కొడాలి నాని మొన్న ప్రకటించారు. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. గత రెండు సంవత్సరాలుగా గుడివాడలో పార్టీ యాక్టివిటీస్ తగ్గాయి. అదే సమయంలో టిడిపి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దూసుకుపోతున్నారు. గన్నవరం లో కూడా అదే పరిస్థితి. అక్కడి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నియోజకవర్గంలో బలమైన నేతగా ఎదిగారు. అందుకే ఆ రెండు నియోజకవర్గాల్లో టిడిపి పట్టు బిగించడంతో జగన్మోహన్ రెడ్డి పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. గుడివాడలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఓ ఎన్నారై జగన్మోహన్ రెడ్డికి టచ్ లోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఇంకోవైపు గన్నవరం నియోజకవర్గానికి చెందిన మహిళ నేత సుంకర పద్మశ్రీ సైతం వైసీపీలోకి వచ్చేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. ఆమె కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకురాలిగా ఉన్నారు. పిసిసి అధ్యక్ష పదవి ఆశించారు. షర్మిల రూపంలో ఆమెకు ఛాన్స్ మిస్సయింది. అందుకే ఆమె వైసీపీ వైపు చూస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. అందుకే ఇద్దరు నేతలను పిలిచి పార్టీలోకి కొత్తవారు వస్తున్నారని.. ఉంటే మీరు రంగంలో ఉండండి.. లేకుంటే వారికి ఛాన్స్ ఇస్తానంటూ జగన్మోహన్ రెడ్డి కుండ బద్దలు కొట్టినట్లు సమాచారం.

# ఫేక్ కరెన్సీ గ్యాంగ్‌తో పోలీసులు

నెల్లూరు : చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు (జీడి నెల్లూరు) పరిధిలో దొంగనోట్ల ముఠా కలకలం రేపింది. తాము పోలీసులం అని బెదిరించి. కొబ్బరికాయలు కొనుగోలు చేయడానికి వచ్చిన వ్యాపారుల వద్ద నుంచి రూ. 10 లక్షల అసలు నగదును బలవంతంగా లాక్కొని పరారయ్యారు. ఈ కేసులో అత్యంత షాకింగ్ విషయమేమిటంటే.. దొంగనోట్లు మార్పిడి చేసే ఈ ముఠాతో చేతులు కలిపి చిత్తూరు ట్రాఫిక్ ఏఎస్ఐ లోకనాథం, ఏఆర్ కానిస్టేబుల్ రవి తీవ్ర అక్రమాలకు పాల్పడ్డారు. చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే దొంగలతో కలిసి దోపిడీకి ప్లాన్ చేయడం స్థానికంగా తీవ్ర సంచలనంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం.. జీడి నెల్లూరు మిట్ట హరిజనవాడకు చెందిన సెల్వం, దేవా, తమిళనాడులోని వేలూరుకు చెందిన ఇళంగోవన్, చిత్తూరు ట్రాఫిక్ ఏఎస్సై లోకనాథం, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రవి కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. తాము తక్కువ ధరకే దొంగనోట్లు ఇస్తామంటూ తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన మంజు, విజయ్ అనే వ్యక్తులకు ఎర వేశారు.

పది లక్షలు ఇస్తే అందుకు కోటి రూపాయల ఫేక్ కరెన్సీ ఇస్తామని నమ్మించారు. వారి మాటలు నమ్మిన బాధితులు రూ. 10 లక్షల అసలు నగదు తీసుకుని వారు చెప్పినట్లుగానే గంగాధర నెల్లూరుకు వచ్చారు. బాధితులు అక్కడికి చేరుకోగానే.. ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం ఏఎస్ఐ, కానిస్టేబుల్ రంగంలోకి దిగి తాము పోలీసులమంటూ బెదిరించి వారి వద్ద ఉన్న రూ. 10 లక్షల క్యాష్‌ను బలవంతంగా లాక్కొని ముఠాతో కలిసి పరారయ్యారు.

# సీఎంలతోనే హోంశాఖలు



హైదరాబాద్ : ఈ దేశంలో కొత్త ట్రెండ్ పాలనలో సాగుతోంది. ముఖ్యమంత్రులే హోం వంటి పవర్ ఫుల్ శాఖలను స్వయంగా చూస్తున్నారు. నిజానికి రాష్ట్రాలలో కానీ కేంద్రంలో కానీ కీలకమైన శాఖగా నంబర్ టూగా హోం శాఖ ఉంటుంది. లా అండ్ ఆర్డర్ తో ముడి పడి ఉన్న ఈ శాఖ ఎంతో ఇంపార్టెంట్ గా ఉ ంటుంది. రాజకీయంగా కూడా ఈ శాఖకు ఉన్న గ్లామర్ వేరుగా ఉంటుంది. ఒక విధంగా చెప్పాలీ అంటే హోం మంత్రి అంటే వెయిటింగ్ చీఫ్ మినిస్టర్ అని గతంలో చెప్పుకునే వారు. సీనియర్ మోస్ట్ లీడర్ కి ఈ శాఖ కట్టబెట్టేవారు. అయితే మారిన ట్రెండ్ లో చూస్తే ముఖ్యమంత్రులే ఇంతటి బరువైన శాఖను చూస్తున్నారు. తామే ఆ భారాన్ని మోస్తున్నారు. ముందే చెప్పినట్లుగా లా అండ్ ఆర్డర్ ఇపుడు రాజకీయాలను ప్రభుత్వాల తలరాతను శాసిస్తోంది. దాంతో పాటు ప్రభుత్వంలో నంబర్ టూ గా వేరెవరికో చాన్స్ ఇచ్చి తలనొప్పులు తెచ్చుకోవడం ఎందుకు అదేదో వన్ టూ రెండూ తామే ఉండాలన్న ఆలోచన కూడా ఇటీవల కాలంలో ఎక్కువగా వస్తోంది. అందులే దేశంలో సగం రాష్ట్రాలలో ముఖ్యమంత్రులే హోం మంత్రులుగా ఉంటున్నారు. దళపతిగా వెండి తెరను ఏలిన విజయ్ ముఖ్యమంత్రి అయ్యాక కీలక శాఖలను మంత్రులకు కేటాయించారు. ఆయనతో పాటు తొమ్మిది మంది మాత్రమే ఈ నెల 10న ప్రమాణం చేశారు. వారందరికీ తాజాగా ఆయన శాఖలు ప్రకటించారు. అందులో కీలకమైన హోం శాఖను విజయ్ తన వద్దనే ఉంచుకోవడం విశేషం. దాంతో ఆయన హోం, పోలీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ శాఖల ప్రత్యక్ష బాధ్యతలను స్వయంగా నిర్వహించనున్నారు. ఒక విధంగా ముఖ్యమంత్రిగా బాధ్యలతో పాటు హోం శాఖ కూడా కీలకమే కానీ విజయ్ మాత్రం ప్రతిష్టగా తీసుకుని తమిళనాడులో లా అండ్ ఆర్డర్ కి తానే పూర్తి బాధ్యత వహించాలని అనుకుంటున్నారు.

ఇక తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయితే మొదటి నుంచి తన వద్దనే హోం శాఖను ఉంచుకున్నారు. తెలంగాణా కాంగ్రెస్ లో ఎంతో మంది సీనియర్లు ఉన్నారు. కానీ ముఖ్యమంత్రి ప్రత్యేక ఆసక్తితో శ్రద్ధతో ఈ శాఖను రెండున్నరేళ్ళుగా చూస్తున్నారు.ఆయన స్వయంగా హోం శాఖను నిర్వహిస్తూ రాష్ట్రంలోని శాంతిభద్రతలు సాధారణ పరిపాలన విభాగాలను పర్యవేక్షిస్తున్నారు. అలా గట్టి హోం మంత్రిగానే పేరు తెచ్చుకున్నారు.

ఇక మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మహారాష్ట్ర హోం మంత్రిగానూ కొనసాగుతున్నారు. ఆయన ముఖ్యమంత్రిగా తన విధులతో పాటు ఈ పదవిని కూడా నిర్వహిస్తున్నారు. ఒక చాలెంజ్ గా ఆయన స్టేట్ లో లా అండ్ ఆర్డర్ ని నడిపిస్తున్నారు.మమతా బెనర్జీని దించేసి పశ్చిమ బెంగాల్ కి తొమ్మిదవ ముఖ్యమంత్రిగా తాజాగా ప్రమాణం చేసిన సువేందు అధికారి హోం మంత్రిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన రాష్ట్ర హోం కొండ ప్రాంతాల వ్యవహారాల విభాగ శాఖలను చూస్తున్నారు. బెంగాల్ లో లా అండ్ ఆర్డర్ కత్తి మీద సాము లాంటిది. దాంతో పాటు ఢీ అంటే ఢీ గా రాజకీయం సాగుతుంది. దాంతో సువేందు అధికారి ఈ అతి ముఖ్య బాధ్యతలను తానే భుజాల మీద వేసుకున్నారు. మంత్రి షేర్ చేసిన క్రేజీ వీడియో వైరల్ ఇక దక్షిణాన కేరళం రాష్ట్రానికి నిన్నటిదాకా ముఖ్యమంత్రిగా పనిచేసిన పినరయి విజయన్ మొదటి రెండవ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాలు రెండింటిలోనూ హోం మంత్రిగా తానే పనిచేశారు. ఆయన హోం శాఖతో పాటు సాధారణ పరిపాలన, నిఘా సమాచార సాంకేతిక శాఖలను కూడా తన వద్దే ఉంచుకుని రాష్ట్రాన్ని ముందుకు నడిపారు. ఇదే తీరున చూస్తే మధ్యప్రదేశ్‌కు ప్రత్యేకంగా హోం మంత్రి ఎవరూ లేరు. ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ స్వయంగా హోం శాఖను నిర్వహిస్తూ వస్తున్నారు. అలాగే ఉ త్తర ప్రదేశ్‌కు ప్రత్యేకంగా హోం మంత్రిని తీసుకోలేదు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వయంగా హోం శాఖను నిర్వహిస్తున్నారు.

వీరంతా అదే దారిలో : అంతే కాదు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రస్తుతం హోం వ్యవహారాలు న్యాయ శాఖలను నిర్వహిస్తున్నారు. ఆయన మార్చి 2022 లో మంత్రివర్గాన్నిఏర్పాటు చేసినప్పటి నుంచి హోం మంత్రిత్వ శాఖ తన వద్దనే ఉంచుకున్నారు. బీహార్ కి కొత్త ముఖ్యమంత్రి అయిన సామ్రాట్ చౌదరి హోం, సాధారణ పరిపాలన, క్యాబినెట్ సెక్రటేరియట్, విజిలెన్స్, పౌర విమానయానం, ఎన్నికలు వంటి కీలకమైన, అత్యంత ప్రాధాన్యత గల పోర్ట్‌ఫోలియోలను పర్యవేక్షిస్తున్నారు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో ఇతర క్యాబినెట్ మంత్రులకు ప్రత్యేకంగా కేటాయించని అన్ని శాఖలను కూడా ఆయన తన వద్దే ఉంచుకున్నారు. ఇలా అనేక మంది ముఖ్యమంత్రులు హోం శాఖ తమ వద్దనే ఉంచుకున్నారు.

# పొదుపు చర్యలు పాటించండి

విజయవాడ : ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక సంక్షోభాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. "నా దేశం - నా బాధ్యత" అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాబోయే క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమాజం సిద్ధంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ ముందుజాగ్రత్త చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు.ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ఇంధన దిగుమతులు, విదేశీ మారక ద్రవ్యంపై తీవ్ర ఒత్తిడి పడుతోందని, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని మంత్రి వివరించారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పొదుపు చర్యలు పాటించడం ద్వారా దేశానికి మేలు చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చినట్లు తెలిపారు.ఈ పొదుపు చర్యలు తొలుత ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచే ప్రారంభం కావాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని పార్థసారథి తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ కాన్వాయ్‌లలో వాహనాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకోవాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలను పూర్తిగా రద్దు చేసుకోవాలన్నారు. వీలైతే ప్రజా రవాణా వ్యవస్థను ఉ పయోగించుకోవాలని, సమీప ప్రాంతాలకు వెళ్లేటప్పుడు కార్లకు బదులుగా నడక లేదా సైకిల్‌ను ఆశ్రయించాలని సీఎం కోరారు.వారానికి ఒక రోజు (శుక్రవారం) 'నో వెహికల్ డే' పాటించాలని, ఆ రోజు వాహనాలు వినియోగించకుండా వర్చువల్ విధానంలో సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. అధికారులు కూడా వాహనాలను షేర్ చేసుకోవడం ద్వారా ఇంధనాన్ని ఆదా చేయాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఇంధన వినియోగంపై వారానికోసారి సమీక్షించాలని, కొత్తగా కొనుగోలు చేసే వాహనాలు ఎలక్ట్రిక్ (ఈవీ) వాహనాలే అయి ఉండాలని క్యాబినెట్ నిర్ణయించింది.ప్రజలు కూడా ఈ సంక్షోభ సమయంలో బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి కోరారు. విహారయాత్రల కోసం విదేశాలకు వెళ్లే బదులు స్వదేశీ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. బంగారం కొనుగోళ్లపై మోజు తగ్గించుకోవాలని, దీనివల్ల ఏటా వేల కోట్ల డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందని అన్నారు. "స్టెప్ ఫర్ ది నేషన్" పేరుతో నడక, సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు ప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఇంధన, వ్యవసాయ రంగాల్లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టాలని సీఎం ఆదేశించారన్నారు. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు 'పీఎం సూర్యఘర్', 'కుసుమ్' వంటి సౌర విద్యుత్ పథకాలను మరింత వేగవంతం చేయాలని ఇంధన శాఖను ఆదేశించినట్లు చెప్పారు. ప్రస్తుతం లక్షల మందికి మాత్రమే చేరిన ఈ పథకాలను విస్తృతం చేసేందుకు అవసరమైన పరికరాల తయారీదారులతో, సప్లై చైన్‌తో చర్చలు జరపాలని సూచించారన్నారు. అలాగే, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) వంటి ప్రత్యామ్నాయ ఇంధన ప్లాంట్ల ఏర్పాటుకు భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారన్నారు.వ్యవసాయ రంగంలో రసాయనిక ఎరువుల వాడకం విపరీతంగా పెరిగిపోయిందని, ముఖ్యంగా యూరియా వినియోగంలో రైతుల మధ్య చాలా వ్యత్యాసం ఉ ందని పార్థసారథి ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు రైతులు ఎకరానికి రెండు బస్తాలు వాడుతుంటే, మరికొందరు మూడు, నాలుగు బస్తాలు వాడుతున్నారని, ఇది శాస్త్రీయంగా సరైంది కాదన్నారు. అధిక దిగుబడి కోసం కెమికల్స్ వాడకం వల్ల భూసారం దెబ్బతింటోందని, దీన్ని తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖకు సీఎం సూచించారని తెలిపారు. దీనికి ప్రత్యామ్నాయంగా వచ్చిన 'నానో యూరియా' వాడకాన్ని ప్రోత్సహించాలని కోరారు. డ్రోన్ల సహాయంతో నానో యూరియాను పొలం అంతటా సమానంగా చల్లడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని, రైతులు ఈ దిశగా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

హైబ్రిడ్ విధానంపై చర్చ

సశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పొదుపు పిలుపునకు ఏపీ ప్రభుత్వం స్పందించింది. ఇంధన సంక్షోభాన్ని నివారించే ముందస్తు చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలు చేసే అంశంపై ఏపీ సర్కార్ తీవ్రంగా యోచిస్తోంది. కరోనా మహమ్మారి సమయంలో ప్రాచుర్యం పొందిన ఈ విధానం, మళ్లీ ఇప్పుడు యుద్ధ పరిస్థితుల కారణంగా తెరపైకి వచ్చింది. ప్రధాని మోదీ దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పైనా ఉంటుందని, ప్రజలందరూ పొదుపు పాటించాలని సూచించారు. ముఖ్యంగా ఇంధనం వాడకాన్ని తగ్గించడం, అనవసర ప్రయాణాలు మానుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే ఆయన వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని ఒక పరిష్కారంగా ప్రస్తావించారు.

ప్రధాని సూచనల తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు కూడా ఈ విషయంపై స్పందించారు. ఏపీలో ప్రభుత్వ రంగంలోనూ వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధంగా ఉ న్నామని ఆయన ప్రకటించారు. భవిష్యత్తులో ప్రపంచమంతా ఇంటి నుంచే పనిచేసే రోజులు రాబోతున్నాయని, దానికి అనుగుణంగా మన ఆలోచనా విధానంలో మార్పు రావాలని ఆయన పేర్కొన్నారు.

# జిహాదీ డ్రగ్ క్యాప్టగన్ కలకలం

న్యూఢిల్లీ : దేశంలో తొలిసారి భారీ ఎత్తున జీహాదీ డ్రగ్ పట్టుబడింది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా వివాదాస్పద సింథటిక్ డ్రగ్ ' క్యాప్టగన్ 'ను స్వాధీనం చేసుకున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం ప్రకటించారు. 'ఆపరేషన్ రేజ్‌పిల్'లో భాగంగా నిర్వహించిన సోదాల్లో దాదాపు రూ. 182 కోట్ల విలువైన 'క్యాప్టగన్' ట్యాబ్లెట్లను గుర్తించినట్టు తెలిపారు. ఢిల్లీలోని నెబ్ సరాయ్ ప్రాంతంలో ఎన్సీబీ మే 11న ఈ ఆపరేషన్ నిర్వహించింది. ఢిల్లీలో 31.5 కిలోల క్యాప్టగన్ టాబ్లెట్లు దొరికాయని, వీటిని చపాతీ కటింగ్ మెషీన్‌లో రహస్యంగా దాచిపెట్టారని అన్నారు. జెడ్డా, సౌదీ అరేబియా గల్ఫ్ దేశాలకు ఈ డ్రగ్స్‌ను అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించినట్లు అమిత్ షా తెలిపారు.అంతర్జాతీయ డ్రగ్స్ అక్రమ రవాణాతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సిరియా పౌరుడ్ని అరెస్టు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. టూరిస్ట్ వీసాపై 2024 నవంబరు 11న భారత్‌కు వచ్చాడని, జనవరి 1, 2025తో గడువు ముగిసినా అక్రమంగా దేశంలో ఉన్నట్టు గుర్తించారు. అతడి ఇచ్చిన సమాచారం ఆధారంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్ట్‌లో మే 14 సోదాలు నిర్వహించి, మూడు బ్యాగుల్లో దాచిన 196.2 కిలోల టాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టినట్టు పేర్కొన్నారు.అత్యంత చౌక ధరకు లభించే 'క్యాప్టగన్'ను 'జిహాదీ డ్రగ్', 'పేదవాడి కొకైన్'గా పిలుస్తారు. పశ్చిమాసియా దేశాలు, యుద్ధ ప్రాంతాల్లో ఈ డ్రగ్‌ను ఎక్కువగా వినియోగిస్తారు. సిరియా అంతర్యుద్ధం సమయంలో ఐసిస్ ఉగ్రవాదులు పెద్ద ఎత్తున దీనిని ఉ పయోగించారు. ఈ డ్రగ్‌ను తీసుకుంటే ఎక్కువ గంటలు నిద్ర లేకుండా ఉ ండటం, అలసట, భయం లేకపోవడం వంటి ప్రభావాలను కలిగిస్తుంది. అందుకే దీనిని 'జిహాదీ డ్రగ్' అని అంటారు. 1960 దశకంలో దృష్టిలోపం, నార్కోలెప్సీ ఉన్న రోగులకు చికిత్సలో ఈ ఔషధాన్ని ఉపయోగించేవారు. అయితే, దీనిని ఉ పయోగిస్తే ఆ మత్తు అలవాటుగా మారుతుందని చాలా దేశాలు నిషేధించాయి. కానీ ఇది అసలైంది కాదు. ప్రస్తుతం బ్లాక్ మార్కెట్‌లో మాత్రమే లభిస్తోంది. ఈ డ్రగ్‌లో రహస్యంగా యాంఫెటమైన్, మెతాంఫెటమైన్ వంటి హానికారక



రసాయనాలను కలుపుతున్నారు.ఈ డ్రగ్ తీసుకున్న తర్వాత కొద్దిసేపు ఉత్సాహంగా ఉన్నప్పటికీ దీర్ఘకాలికంగా తీవ్ర మానసిక సమస్యలు, హింసాత్మక ప్రవర్తన వంటి దుష్పరిణామాలను కలిగిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈక్వెడార్ నుంచి వచ్చిన ఒక కంటైనర్‌లో దాచి ఉంచిన 349 కిలోగ్రాముల కొకైన్‌ను ముంబయిలో ఇటీవల పట్టుబడిన నేపథ్యంలో తాజా ఘటన ప్రాధాన్యతను సంతరించుకుంది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కోసం అంతర్జాతీయ సిండికేట్లు వాణిజ్య సరుకులను, కంటైనర్ల ద్వారా జరిగే వ్యాపార మార్గాలను వినియోగించుకుంటున్నారనడానికి ఇదో ఉదాహరణ.ఈ సిండికేట్‌కు సంబంధించిన సేకరణ మూలాలు, ఆర్థిక మరియు హవాలా సంబంధాలు, లాజిస్టిక్స్ మధ్యవర్తులు, అంతర్జాతీయ స్వీకర్తలు, మరియు విస్తృత అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను గుర్తించడానికి ఎన్‌సిబి ఒక సమగ్ర దర్యాప్తును ప్రారంభించింది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు దుర్వినియోగం అనే ప్రపంచ సమస్యకు సామూహిక ప్రతిస్పందనను నిర్ధారించడానికి, నిఘా సమాచార మార్పిడి, మాదకద్రవ్యాల కింగ్‌పిన్‌ల అప్పగింత, మరియు మాదకద్రవ్య ఉగ్రవాదం, డ్రగ్ కార్టెల్స్‌పై సమన్వయ చర్యల ద్వారా అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడానికి భారతదేశం కట్టుబడి ఉంది.

# ప్రధాని మోదీ సూత్రాలు, సప్త పరివర్తనను ప్రజలు ఆచరించాలి

**- మాజీ ఎంపీ, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్**



హైద్రాబాద్ ;దేశ ఆర్థిక భద్రత కోసం ప్రధాని మోదీ సూచించిన "సప్త సూత్రాలు - సప్త పరివర్తన"ను ప్రజలు ఆచరించాలని మాజీ ఎంపీ, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉ పాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్ పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూదేశ ఆర్థిక భద్రత కోసం ప్రధానమంత్రి మోదీ సూచించిన "సప్త సూత్రాలు - సప్త పరివర్తన" గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు, ముఖ్యంగా రష్యా?ఉక్రెయిన్ యుద్ధం, గల్ఫ్ ప్రాంత పరిణామాలు వంటి అంతర్జాతీయ పరిస్థితులు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో భారతదేశం "ఆవలవశ్రీనీజూతినిణ ఔజీబితినీని" నుంచి "ఆవలవశ్రీనీజూవట ఔజీబితినీని"గా ఎదగాలంటే దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమన్నారు.దేశ అభివృద్ధి రేటు దెబ్బతినకుండా, భవిష్యత్ ఆర్థిక సవాళ్లను ముందుగానే ఎదుర్కొనేందుకు ప్రధాని మోదీ గారు ప్రజల ముందుకు తీసుకువచ్చిన ఈ సప్త సూత్రాలు రాజకీయాల కోసం కాకుండా దేశ ఆర్థిక భద్రత కోసం చేసినబాధ్యతాయుతమైన విజ్ఞప్తి అని అన్నారు.భారతదేశం ప్రస్తుతం భారీ ట్రేడ్ డెఫిసిట్‌ను ఎదుర్కొంటోందని పేర్కొంటూ, ప్రతి సంవత్సరం సుమారు 700 బిలియన్ డాలర్ల దిగుమతులు జరుగుతుండగా, ఎగుమతులు దాదాపు 400 బిలియన్ డాలర్ల వరకు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో సుమారు 300 బిలియన్ డాలర్ల ట్రేడ్ డెఫిసిట్ దేశ కరెన్సీ విలువపై ప్రభావం చూపుతోందన్నారు.దేశ కుటుంబ పెద్దగా ప్రధాని మోదీ గారు 140 కోట్ల భారతీయుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కొన్ని బాధ్యతాయుతమైన సూచనలు చేశారని పేర్కొన్నారు. "ఖతీవలవనిబితినీని తిబ ఃవబిబివతీ ఎష్ట్రజీని అబీతీవ" అన్న సూత్రంతో భవిష్యత్ సంక్షోభాలను ముందుగానే అరికట్టేందుకు ఈ చర్యలు అవసరమని తెలిపారు.ప్రధాని మోదీ గారు సూచించిన సప్త సూత్రాల్లో ముఖ్యంగా ఒక సంవత్సరం పాటు బంగారం కొనుగోళ్లను వాయిదా వేయాలని కోరారని, శాశ్వతంగా కొనొద్దని కాదు, కేవలం తాత్కాలిక నియంత్రణ మాత్రమేనని స్పష్టం చేశారు.భారతదేశం ప్రపంచంలో చైనా తర్వాత అత్యధికంగా బంగారం దిగుమతి చేసుకునే దేశమని, ప్రతి సంవత్సరం దాదాపు 800 టన్నుల బంగారం దిగుమతి అవుతోందని తెలిపారు. దీని విలువ సుమారు రూ. 5.5 లక్షల కోట్ల నుంచి రూ. 6 లక్షల కోట్ల వరకు ఉంటుందని, ఇందులో 95 శాతం వ్యక్తిగత వినియోగానికే ఉ పయోగపడుతోందన్నారు.భారతీయుల వద్ద ఇప్పటికే ప్రపంచంలోనే అత్యధిక ప్రైవేట్ గోల్డ్ నిల్వలు ఉన్నాయని, కేవలం 25 శాతం బంగారం కొనుగోళ్లు తగ్గించినా భారీగా విదేశీ మారక ద్రవ్యం ఆదాచేయవచ్చన్నారు. అదే మొత్తాన్ని భూమి, తయారీ రంగం లేదా మార్కెట్లలో పెట్టుబడులుగా మళ్లిస్తే దేశ ఆర్థిక వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందని తెలిపారు. పెట్రోల్, డీజిల్ దిగుమతులపై భారత్ భారీగా ఖర్చు చేస్తోందని పేర్కొంటూ, ప్రజలు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, కార్ పూలింగ్, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచి, అనవసర ప్రయాణాలను తగ్గిస్తే విదేశీ మారక ద్రవ్యం ఆదాఅవుతుందన్నారు.కరోనా సమయంలో విజయవంతంగా అమలైన "చినీతీని ఈతీనీఎ ఊనీఎవ" విధానాన్ని సాధ్యమైనంత వరకు కొనసాగిస్తే ఇంధన వినియోగం తగ్గడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు."నేను ఒక డాక్టర్‌గా చెబుతున్నాను? భారతదేశంలో అధికంగా వంటనూనె వినియోగం జరుగుతోంది. ఫ్రైడ్ ఫుడ్స్ అధికంగా తినడం వల్ల బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, ఊబకాయం వంటి అనేక వ్యాధులు పెరుగుతున్నాయి. ప్రతి కుటుంబం నెలకు కనీసం ఒక లీటర్ ఆయిల్ వినియోగం తగ్గించినా దేశానికి వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. ప్రజల ఆరోగ్య ఖర్చులు కూడా తగ్గుతాయి" అని డా. బూర నర్సయ్య గౌడ్ గారు పేర్కొన్నారు.సహజ వ్యవసాయం, ఆర్గానిక్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించడం ద్వారా ఎరువుల దిగుమతులను తగ్గించవచ్చని, భూమి సారాన్ని కాపాడటంతో పాటు రైతులకు దీర్ఘకాల ప్రయోజనం కలుగుతుందని తెలిపారు."స్వదేశీ" ఉత్పత్తులను వినియోగించాలన్న ప్రధాని పిలుపు వెనుక స్పష్టమైన ఆర్థిక దృష్టి ఉందని పేర్కొంటూ, విదేశీ బ్రాండ్లపై ఆధారపడకుండా భారతీయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తే దేశ సంపద దేశంలోనే ఉంటుందన్నారు. చిన్న ఉత్పత్తుల నుంచి లగ్జరీ వాహనాల వరకు స్వదేశీకి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.విదేశీ పర్యటనలు, డెస్టినేషన్ వెడ్డింగ్స్‌పై భారతీయులు భారీగా ఖర్చు చేస్తున్నారని, మన దేశంలోనే అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నప్పుడు విదేశీ ఖర్చులను కొంతవరకు తగ్గించడం ద్వారా కూడా విదేశీ మారక ద్రవ్యం సేవ్ చేయవచ్చన్నారు.ఈ సప్త సూత్రాలను ప్రజలు కనీసం 25 శాతం స్థాయిలో అయినా అమలు చేస్తే దేశ ట్రేడ్ డెఫిసిట్‌ను గణనీయంగా తగ్గించవచ్చని, రూపాయి విలువ బలపడుతుందని, భారతదేశం మరింత ఆర్థికంగా శక్తివంతమైన దేశంగా ఎదుగుతుందని తెలిపారు.బంగారం పెట్టుబడుల కంటే భూమి, ఉత్పత్తి రంగాలు, మార్కెట్లలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వచ్చే అవకాశాలు ఉ న్నాయని పేర్కొన్నారు. అలాగే ఉనీశ్రీట ఇఈలు, ూనీలవతీవతిణని ఉనీశ్రీట ఃనీనిటబ వంటి ప్రత్యామ్నాయాల ద్వారా కూడా పెట్టుబడులు పెట్టవచ్చన్నారు.ప్రధాని మోదీ గారు "ఖతీజీఇబితిఇవ చిష్ట్రజీబి జనీబీ ఖతీవజీఇష్ట్ర" అనే విధానాన్ని స్వయంగా ఆచరిస్తున్నారని పేర్కొంటూ, దేశ నాయకులు, ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు ముందుగా ఈ సూత్రాలను పాటిస్తే ప్రజలు కూడా అనుసరిస్తారని తెలిపారు.భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన "యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః" అనే శ్లోకాన్ని ఉ దహరిస్తూ, నాయకులు ఏది ఆచరిస్తారో ప్రజలు అదే అనుసరిస్తారని పేర్కొన్నారు.

# ఉప్పల్ రింగ్ రోడ్డు మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు



హైదరాబాద్ : ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల కారణంగా ఉప్పల్ రింగ్ రోడ్డు మార్గంలో మూడు నెలల పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. వరంగల్ వైపు వెళ్లే రహదారిని మూసివేయడంతో వాహనాలను జీఎస్ఐ, బీరప్పగడ్డ, ఉప్పల్ భగాయత్, ఓఆర్ఆర్ మార్గాలకు మళ్లించారు. ఉప్పల్, యాదగిరిగుట్ట బస్టాప్‌లను నల్లచెరువు కట్టకు మార్చారు. హబ్సిగూడ-నాగోల్ మార్గానికి ఎలాంటి ఆంక్షలు లేవు. భారీ వాహనాలను హయాత్‌నగర్, ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ మీదుగా మళ్లించారు.హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు అలర్ట్. ఉప్పల్?నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు గాను ఉప్పల్ రింగ్ రోడ్డు పరిధిలో నేటి (ఆదివారం) నుంచి మూడు నెలల పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, రాచకొండ ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ప్రకటించారు. ఉప్పల్ సర్కిల్‌లో వరంగల్ వైపు వెళ్లే ప్రధాన రహదారిని ఆదివారం నుంచి తాత్కాలికంగా మూసివేయనున్నారు. నిర్మాణ సామగ్రి తరలింపు, పిల్లర్ల ఏర్పాటు పనుల దృష్ట్యా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా భారీ ఎత్తున దారి మళ్లింపులు చేపట్టారు. ఇందులో భాగంగా ఉప్పల్ సర్కిల్‌లో ఉన్న వరంగల్ బస్టాప్, యాదగిరిగుట్ట బస్టాప్‌లను తాత్కాలికంగా నల్లచెరువు కట్ట సమీపానికి మార్చారు.రామంతాపూర్ లేదా హబ్సిగూడ వైపు నుంచి వరంగల్ మార్గంలో వెళ్లే వాహనాలను జీఎస్ఐ వద్ద దారి మళ్లించనున్నారు. ఈ వాహనాలు పిస్తా హౌస్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ వెనుక భాగం నుంచి బీరప్పగడ్డ మీదుగా వరంగల్ జాతీయ రహదారిని చేరుకోవాల్సి ఉంటుంది. అలాగే నాగోల్, ఎల్బీనగర్ వైపు నుంచి వరంగల్ వెళ్లే వాహనాలు హయాత్‌నగర్ మీదుగా పెద్ద అంబర్‌పేట్ వద్ద ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు పైనుంచి లేదా సర్వీస్ రోడ్డు మార్గంలో ఘట్కేసర్ వద్ద వరంగల్ జాతీయ రహదారికి చేరుకోవాల్సి ఉంటుంది. వరంగల్ వైపు నుంచి హైదరాబాద్ నగరంలోకి వచ్చే వాహనాలను మేఫీల్ హోటల్ వద్ద దారి మళ్లించనున్నారు. ఈ వాహనాలు ఉప్పల్ భగాయత్ మీదుగా నాగోల్ సర్వీస్ రోడ్డులోకి ప్రవేశించి నాగోల్ ఫ్లైఓవర్ వద్ద యూటర్న్ తీసుకుని నగరం లోపలికి రావాల్సి ఉంటుంది.వరంగల్ నుంచి వచ్చే భారీ సరుకు రవాణా వాహనాలను ఓఆర్ఆర్ మీదుగా హయత్‌నగర్‌కు మళ్లిస్తారు. అదేవిధంగా వరంగల్‌కు వెళ్లే భారీ వాహనాలను కూడా హయత్‌నగర్, ఓఆర్ఆర్ మీదుగా ఘట్‌కేసర్‌కు మళ్లించనున్నారు. ఇక పీర్జాదిగూడ వైపు నుంచి సికింద్రాబాద్ వెళ్లే వాహనాలు ఉప్పల్ జంక్షన్ రాకముందే ఉన్న లక్ష్మారెడ్డి కాలనీ మీదుగా ప్రయాణించి ఉ ప్పల్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న మాస్టర్ చెఫ్ రెస్టారెంట్‌కు చేరుకోవాలి. అక్కడ యూ-టర్న్ తీసుకుని సికింద్రాబాద్ వైపు వెళ్లాల్సి ఉంటుంది.

# సూర్యకు అదే కలిసొచ్చిందా?



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య గత కొంతకాలంగా సరైన బ్లాక్ బస్టర్ కోసం ఎదురుచూస్తున్నారు. భారీ అంచనాల మధ్య వచ్చిన కంగువ, రెట్రో సినిమాలు ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోవడంతో అభిమానుల్లో కూడా కొంత నిరాశ కనిపించింది. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా విడుదలైన కరుప్పు సినిమా ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద హాట్ టాపిక్ గా మారింది. తెలుగులో వీరభద్రుడు పేరుతో విడుదలైన ఆ చిత్రం విడుదలకు ముందే మంచి బజ్ సృష్టించింది. సినిమా ఒక రోజు ఆలస్యంగా థియేటర్లలోకి వచ్చినా, ఓపెనింగ్స్ మాత్రం బాగానే దక్కించుకుంది. అయితే సినిమా విడుదలైన తర్వాత మొదట వచ్చిన స్పందన పూర్తిగా పాజిటివ్ గా లేకపోవడం గమనార్హం. సోషల్ మీడియాలో కొందరు ప్రేక్షకులు కథ, స్క్రీన్ ప్లే, ఎమోషనల్ కనెక్ట్ విషయంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. విమర్శకుల నుంచి కూడా మిక్స్ డ్ రివ్యూలే వచ్చాయి. అయినప్పటికీ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబడుతుండటం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. ఇప్పటికే రూ.100 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించడంతో అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు కరుప్పు సినిమాకు కలిసొచ్చిన అంశాల్లో ప్రధానంగా సమ్మర్ సీజన్ ను చెప్పుకోవాలి. గత కొన్ని వారాలుగా థియేటర్లలో పెద్ద సినిమాలు లేకపోవడం కరుప్పు మూవీకి బాగా ఉపయోగపడిందని మూవీ ఎక్స్పర్ట్స్ చెబుతున్నారు. ఫ్యామిలీ ఆడియన్స్, మాస్ ప్రేక్షకులకు పెద్దగా ఆప్షన్లు లేకపోవడంతో ఆ సినిమా వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. అదే సమయంలో సినిమా పూర్తిగా నెగిటివ్ టాక్ తెచ్చుకోకపోవడం కూడా కలెక్షన్లపై ప్రభావం చూపిందని భావిస్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ ఎలిమెంట్స్ కు మాస్ ఆడియన్స్ నుంచి మంచి స్పందన వస్తోందని సమాచారం. కొన్ని ఫైట్స్, ఎలివేషన్ సీన్స్ థియేటర్లలో విజిల్స్ కొట్టేలా ఉన్నాయని అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. సూర్య స్క్రీన్ ప్రెజెన్స్ కూడా సినిమాకు ప్రధాన బలం అయిందని చెబుతున్నారు. ఫ్యాన్స్ ను టార్గెట్ చేస్తూ మాస్ కమర్షియల్ ఫార్మాట్ లో తెరకెక్కించిన సినిమా బీ, సీ సెంటర్లలో మంచి వసూళ్లు సాధిస్తోందని టాక్. ఇక సినిమాలో హీరోయిన్ గా త్రిష కృష్ణన్ నటించారు. చాలా కాలం తర్వాత సూర్య-త్రిష జోడీ తెరపై కనిపించడం ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచింది. అలాగే కీలక పాత్రల్లో ఇంద్రాన్స్, స్వసిక విజయ్, యోగిబాబు, ఆడుకాలం నరేన్, మన్సూర్ అలీ ఖాన్, జార్జ్ మార్యన్ తదితరులు నటించారు. సినిమాకు దర్శకుడిగా ఆర్జే బాలాజీ వ్యవహరించగా.. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్ పై ఎస్ఆర్ ప్రభు, ఎస్ఆర్ ప్రకాష్ బాబు చిత్రాన్ని నిర్మించారు. సాంకేతికంగా కూడా సినిమా మంచి మార్కులు దక్కించుకుంటోంది. ఏదేమైనా ఇప్పుడు కోలీవుడ్, టాలీవుడ్ వర్గాల్లో ఒకే చర్చ నడుస్తోంది. మిక్స్ డ్ టాక్ వచ్చినప్పటికీ సరైన సమయంలో విడుదల కావడం, పెద్ద పోటీ సినిమాలు లేకపోవడం, మాస్ ఎలిమెంట్స్ పనిచేయడం వంటి అంశాలు కరుప్పు మూవీకి కలిసి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం థియేటర్లలో సినిమా మంచి ఆక్యుపెన్సీతో కొనసాగుతుండటంతో ఫైనల్ రన్ లో మూవీ ఇంకెంత వసూళ్లు సాధిస్తుందో చూడాల్సి ఉంది.

# మహిళా దర్శకురాలితో మాస్ హీరో.. ఇండస్ట్రీలో కొత్త ట్రెండ్!

పాన్ ఇండియా లెవెల్‌లో కేజీఎఫ్' సిరీస్‌తో తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్న రాకింగ్ స్టార్ యష్, తన తదుపరి చిత్రం 'టాక్సిక్' కోసం ఒక విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా భారీ మాస్ యాక్షన్ సినిమాలను పురుష దర్శకులే తెరకెక్కిస్తుంటారు. కానీ యష్ ఆ రొటీన్ ఫార్ములాను బద్దలు కొడుతూ గీతూ మోహన్‌దాస్ వంటి మహిళా దర్శకురాలికి అవకాశం ఇచ్చారు. ఈ క్రేజీ కాంబినేషన్ ఇప్పుడు ఇండస్ట్రీలో సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టింది. ఆ వివరాలు తెలుసుకుందాం.. కేజీఎఫ్ లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత ఏ హీరో అయినా మళ్లీ అదే తరహా కమర్షియల్ యాక్షన్ కథల వైపు వెళ్లాలని చూస్తారు. కానీ యష్ మాత్రం రొటీన్ కథలకు భిన్నంగా వెళ్లాలనుకుంటున్నారు. 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' ద్వారా సరికొత్త యాక్షన్ శైలిని ఆడియన్స్‌కు పరిచయం చేయడమే ఆయన ప్రధాన ఉద్దేశం. ఇక అందుకే ఈసారి ఒక సరికొత్త ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఇక భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఒక టాప్ కమర్షియల్ మాస్ హీరో, ఒక లేడీ డైరెక్టర్‌పై ఇంతటి నమ్మకం ఉంచడం నిజంగా విశేషం. యష్ తీసుకున్న ఈ నిర్ణయం టాలీవుడ్,కోలీవుడ్, బాలీవుడ్ లలో ఒక కొత్త చర్చకు దారితీసింది. యాక్షన్ సినిమాలను కేవలం పురుష దర్శకులు మాత్రమే చేయగలరు అని అందరు అనుకునే మాటను ఈ సినిమాతో మార్చబోతున్నారు ఎమోషన్స్‌కు పెద్ద పీట: మగ దర్శకులు యాక్షన్ మరియు ఎలివేషన్లను బాగా చూపించగలరు కానీ, కథలోని డీప్ ఎమోషన్స్ కొన్నిసార్లు మిస్ అవుతుంటారని యష్ అభిప్రాయపడ్డారు. అదే ఒక మహిళా దర్శకురాలైతే పాత్రల మధ్య ఉండే ఎమోషన్స్‌ను చాలా సహజంగా, లోతుగా ఆవిష్కరించగలరని ఆయన నమ్ముతున్నారు. దీన్ని బట్టి 'టాక్సిక్' లో కేవలం మైండ్ బ్లోయింగ్ యాక్షన్ మాత్రమే కాదు.. గుండెల్ని పిండేసే ఎమోషన్ కూడా గట్టిగా ఉండబోతోందని అర్థమవుతోంది. ఇక దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ గతంలో 'మూతన్' వంటి




అంతర్జాతీయ స్థాయి అవార్డు విన్నింగ్ సినిమాలు తీశారు. ఆమె మేకింగ్ స్టైల్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. 'టాక్సిక్' సినిమాను కేవలం ఇండియన్ మార్కెట్ కోసమే కాకుండా, గ్లోబల్ లెవెల్ ఆడియన్స్‌కు నచ్చేలా అంతర్జాతీయ ప్రమాణాలతో తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో యష్ సరసన నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషీ, తారా సుతారియా మరియు రుక్మిణి వసంత్ వంటి పాన్ ఇండియా తారాగణం నటిస్తుండటం సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. ఈ చిత్రం మొదట జూన్ 4 న విడుదల కావాల్సి ఉంది. అయితే, అంతర్జాతీయ మార్కెట్లో విస్తృతంగా ప్రమోషన్లు ప్లాన్ చేయడం మరియు ఇతర పోస్ట్ ప్రొడక్షన్ కారణాల వల్ల మేకర్స్ ఈ రిలీజ్ డేట్ ను ప్రస్తుతానికి వాయిదా వేశారు. ఈ భారీ ప్రాజెక్ట్‌ను మరింత పర్ఫెక్ట్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర యూనిట్ శ్రమిస్తోంది. త్వరలోనే కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనున్నారు. ఒక మాస్ హీరో మహిళా దర్శకురాలితో చేతులు కలపడం అనేది భారతీయ సినిమా రాతను మార్చే సరికొత్త ట్రెండ్. యాక్షన్ మరియు ఎమోషన్స్ కలబోతగా వస్తున్న 'టాక్సిక్' సినిమా రాకింగ్ స్టార్ యష్ కెరీర్‌లో మరో మైల్‌స్టోన్‌గా నిలవడమే కాకుండా, గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

# ప్రొఫైల్ కోసం పర్ఫెక్ట్ లుక్.. ఆకట్టుకుంటున్న శోభిత!



సోషల్ మీడియా వేదికగా సెలబ్రిటీలు పంచుకునే ఫోటోలు అభిమానులను ఆకట్టుకోవడమే కాదు.. ఫాలోవర్స్ ను కూడా పెంచుతున్నాయి. అందులో భాగంగానే ఈ మధ్యకాలంలో సెలబ్రిటీలు చాలా అందంగా, ట్రెడిషనల్ గా ముస్తాబయ్యి ఆకట్టుకుంటుంటే .. మరికొంతమంది గ్లామర్ డోస్ పెంచేసి సెగలు పుట్టిస్తున్నారు. ఇంకొంతమంది లేడీ బాస్ గెటప్లో మైమరపింప చేస్తున్నారు అనడంలో సందేహం లేదు. అలాంటి వారిలో అక్కినేని కోడలు శోభిత ధూళిపాల కూడా ఒకరు . అటు సంప్రదాయానికైనా ఇటు ఫ్యాషన్ సెన్స్ కైనా కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన ఈ ముద్దుగుమ్మ ..తాజాగా ప్రొఫైల్ కోసం పర్ఫెక్ట్ లుక్ లో కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. తాజాగా ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ఆ ఫోటోల కింద లింక్డ్ ఇన్ ప్రొఫైల్ కోసం అంటూ క్యాప్షన్ కూడా జోడించింది ఇక ఈ ఫోటోలు కాస్త సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో నెటిజన్స్ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. లింక్డ్ ఇన్ ప్రొఫైల్ కోసం శోభిత ధూళిపాల చాలా అందంగా ముస్తాబయింది అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇక ఇందులో నేవీ బ్లూ షూట్ ధరించి జుట్టును క్రాప్ చేసి చాలా స్టైలిష్ గా కనిపించింది ఈ ముద్దుగుమ్మ. ఇక మెడను సింపుల్ నెక్ చైన్ తో ఫుల్ ఫిల్ చేసిన శోభిత స్టైలిష్ ఫోజులు ప్రేక్షకులను మెస్మరైజ్ చేసాయి. మొత్తానికైతే లింక్డ్ ఇన్ లో పెట్టడానికి ఈ ఫోటోలు షేర్ చేశాను అంటూ శోభిత చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. శోభిత విషయానికి వస్తే.. బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన ఈమె విశాఖపట్నంలో లిటిల్ ఏంజెల్ స్కూల్, విశాఖ వ్యాలీ స్కూల్లో తన విద్యాభ్యాసం పూర్తి చేసింది. ముంబై యూనివర్సిటీ హెచ్ ఆర్ కాలేజ్ లో కామర్స్ అండ్ ఎకనామిక్స్ పూర్తి చేసిన ఈమె భరతనాట్యం, కూచిపూడి వంటి సాంప్రదాయ నృత్యాలలో శిక్షణ కూడా పొందింది. ఇండస్ట్రీలోకి రాకముందు మోడల్ గా కెరియర్ ను ఆరంభించిన శోభిత.. 2013 మిస్ ఇండియా అందాల పోటీలో పాల్గొని రెండవ స్థానంలో నిలిచింది.అలాగే 2013లో జరిగిన మిస్ ఎర్త్ ఇండియా అందాల పోటీలలో ఇండియా తరపున పాల్గొని అందరి దృష్టిని ఆకట్టుకుంది. ప్రస్తుతం అంతర్జాతీయంగా పాపులారిటీ సొంతం చేసుకున్న శోభిత తొలిసారి అడివి శేష్ హీరోగా, మహేష్ బాబు నిర్మించిన మేజర్ సినిమాలో కీలకమైన పాత్ర పోషించి, తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది. 2016లో అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించిన రామన్ రాఘవ్ 2.0 లో తొలిసారి తెరపై కనిపించింది. బాలీవుడ్ లోనే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరించిన ఈ ముద్దుగుమ్మ.. అక్కినేని నాగచైతన్య తో ప్రేమలో పడి సౌత్ లో ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంది. ముఖ్యంగా నాగచైతన్యతో నిశ్చితార్థం జరిగిన తర్వాత ..టాలీవుడ్ లోనే కాదు ఇండియాలోనే అత్యంత ప్రజాదారణ పొందిన నటీమణిగా పేరు సొంతం చేసుకుంది ..ఇక 2024 ఆగస్టు 4న అన్నపూర్ణ స్టూడియోలో నాగచైతన్యతో ఏడడుగులు వేసింది శోభిత. పెళ్లి తర్వాత కూడా సినిమాలు, సిరీస్ లు చేస్తూ బిజీగా మారిపోయింది.

# బ్లూ అవుట్ ఫిట్ లో పాయల్ హొయలు..



టాలీవుడ్ లో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' సినిమాలతో బలమైన ముద్ర వేసుకుంది బోల్డ్ అండ్ బ్యూటిఫుల్ హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్. తాజాగా ఈ అమ్మడు ఇన్స్టాగ్రామ్‌లో షేర్ చేసిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. నేవీ బ్లూ కలర్ హాల్టర్ నెక్ అవుట్‌ఫిట్‌లో పాయల్ అల్ట్రా స్టైలిష్‌గా మెరిసిపోయింది. "ఇన్‌హేల్ -ఎక్స్‌హేల్ " అంటూ షేర్ చేసిన ఈ ఫోటోషూట్‌లో ఆమె గ్లామర్, రాయల్ లుక్ అభిమానులను తెగ ఆకట్టుకుంటోంది. పాయల్ రాజ్‌పుత్ సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ తన లేటెస్ట్ అప్‌డేట్స్‌ను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఫోటోలు కుర్రాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ఒక సాఫ్ట్ బ్రౌన్ బ్యాక్‌డ్రాప్‌లో, డీప్ బ్లూ కలర్ స్లీవ్‌లెస్ హాల్టర్ నెక్ డ్రెస్ వేసుకుని పాయల్ ఇచ్చిన పోజులు అదిరిపోయాయి. దీనికి తోడు ఆమె వేసుకున్న షిమ్మర్ హీల్స్ ఈ లుక్‌కు మరింత రాయల్ టచ్ ఇచ్చాయి. ఇక స్టైలింగ్ నుండి మేకప్ వరకు ప్రతిదీ పర్ఫెక్ట్‌గా కుదరడంతో పాయల్ ఇందులో చాలా ఎలిగెంట్‌గా కనిపిస్తోంది. పంజాబీ భామ అయినప్పటికీ తెలుగులో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది పాయల్. 'వెంకీ మామ', 'గిన్నా' వంటి కమర్షియల్ సినిమాల్లో గ్లామర్ పండించినా.. 'మంగళవారం' లాంటి లేడీ ఓరియెంటెడ్ సినిమాలో ఇంటెన్స్ రోల్ చేసి అందరినీ మెప్పించింది. ఇక నటనకు స్కోప్ ఉన్న పాత్రలైనా, గ్లామర్ రోల్స్ అయినా నేను రెడీ అంటూ ఈ బ్యూటీ వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతోంది. కమర్షియల్ ఎలిమెంట్స్‌ను, సీరియస్ రోల్స్‌ను బ్యాలెన్స్ చేయడంలో పాయల్ రూటే వేరు. ప్రస్తుతం పాయల్ కెరీర్ ఫుల్ స్వింగ్‌లో ఉంది. కేవలం తెలుగులోనే కాకుండా పంజాబీలోనూ వరుస సినిమాలు చేస్తోంది. లీడర్, గోల్‌మాల్, కిరాతక, ది గ్రేట్ పంజాబ్ రాబరీ వంటి పలు ఆసక్తికరమైన చిత్రాలు ప్రస్తుతం ఆమె పైప్‌లైన్‌లో ఉన్నాయి.ఇక సినిమా సినిమాకూ వైవిధ్యం చూపిస్తూ, తనకంటూ క్రేజీ మార్కెట్ క్రియేట్ చేసుకుంటోంది. ఈ సినిమాలతో ఆమె రేంజ్ మరింత పెరగడం ఖాయం అనిపిస్తోంది. పాయల్ రాజ్‌పుత్ కెరీర్‌లో మరో బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ రాబోతుంది.అదే ముని దర్శకత్వంలో ఆమె 'వెంకటలక్ష్మి' అనే పవర్‌ఫుల్ పాన్ ఇండియా సినిమాలో నటిస్తోంది. ఒక గిరిజన అమ్మాయి రివెంజ్ స్టోరీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ యాక్షన్ డ్రామా తెరకెక్కుతోంది. ఇక ఈ సినిమా గురించి తాజాగా ఆమె మాట్లాడుతూ.. "డైరెక్టర్ ముని కథ చెప్పినప్పుడు నేను ఫిదా అయిపోయాను. ఈ సినిమా తర్వాత జనాలు నన్ను 'వెంకటలక్ష్మి'గా ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారు" అని చాలా కాన్ఫిడెంట్‌గా చెప్పింది.ఇక సౌరభ్ ధింగ్రా హీరోగా నటిస్తున్న ఈ సినిమా పాయల్ కెరీర్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్తుందని మేకర్స్ నమ్ముతున్నారు.

# అదితీరావ్.. నియాన్ కాంతుల ధగధగ

ప్రతిష్టాత్మక కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026 వేదికపై భారతీయ అందాల తారలు తమ గ్లామర్‌తో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తున్నారు. బాలీవుడ్ భామలు ఆలియా భట్, హ్యూమా ఖురేషీలతో పాటు గ్లోబల్ స్టేజ్‌పై మెరిసిన మన టాలీవుడ్ అండ్ బాలీవుడ్ బ్యూటీ అదితీరావ్ హైదరీ ఈసారి సరికొత్త రికార్డు సృష్టించారు. కాన్స్ రెడ్ కార్పెట్‌పై ఈ బ్యూటీ అడుగుపెట్టిన శైలి, ధరించిన కాస్ట్యూమ్స్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ఫ్రెంచ్ రివేరాలో జరిగిన ఈ మెయిన్ గాలా ఈవెంట్‌కు ముందే అదితీరావ్ షేర్ చేసిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో నియాన్ కాంతుల ధగధగలను తలపిస్తూ విపరీతంగా వైరల్ అవుతున్నాయి. కాన్స్ అధికారిక రెడ్ కార్పెట్ వాక్ కోసం అదితీరావ్ హైదరీ ఎవరూ ఊహించని విధంగా ఒక బ్రైట్ నియాన్ గ్రీన్ సిల్క్-జార్జెట్ గౌన్‌ను ఎంపిక చేసుకున్నారు. థై-హై స్లిట్ లుక్.. వెనుక వైపు నుండి పొడవుగా నేలను తాకుతూ సాగిపోయే లాంగ్ కేప్‌తో డిజైన్ చేసిన ఈ మోడ్రన్ డ్రెస్ అదితీకి ఒక సరికొత్త రాయల్ అప్పీల్‌ను ఇచ్చింది. ఫెస్టివల్ లైట్ల కాంతుల్లో అదితీ నడుచుకుంటూ వస్తుంటే.. మోడ్రన్ డ్రామా ఎలివేషన్ ఉన్న ఒక శిల్పంలా కనిపించారంటూ ఫ్యాషన్ విశ్లేషకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ నియాన్ గ్రీన్ గౌన్‌కు జోడిగా అదితీరావ్ తన మేకప్ - యాక్సెసరీస్ విషయంలో చాలా సింపుల్ అప్రోచ్ తో ఆకట్టుకుంది. న్యూడ్-టోన్డ్ మేకప్, కాంతివంతమైన గ్లామ్ లుక్‌తో అలరించింది. ఇంతకుముందు అదితీ కాన్స్ వేదికపై మన భారతీయ సాంప్రదాయాన్ని ప్రతిబింబించేలా ఒక అందమైన శారీ లుక్‌లో కూడా మెరిశారు. ఒక క్లాసిక్ చీర, బోల్డ్ చోకర్ నెక్లెస్, అల్లికల జుట్టు.. చాలా లైట్ మేకప్‌తో అదితీ ఫోటోషూట్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంది. ఆ ఫోటోలకు అదితీ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన క్యాప్షన్.. -చీర కట్టడం.. సాంప్రదాయ పద్ధతిలో. ఇది విప్లవాత్మకమైనదని నాకు తెలుసు- అంటూ పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. అదితీరావ్ హైదరీ రెండు భిన్నమైన లుక్స్‌కు సంబంధించిన వీడియోలు, ఫోటోలు ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్‌లలో హల్చల్ చేస్తున్నాయి. నెటిజన్లు ఈ బ్యూటీ స్టైలింగ్‌ను చూసి ముగ్ధులవుతూ.. -ఫైనల్‌గా ఒకరు చీర కట్టుకు సరైన న్యాయం చేశారు- అని కామెంట్లు పెడుతున్నారు. మరికొందరు అభిమానులు స్టన్నింగ్, ఓ మై గాడ్.. మీ లుక్ ఈ రోజును కాపాడింది.. అంటూ క్రేజీగా రియాక్ట్ అవుతున్నారు. గ్లోబల్ వేదికలపై వెస్ట్రన్ డ్రెస్సులతో పాటు మన దేశీ సంస్కృతిని కూడా అంతే హుందాగా ప్రదర్శించడంలో అదితీ స్టైల్ ఎప్పుడూ స్పెషల్ అని ఈ కాన్స్ వేడుకలు మరోసారి నిరూపించాయి. జాన్వీ ఇంట్రెస్టింగ్ కామెంట్స్.. ఇక సినిమాల విషయానికి వస్తే.. అదితీరావ్ హైదరీ చివరగా కిషోర్ పాండురంగ్ బేలేకర్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి, అరవింద్ స్వామిలతో కలిసి గాంధీ టాక్స్ అనే చిత్రంలో నటించారు. లయోనెస్ అనే చిత్రంలోను నటిస్తోంది. అలాగే ఇంతియాజ్ అలీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన రొమాంటిక్ సిరీస్ ఓ సాథీ రే లోను నటించింది ఈ సిరీస్‌తో పాటు పలు భారీ ప్రాజెక్టులతో అదితీ కెరీర్ పరంగాను అలాగే గ్లోబల్ ఫ్యాషన్ ఐకాన్‌గా సరికొత్త మైలురాళ్లను అందుకుంటూ దూసుకుపోతోంది.



# అమెరికాలో ఉన్నా రైతులపైనే ధ్యాస.

## మంత్రులు, కలెక్టర్‌కు ఫోన్ చేసిన హరీష్ రావు. ధాన్యం, పొద్దుతిరుగుడు, జొన్నల కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని డిమాండ్.

సిద్దిపేట ప్రజాకలం మే 19.

అమెరికాలో ఉన్నప్పటికీ అన్నదాతల సమస్యలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ప్రత్యేక దృష్టి సారించారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు మందగించడం, పొద్దుతిరుగుడు రైతులు 40 రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారనే సమాచారం అందడంతో ఆయన అక్కడి నుంచే మంత్రులు, అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ఫోన్ చేసిన హరీష్ రావు, ధాన్యం కొనుగోళ్ల వేగం పెంచాలని కోరారు. పొద్దుతిరుగుడు రైతులు నెల రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జొన్నల కొనుగోళ్లు కూడా తక్షణమే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతితో కూడా హరీష్ రావు ఫోన్‌లో మాట్లాడారు. లారీలు, హమాలీల కొరత సమస్యలను పరిష్కరించి కొనుగోళ్లలో వేగం తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ గోదాములతో పాటు ప్రైవేట్ గోదాములను కూడా వినియోగించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు మండుతున్న ఎండల్లో రోజుల తరబడి ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నారని, వర్షాలు ప్రారంభమైతే ధాన్యం తడిసి రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లను అప్రమత్తం చేసి తూకంలో రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని సూచించారు. తాను ఎక్కడ ఉన్నా ప్రజల సమస్యలపైనే తన ధ్యాస ఉంటుందని హరీష్ రావు మరోసారి చాటిచెప్పారని పార్టీ నాయకులు పేర్కొన్నారు.



# వితరణతో పేద కుటుంబాలకు ఊరట

## సేవా కార్యక్రమం కొనసాగించాలని సీనియర్ జర్నలిస్ట్ శంభులింగం సూచన.

సిద్దిపేట ప్రజాకలం మే 19.

దౌల్తాబాద్ మండల కేంద్రంలో బసవేశ్వర జయంతి సందర్భంగా ప్రారంభమైన అంబలి వితరణ కార్యక్రమం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని సీనియర్ జర్నలిస్ట్ శంభులింగం తెలిపారు. మాజీ సర్పంచ్ మాదంశెట్టి భద్రయ్య ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమం వేసవి కాలంలో ప్రజలకు ఉపశమనంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.



వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో చలివేంద్రం తరహాలో కొనసాగుతున్న అంబలి పంపిణీ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ముఖ్యంగా పేద కుటుంబాలు, కూలీలు, ప్రయాణికులు ఈ సేవను విస్తృతంగా వినియోగించుకుంటూ తాగునీటి అవసరాల్లో ఉపశమనం పొందుతున్నారని తెలిపారు. దౌల్తాబాద్ పట్టణంలో ఆర్థికంగా స్థిరంగా ఉన్నవారు చాలామంది ఉన్నప్పటికీ సామాజిక సేవలో ముందుకు వచ్చే వారు తక్కువగా ఉన్నారని, అలాంటి పరిస్థితుల్లో భద్రయ్య చేపట్టిన సేవా కార్యక్రమం ఆదర్శప్రాయమని శంభులింగం అభినందించారు. ప్రజల నుంచి స్వచ్ఛందంగా అందుతున్న విరాళాలు ఈ కార్యక్రమానికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. రోజుకు సుమారు 500 మందికి పైగా ప్రజలు ఈ అంబలి సేవను వినియోగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేసవి ముగిసే వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారని చెప్పారు. ఇటీవల ఎన్నికైన గ్రామ సర్పంచులు కూడా తమ గ్రామాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని శంభులింగం సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజల కోసం ఖర్చు చేసిన ఉత్సాహాన్ని ప్రజాసేవలో కూడా చూపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కళ్లాల్లో వడ్లు.. రోడ్డుపై రైతులు..!

సిద్దిపేట ప్రజాకలం మే 19.

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని వీరనగర్ గ్రామ రైతులు ఐకేపీ ద్వారా వడ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉదయం గజ్వేల్--చేగుంట ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. రైతులు రోడ్డుపై బైఠాయించి సుమారు మూడు గంటల పాటు ధర్నా చేపట్టడంతో రహదారిపై వాహన రాకపోకలు పూర్తిగా స్థంభించాయి. దారి పొడవునా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క లారీ కూడా రాకపోవడంతో కేంద్రంలో ధాన్యం కుప్పలు తిప్పలుగా పేరుకుపోయిందన్నారు. పలుమార్లు ఐకేపీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కాకపోవడంతోనే తాము రోడ్డెక్కి నిరసన చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు. వీరనగర్ స్టేజ్ వద్ద రైతులు రాస్తారోకో నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న తొగుట సిఐ లతీఫ్ ఫోన్ ద్వారా రైతులతో మాట్లాడారు. సంబంధిత శాఖ అధికారులతో చర్చించి వెంటనే లారీలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. సిఐ హామీతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# రైతుల పంటలు వెంటనే కొనాలి

## : వంటేరు ప్రతాప్ రెడ్డి

## లేనిపక్షంలో రాజీవ్ రహదారి దిగ్బంధం చేసి వంటావార్పు చేస్తామని హెచ్చరిక

గజ్వేల్:19 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ పట్టణ వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి, మక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటల కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మరియు పార్టీ నాయకులతో కలిసి మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులు తీవ్ర ఎండల్లో రోజుల తరబడి కొనుగోళ్ల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో లారీలు, గన్ని బ్యాగులు అందుబాటులో లేకపోవడంతో పాటు రైస్ మిల్లర్లు, దళారులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. పొద్దుతిరుగుడు పంటను మార్కెట్ యార్డులకు తీసుకొచ్చి రెండు నెలలు గడిచినా కొనుగోళ్లు జరగకపోవడం బాధాకరమన్నారు. రైతులు తక్కువ ధరలకు దళారులకు పంట అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఆంక్షలు లేకుండా రైతుల పంటలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వేలాది మంది రైతులతో కలిసి రాజీవ్ రహదారిపై దిగ్బంధం చేసి వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నవాజ్ మేరా, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, మాజీ జెడ్పిటిసి పంగ మల్లేశం, కౌన్సిలర్లు మామిడి శ్రీధర్, కాముని మురళి, కోట బాబు, మమతా పోచయ్య, మాజీ కౌన్సిలర్ మరికంటి కనకయ్య, సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు మద్ది రాజ్ రెడ్డి, గలెంక నర్సింలు, అశోక్ రావు పాల రమేష్ గౌడ్, రఘుపతి రెడ్డి తదితరులు ఉన్నారు





# గజ్వేల్ మున్సిపాలిటీలో నిండిపోయిన మోరీలను తక్షణమే శుభ్రం చేయాలి

## - బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నర్సింగరావు

గజ్వేల్:19 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాత 9వ వార్డు (ప్రస్తుత 17వ వార్డు)లో పూర్తిగా నిండిపోయిన డ్రైనేజీలను వెంటనే శుభ్రం చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నర్సింగరావు మున్సిపల్ అధికారులను కోరారు. ఈ వార్డులోని పలు కీలక ప్రాంతాల్లో మోరీలు పూడుకుపోయి మురుగునీరు పారుదలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా ఈ కాలువలను శుభ్రం చేసిన పాపాన పోలేదని ఆయన విమర్శించారు. ప్రధానంగా చిక్కుడు బస్తీ, సరస్వతి శిశు మందిర్, రిజిస్ట్రేషన్ ఆఫీస్, కోట మైసమ్మ బాబా గౌడ్ ఇంటి ప్రక్కన ప్రాంతాల్లో పేరుకుపోయిన మురుగు సమస్యను పరిష్కరించడానికి మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తక్షణమే “స్పెషల్ డ్రైవ్” చేపట్టి, ఈ మోరీలను శుభ్రం చేయించి స్థానిక ప్రజల ఇబ్బందులను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ కు మనవి చేశారు.



# ఎస్‌బీఐపై ఎస్సీఆర్ ఘన విజయం

## రాణించిన సాయి అక్షత్ గౌడ్, నిహాల్ రెడ్డి



హైదరాబాద్, మే 19: ప్రజా కలం ప్రతినిధి

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (HCA) ‘ఎ’ డివిజన్ లీగ్ మ్యాచ్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే (SCR) జట్టు అద్భుత ప్రదర్శనతో విజయం సాధించింది. నెక్స్‌జెన్ అరేనా వేదికగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) జట్టుతో జరిగిన హోరాహోరీ పోరులో ఎస్సీఆర్ 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఎస్‌బీఐ జట్టు నిర్ణీత 18 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేయగా... ఓపెనర్ డ్యానీ డెరెక్ ప్రిన్స్ 48 పరుగులతో (3 ఫోర్లు, 4 సిక్సర్లు) జట్టుకు శుభారంభాన్ని అందించారు. అనంతరం క్రీజులోకి వచ్చిన కె.ఎస్.కె. చైతన్య 44 పరుగులతో (4 ఫోర్లు, 3 సిక్సర్లు) నాటౌట్‌గా నిలిచి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఎస్సీఆర్ బౌలర్లలో ఎ.సాయి అర్ధిత్ రెడ్డి కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి 20 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టారు.?అనంతరం 152 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌత్ సెంట్రల్ రైల్వే (ఎస్సీఆర్) జట్టు కేవలం 16.4 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఎస్సీఆర్ బ్యాటర్లు జి. సాయి అక్షత్ గౌడ్, నిహాల్ రెడ్డిల భాగస్వామ్యం జట్టుకు విజయాన్ని అందించింది. సాయి అక్షత్ గౌడ్ 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 81 పరుగులతో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడగా, నిహాల్ రెడ్డి 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 54 పరుగులు చేసి అజేయంగా నిలిచారు. వీరిద్దరి ధాటికి ఎస్‌బీఐ బౌలర్లు చేతులెత్తేయడంతో ఎస్సీఆర్ సులభంగా విజయతీరాలకు చేరింది.

# జనతా కాంగ్రెస్‌కు గడ్డం ఏబెల్ రాజీనామా

## పార్టీని బలోపేతం చేయక, మరొకరికి ఒత్తాసు

కంటోన్మెంట్:మే 19

:ప్రజా కలం ప్రతినిధి

జనతా కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, అడ్వకేట్ గడ్డం ఏబెల్ తన పదవికి, పార్టీ సభ్యత్వానికి తక్షణమే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు రాజీనామా లేఖను పార్టీ జాతీయ అధ్యక్షునికి పంపారు. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత కార్యక్రమాలు కరువయ్యాయని, భవిష్యత్తు అభివృద్ధికి సరైన ప్రణాళికలు లేకపోవడం వల్లే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన లేఖలో వివరించారు. ప్రజలకు, పార్టీకి సేవ చేయాలనే తపన ఉన్నప్పటికీ.. ప్రస్తుత పరిస్థితుల్లో కొనసాగడం సాధ్యం కావడం లేదన్నారు. అన్ని విషయాలు బహిర్గతం చేయకూడదని, కొన్ని ఇతర కారణాలు తన రాజీనామా వెనుక ఉన్నాయని పేర్కొంటూ, తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని కోరారు.



# రాంసాగర్‌లో భద్రాచల రామయ్య తలంబ్రాల పంపిణి.

## రామకోటి రామరాజు ఆధ్యాత్మిక సేవలకు ఘన సన్మానం.

## రామయ్య తలంబ్రాలు అందుకోవడం అదృష్టమన్న భక్తులు.

సిద్దిపేట ప్రజాకలం మే 19.

రాంసాగర్ గ్రామంలోని రామాలయంలో మంగళవారం భద్రాచల రామయ్య కల్యాణ ముత్యాల తలంబ్రాల పంపిణి కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు భక్తులతో భజనలు చేయించి తలంబ్రాల పవిత్రత, విశిష్టతను వివరించి భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ రాంసాగర్ గ్రామం నుంచి భద్రాచల శ్రీరామ కళ్యాణానికి పెద్ద ఎత్తున గోటి తలంబ్రాలు పంపించినట్లు తెలిపారు. భద్రాచలం నుంచి 100 కిలోల ముత్యాల తలంబ్రాలు భక్తుల కోసం తీసుకొచ్చినట్లు చెప్పారు. భద్రాచలం వెళ్లలేకపోయినా తమ గోటి తలంబ్రాలు అక్కడికి చేరాయని, ఇప్పుడు ముత్యాల తలంబ్రాలు తిరిగి అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. రామకోటి రామరాజు చేస్తున్న ఆధ్యాత్మిక సేవలు, పట్టుదల ప్రశంసనీయమని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమం నిర్వహించాలని భక్తులు కోరారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ అధ్యక్షులు ఎమిశెట్టి వెంకటేశం, సర్పంచ్ భాగన్న గారి నరేష్ గౌడ్, ఉప సర్పంచ్ పోచయ్య, నాయిని ఆదిరెడ్డి, బిక్కుమల్ల నాగేష్, పడగంటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం తరలింపు, అన్‌లోడింగ్‌లో వేగం పెంచండి

### -రైతులు, హమాలీలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి -కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, మే 19 (ప్రజా కలం ప్రతినిధి) :జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు, రైస్ మిల్లులు మరియు గోదాముల్లో అన్‌లోడింగ్ ప్రక్రియలో



జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఉదయం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పౌర సరఫరాల, సహకార, గ్రామీణాభివృద్ధి, మెప్మా తదితర శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం వేసి, నిర్దేశించిన రైస్ మిల్లులు, గోదాములకు వేగంగా తరలించేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కొనుగోళ్ల ప్రక్రియ ఎక్కడా నిలిచిపోకుండా పర్యవేక్షించాలని, రవాణా కోసం అవసరమైన వాహనాలను ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.ఎండల తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాలు, మిల్లులు, గోదాముల్లో పనిచేస్తున్న రైతులు, హమాలీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయరాదని డీఆర్డీఓ, డీసీఓ, వ్యవసాయ అధికారులు, మెప్మా అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలను సంబంధిత శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు నిరంతరం తనిఖీ చేస్తూ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి.

### -డాటా ఎంట్రీ, ట్రక్ షీట్ జనరేషన్‌లో నిర్లక్ష్యం సహించము : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి ప్రతినిధి, మే 19 (ప్రజా కలం):

రైతులు తీసుకువచ్చిన ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేసి, నిర్ణీత సమయంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా అధికారులు సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏవోలు, ఏపీఎంలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్ చార్జీలు, సంబంధిత శాఖల అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి కొనుగోలు కేంద్రాల్లో డాటా ఎంట్రీ మరియు ట్రక్ షీట్ జనరేషన్ ప్రక్రియలో ఎలాంటి తేడాలు లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. 24 గంటల్లోగా పురోగతి కనిపించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కొన్ని రైస్ మిల్లుల వద్ద లారీలు నిలిచిపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వెంటనే లారీలను ఫ్రీ చేసి ధాన్యాన్ని అన్లోడ్ చేయించాలని ఆదేశించారు. రైస్ మిల్లుల వద్ద లారీలు ఎక్కువసేపు ఆగకుండా తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కొంతమంది మిల్లర్లు సహకరించడం లేదని సమాచారం ఉందని, ప్రతి రైస్ మిల్లులో ఎంత ధాన్యం అన్లోడ్ చేశారన్న వివరాలను సేకరించి, నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న మిల్లర్లపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హమాలీల సమస్యలు ఉన్నచోట వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిల్లుల వద్ద పోలీసు అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పరస్పర సమన్వయంతో పనిచేసి ధాన్యం రవాణా, అన్లోడింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. ప్రతిరోజూ మండలాల వారీగా, మిల్లర్ల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్ ఎంట్రీలు, ట్రక్ షీట్ జనరేషన్ వివరాలను తయారు చేసి పర్యవేక్షించాలని సివిల్ సప్లై అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 5,32,655 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. 5,573 మంది రైతుల ఖాతాల్లో రూ.89.85 కోట్లు జమ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి బాల సరోజ తెలిపారు. ఇప్పటివరకు 3,520 టార్పాలిన్ కవర్లు సరఫరా చేసినట్లు మార్కెటింగ్ డీఎం శ్రీకాంత్ తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంగీత, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతితో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అత్తెల్లి ప్రవీణ్ జ్యోతి దంపతుల మృతి చాలా బాధాకరం - చాగండ్ల నరేంద్రనాథ్

### మృతుల కుటుంబానికి 5 లక్షలు అందజేసిన చాగండ్ల నరేంద్రనాథ్

### శోకసముద్రంగా మారిన షేర్ పల్లి గ్రామం

గజ్వేల్:19 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ మండలం షేర్ పల్లి గ్రామానికి చెందిన ఆర్యవైశ్య నాయకుడు



అత్తెల్లి ప్రవీణ్ జ్యోతి దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి చిందిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగండ్ల నరేంద్రనాథ్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు,అత్తెల్లి ప్రవీణ్ జ్యోతి మరణం తీరని లోటు అని వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ,మంచి మనిషి అందరి మన్నన పొందిన అత్తెల్లి ప్రవీణ్ నాకు మించి ఆత్మీయుడు అని, చిన్న వయసులోనే తిరిగిరాని లోకాలకు వెళ్లడం బాధాకరం అని అన్నారు,వారితో పాటు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి,మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్,నాయకులు తలకొక్కుల దుర్గాప్రసాద్ తుమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శం

- దేశ రాజకీయాల్లో ఆదర్శవంతమైన నాయకుల్లో అగ్రగామి సుందరయ్యే
- ప్రజల మధ్య వైశ్యమ్యాలు పెంచుతున్న కేంద్ర బీజేపీ విధానాలపై బలమైన పోరాటాలు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు
- పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డిలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళ్ళు




సంగారెడ్డి ప్రతినిధి మే 19 (ప్రజా కలం):

పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శమని, కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య వైశ్యమ్యాలు పెంచుతున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య భూసామ్య విధానాలతో పాటు దళితవాడల్లో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసి కుల వ్యవస్థ, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. సుందరయ్య చివరి శ్వాస వరకు ప్రజల కోసమే జీవించారని చెప్పారు. ప్రజల్లో అభద్రతాభావాలను సృష్టించే బీజేపీ ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. దేశ రాజకీయాల్లో ఆదర్శవంతమైన నాయకులలో అగ్రగామి పుచ్చలపల్లి సుందరయ్య అని, రాజకీయ విభేదాలతో నిమిత్తం లేకుండా వారిని అభిమానించేవారు, ఉన్నత విలువలు పాటించి నెహ్రూ లాంటి వారి అభిమానాన్ని సైతం చురుగున్న మహా వ్యక్తి అని అంతేకాకుండా రాజకీయంగా విభేదించే వారిని సైతం ఆయన గౌరవించే వారిని తెలిపారు. నిబద్ధత కలిగిన అసాధారణ వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ, పోరాట విలువల్లో నుంచి సుందరయ్య లాంటి మహనీయులు రాజకీయాల్లో అడుగుపెట్టడం జరిగిందని తెలిపారు. సమాజం కోసం త్యాగం చేయడం, ప్రజల పట్ల నమ్రత, నమ్మకం, పోరాటాల పట్ల నిబద్ధత, మార్క్సిస్ట్ సిద్ధాంతం పట్ల అచంచల విశ్వాసము గల ఆయన వ్యక్తిత్వం రూపొందించుకోవడం జరిగిందని తెలిపారు. నేడు వారు మన ముందు లేకపోయినా వారు నిర్మించిన ఉద్యమం, చూపించిన బాట, నెలకొల్పిన విలువలు నేటితరం కార్యకర్తలు అనుసరించి ముందుకు సాగడమే ఆయనకు నిజమైన నివాళి అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, మాణిక్, జిల్లా కమిటీ సభ్యులు రేవంత్, యాదగిరి, కృష్ణ, నాయకులు అశోక్, సతీష్ , లక్ష్మణ్ విఠల్, ప్రసన్న, దేవరాజ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గీతం విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి 'ఫ్యూచర్ ఎక్స్5'



పటాన్ చేరు మే 19 (ప్రజా కలం) ప్రతినిధి

పరిశ్రమకు సంబంధించిన జ్ఞానాన్ని, భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే నైపుణ్యాలను విద్యార్థులకు అందించడానికి 'ఫ్యూచర్ ఎక్స్5' పేరిట ఒక చైతన్యవంతమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల శ్రేణికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శ్రీకారం చుట్టింది. గీతంలోని శిక్షణ, మార్గదర్శకత్వం, వృత్తి మార్గదర్శకత్వ డైరెక్టరేట్ (టీఎంసీజీ)లోని శిక్షణ, సామర్థ్య వికాస (టీసీడీ) విభాగం దీనిని ఏర్పాటు చేస్తున్నటు డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు కృత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ, ప్రాజెక్టు మేనేజ్ మెంట్, క్వాంటం కంప్యూటింగ్, కార్పొరేట్ రెడీనెస్, ఎథికల్ హ్యాకింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల నుంచి అనుభవజ్ఞులైన నిపుణులను తీసుకురావడం ద్వారా విద్య, పరిశ్రమ అంచనాల మధ్య అంతరాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమ లక్ష్యంగా డాక్టర్ రోజీనా వివరించారు మే 23 నుంచి జూన్ 6 వరకు నిర్వహించనున్న ఈ సెషన్లు, ప్రతివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై ఆచరణాత్మక అవగాహన పొందడం, ప్రముఖ సంస్థల నిపుణులతో సంభాషించడం, ప్రస్తుత మార్కెట్ పోకడలను అర్థం చేసుకోవడం, వారి వృత్తిపరమైన, కెరీర్ సంసిద్ధతను మెరుగుపరచుకోవడం వంటివి చేస్తారని డాక్టర్ రోజీనా తెలిపారు. మే 23న వినియోగదారు సంబంధాల నిర్వహణ (సీఆర్ఎం), ప్రాజెక్టు నిర్వహణలను విల్ కామ్ డెలివరీ మేనేజర్ శశిధర్ కొండూరి పరిచయం చేస్తారన్నారు. మే 30న క్వాంటం కంప్యూటింగ్, భద్రతను ఈవై డైరెక్టర్ మూర్తి పరవశివం వివరిస్తారని తెలిపారు.

మే 31న కార్పొరేట్ సంస్కృతిని అర్థం చేసుకోవడం, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, ఉత్పాదకత, స్వీయ బ్రాండింగ్ లపై ఎంఎక్స్4 భాగస్వామి, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ గురుసిద్ధయ్య శిక్షణ ఇస్తారన్నారు. జూన్ 6న నైతిక హ్యాకింగ్ ను లిబరల్ సెక్యూరిటీ వ్యవస్థాపకులు సుజయ్ గంకిడి పరిచయం చేస్తారని డైరెక్టర్ వివరించారు పరిశ్రమ భవిష్యత్తు పోకడలను అన్వేషించడానికి, వృత్తిపరమైన సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి, అభివృద్ధి చెందుతున్న కెరీర్ రంగాలకు తమను తాము సిద్ధం చేసుకోవడానికి ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఆయా సెషన్లలో చురుకుగా పాల్గొనాలని డాక్టర్ రోజీనా మాథ్యూ సూచించారు.

## కేటీఆర్ ఒక బిల్డప్ బాబాయ్

### -రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం : కప్పర ప్రసాదరావు

### - ఉద్యమకారులను మింగిన విషనాగు - సోషల్ మీడియాలో హీరో... ప్రజల్లో జీరో

హైదరాబాద్:19 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలోబీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాద రావు మాట్లాడుతూ,కేటీఆర్ రాజకీయాల్లో "బిల్డప్ బాబాయ్"గా మారారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ కనుమరుగయ్యే స్థితిలో ఉందని, అందుకే కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు కేటీఆర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. దుబ్బాక, హుజూరాబాద్ ఉపఎన్నికల్లో బీజేపీ విజయాలను గుర్తుచేస్తూ,కేసీఆర్ కుటుంబానికి ప్రజలు ఓటమి రుచి చూపించారని అన్నారు. తెలంగాణలో 8 ఎంపీ స్థానాలు గెలిచి కాంగ్రెస్‌కు సమానంగా నిలిచామని,బీఆర్ఎస్‌కు గుండు సున్నా ఇచ్చామని వ్యాఖ్యానించారు.హుజూరాబాద్ ఎన్నికల్లో భారీగా డబ్బులు ఖర్చు పెట్టి దళితులకు ఆర్థిక సహాయం ప్రకటించినప్పటికీ ప్రజలు బీజేపీకి మద్దతు ఇచ్చారని తెలిపారు.సిరిసిల్లలో కూడా బీఆర్ఎస్‌కు ప్రజలు గట్టి హెచ్చరిక ఇచ్చారని అన్నారు.జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ బలం బయటపడిందని,మజ్లిస్ పార్టీతో కలిసి హిందువులను అవమానించిందీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆరోపించారు.తెలంగాణ ఉద్యమకారులను మోసం చేసింది బీఆర్ఎస్ నాయకత్వమేనని విమర్శించారు.ఓటర్ల జాబితాలో డబుల్ ఓట్లు, చనిపోయిన వారి పేర్లు, అక్రమంగా దేశంలోకి వచ్చిన వారి పేర్లు తొలగించడం ఎన్నికల కమిషన్ బాధ్యత అని పేర్కొన్నారు.దేశ భద్రత, దేశ భవిష్యత్తు బీజేపీకి ముఖ్యమని తెలిపారు.కిషన్ రెడ్డి, బండి సంజయ్, రామచంద్రరావు వంటి నాయకులు స్వయంకృషితో ఎదిగారని,కుటుంబ రాజకీయాల ద్వారా వచ్చిన వారికి వారి గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు.గోవా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ముస్లింలు, క్రైస్తవులు కూడా బీజేపీకి మద్దతు ఇచ్చారని, బీజేపీ ఏ మతానికీ వ్యతిరేకం కాదని స్పష్టం



చేశారు. బీహార్, బెంగాల్, కేరళలో కూడా పార్టీ బలోపేతంయియా అవుతోందన్నారు.రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి అధికారం అప్పగించేందుకు ఎదురుచూస్తున్నారని, బీఆర్ఎస్ పాలన ముగిసిందని, కాంగ్రెస్ పాలన కూడా అంతమయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయని కప్పర ప్రసాదరావు పేర్కొన్నారు.

## మిల్లుల్లో ధాన్యం దిగుమతిని వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ కె. హైమావతి.



సిద్దిపేట ప్రజాకలం మే 19.

మిల్లుల్లో ఎక్కువ మంది హమాలీలను అందుబాటులో ఉంచుకుని ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మిల్లర్ యజమానులను ఆదేశించారు. మంగళవారం చేర్యాల మండలం వీరన్నపేట శివ సాయి బాలాజీ రైస్ మిల్లులో ధాన్యం దిగుమతి ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, దిగుమతి చేసే ప్రతి మిల్లుకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం దిగుమతి జరగాలని సూచించారు. ధాన్యం దిగుమతిలో ఎలాంటి జాప్యం లేకుండా ఎక్కువ మంది హమాలీలను అందుబాటులో ఉంచి షిఫ్ట్‌ల వారీగా పనులు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో స్థానికంగా పని చేసే హమాలీలను సమకూర్చుకుని కొనుగోలు కేంద్రాల వద్దనే వారు పనిచేసేలా చర్యలు తీసుకుంటే మిల్లుల్లో దిగుమతికి ఆలస్యం ఉండదని తెలిపారు. ఈ బాధ్యతను స్థానిక తహసీల్దార్ పర్యవేక్షించాలని సూచించారు.ధాన్యం దిగుమతి పూర్తయిన వెంటనే మిల్లర్లు అక్నాలెడ్జ్‌మెంట్, ట్రక్ షీట్ జనరేషన్, ఓపీఎంఎస్ అప్‌లోడ్ వంటి ప్రక్రియలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్, ఏపీఎం తదితర అధికారులు పాల్గొన్నారు.

# నోయిడా కార్మికులను కార్యకర్తలను విడుదల చేయాలంటూ ముంబైలో నిరసన

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 19:
ఏప్రిల్ 11న నోయిడాలోని కార్మికులు తమ కోసం 8గంటల పని విధానం, కనీస వేతనం, ఓవర్ టైం లెక్కింపు తదితర అంశాలపై ఆకస్మికంగా పోరాటానికి దిగిన విషయం ప్రపంచానికి తెల్సిందే. ఆ పోరాటంపై యూపీ




పోలీసులు లాఠీ చార్జీలు, వేయి మంది కార్మికులను అరెస్టులు చేశారు. ముఖ్యంగా రచయిత మేధావి సత్యం వర్మ, ఆకృతి చౌదరిపై జాతీయ భద్రతా చట్టానికి (ఎన్ఎస్ఏ) ఉపయోగించారు. సోమవారం ముంబైలో "ది కార్వాన్" ఆధ్వర్యంలో ఆజాద్ మైదాన్‌లో రాజ్యహింసకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాజ్య హింసలో భాగంగా రూపేష్ రాయ్, సృష్టి గుప్తా, మనీషా చౌహాన్, ఆటో డ్రైవర్ రూపేష్ రాయ్, ఇంజనీర్ ఆదిత్య ఆనంద్, విద్యార్థి కార్యకర్త హిమాన్ను కుమార్ లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సత్యం




వర్మ, ఆకృతి చౌదరిలపై విధించిన ఎన్ఎస్ఏ ను ఉపసంహరించుకోవాలి. అరెస్టైన కార్మికులు, కార్యకర్తలందరిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రదర్శనలో రాజ్య అణచివేతకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరెస్టైన కార్మికులు జైల్లో "మేడే" ఉత్సవం జరుపుకున్నందుకు నాయకులు అభినందించారు. ఈ నిరసనలో "ది కార్వాన్" నాయకురాలు డాక్టర్ పూజా, ధనుంజయ్ తావ్డే, దిశా కు చెందిన రక్షందా, ముంబై ఫర్ పీస్ సుజాత, సీపీఐ కామ్రేడ్ మిలింద్ రనాడే, విద్యార్థి కార్యకర్త నాజిమ్, హైదర్, కామ్రేడ్ శుభమ్, కామ్రేడ్ రవి జోషి ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు.

# అసైన్డ్ భూములపై అక్రమ కబ్జాలు.. దళిత, గిరిజన హక్కులను కాపాడాలి

### -బహుజన సేన అధ్యక్షుడు జింక శ్రీధర్.

రాజన్న సిరిసిల్ల,మే 19 ట ప్రజా కలం ప్రతినిధి ఊ : దళిత, గిరిజన నిరుపేదలకు ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములు అక్రమ ఆక్రమణలకు గురవుతున్నాయని ఆరోపిస్తూ, వాటిపై వెంటనే సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బహుజన సేన జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్ డిమాండ్ చేశారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్, భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రాజీవ్ నగర్, ముష్టిపల్లి ప్రాంతాల్లో సర్వే నంబర్ 51లో ఉన్న సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమి ఆక్రమణకు గురైందని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారని తెలిపారు.ఆ ఫిర్యాదుపై అధికారులు చేపట్టిన విచారణ వివరాలను ప్రజలకు వెల్లడించాలని ఆయన కోరారు. అలాగే తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామంలో సిరిసిల్ల-- సిద్దిపేట ప్రధాన రహదారి సమీపంలోని ప్రభుత్వ అసైన్డ్ భూమి స్థానికేతర వ్యక్తి పేరిట రిజిస్ట్రేషన్ కావడం 1977 అసైన్డ్ భూముల చట్ట నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు.అసైన్డ్ భూములు స్థానిక దళిత, గిరిజన నిరుపేద కుటుంబాలకు మాత్రమే కేటాయించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చట్టాలను రూపొందించిందని, అయితే వాటిని ఉల్లంఘిస్తూ కొందరు ప్రభావశీలులు భూములను ఆక్రమించుకోవడం ఆందోళనకరమని"అసైన్డ్ భూములు దళిత, గిరిజన నిరుపేదల హక్కు... అక్రమ కబ్జాదారుల చేతుల్లో కాదు. అధికారులు వెంటనే స్పందించి భూములను అర్హులకు అందించాలన్నారు,వెంటనే రెవెన్యూ అధికారులు విచారణ జరిపి అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలను రద్దు చేసి నిజమైన అర్హులకు భూములు అందించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్, బహుజన సేన గౌరవ అధ్యక్షుడు గుడిసె మనోజ్ కుమార్, ఉపాధ్యక్షుడు బానోత్ శ్రీకాంత్ నాయక్, యంగ్ మ్యాన్ అంబేద్కరిస్ట్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పెరుమండ్ల శ్రీకాంత్, పడిగె మహేష్, సిరిగిరి రాము, సుంకపాక వినయ్ తదితరులు పాల్గొన్నారు.






# అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం కృషి:రంగారావు

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్ అండ్ మై గ్రేట్ యూనియన్ అధ్యక్షులు డాక్టర్ కే.రంగారావు పేర్కొన్నారు. మంగళవారం ఐడిపిఎల్ కార్యాలయం నందు లేబర్ కమిషనర్ యూనియన్ రిజిస్ట్రేషన్ నంబర్ రంగారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... నేను గత 30 సంవత్సరాలుగా అసంఘటిత, సంఘటిత కార్మికుల హక్కుల సమస్యల మీద పోరాటం చేస్తూ ఎంతోమందికి నష్టపరిహారాలు ఎన్నో పరిశ్రమలో యూనియన్లు స్థాపించడం జరిగిందన్నారు. కార్మికుల శ్రేయస్సు కోసం లేబర్ కమిషనర్ తోటి కలిసి యాజమాన్యాలతో పోరాటం చేస్తూ భారతీయ మజ్దూర్ కానివ్వండి దాంట్లో వైస్ ప్రెసిడెంట్ గా కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ గా సేవలందిస్తూ మరి తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్ అండ్ మై గ్రేట్ వర్కర్స్ యూనియన్ రిజిస్ట్రేషన్నో నెంబర్ H/128/TG విజయవంతంగా జరిగింది. 2022 సంవత్సరంలో అప్లికేషన్ పెట్టి దాని మీద పని చేసుకుంటూ పోరాటాలు సాగిస్తూ, అసంఘటిత కార్మిక రంగంలో సేవలు అందిస్తూ 2026 సంవత్సరంలో జనవరి ఫిబ్రవరి నెలల్లో భరతనాద్ అనే లేబర్ ఆఫీసర్ని కమిషనర్ తెలంగాణ లేబర్ వారిని ఎంక్వైరీ కోసం నియమించారు. ఆయా జిల్లాలో వరంగల్, సంగారెడ్డి, మల్కాజ్గిరి మేడ్చల్, అదిలాబాదు, రంగారెడ్డి జిల్లాలో లేబర్ ఆఫీసర్లు ఎంక్వయిరీ చేసి కమిషనర్ రిపోర్ట్ ఇచ్చిన అనంతరం ఈ యూనియన్ పేరు మీద దగ్గర వేల మంది అసంఘటిత కార్మికులు మెంబర్షిప్ అయి ఉన్నారు. సోమవారం అడిషనల్ కమిషనర్ ఆఫ్ లేబర్ చేతుల మీదుగా చంద్రశేఖర్ మరియు డిస్టిక్ డిసిఐ నీలమ్మ చేతులు మీదుగా ఈయొక్క రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందు చేశారని తెలిపారు. లేబర్ కమిషనర్ కి, కార్మికులకి ఇందులో పాల్గొని నాకు సహకరించిన ప్రతి ఒక్కరికి నా తోటి ఆఫీస్ వేలాదిమంది అసంఘటిత కార్మికులకు హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలిపారు. రాబోయే కాలంలో తెలంగాణ మొత్తం అసంఘటిత రంగంలో ప్రతి సమస్య మీద పోరాటం చేసి ప్రతి కార్మికుడికి న్యాయం చేసే దిశగా ముందుకు పయనిస్తామని వివరించారు. ఈకార్యక్రమంలో నాతో పాటు పాల్గొన్న నా తోటి ఆఫీస్ బేరర్స్ కార్మికులు, కర్షకులు రామేంద్రనాథ్, విజయయాదవ్, కోటేశ్వరరావు, నరసింహులు, రమేష్ మోడీ, వీళ్ళందరూ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందజేసిన చంద్రశేఖర్ కి నీళ్లమ్మ మేడం కమిషనర్ కి ధన్యవాదాలు తెలిపారు.

# బైకుల దొంగ అరెస్ట్...12 బైక్ లు స్వాధీనం



వలిగొండ మే 19 ప్రజాకలం:బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన ఘటన మండల కేంద్రంలో మంగళ వారం చోటు చేసుకుంది. చౌటుప్పల్ డి.ఎస్.పి మధుసూధన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రాపెన్ మణికు మార్(28) సికింద్రాబాద్ బొల్లారం, (బోయిన్పల్లి) ప్రాంతానికి చెందిన వ్యక్తి మరో ఇద్దరు బాల నేరస్తులతో కలిపి రాత్రి వేళలల్లో వివిధ జిల్లాలో బైక్లను దొంగిలించి హైదారాబాద్ కు తరలించిన బైక్లను ఖాళీ ప్రదేశాల్లో దాచి అనంతరం బైక్లను స్క్రాప్ దుకాణల్లో అమ్మి వచ్చిన డబ్బులను పంపకాలు చేసుకునే వీరిలో ఒక్కరు మంగళవారం తెల్లవారు జామున 5 గంటల సమయంలో మండల కేంద్రంలోని తొర్రూరు చౌరస్తా తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమానంతో బైక్ పై వచ్చిన వ్యక్తి ఆపి వివరాలు అడు గుతుండగా పొంతన లేని సమాధానాలు ఇస్తుండడం, సరైన డాక్యుమెంట్లు లేకపోవడంతోపాటు వైర్ కట్టర్ ఉండడంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారణ చేయడంతో బైక్ దొంగతనాల గుట్టు బైటపడిందని,ఇటీవల వలిగొండలో బత్తిని శెట్టయ్యకు చెందిన బైక్ ను దొగింలించిచడంతోపాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలల్లో 12 బైక్లు దొంగతనం చేసినట్లుగా నిందితుడు అంగీకరించడాని, నిందితున్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుచగా న్యాయ మూర్తి నిందితునికి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఇద్దరు సికింద్రాబాద్ బొల్లారం,(బోయినపల్లి) ప్రాంతానికి చెందిన వ్యక్తి మరో ఇద్దరు బాల నేరస్తులతో కలిపి రాత్రి వేళలల్లో వివిధ జిల్లాలో బైక్లను దొంగిలించి హైదరాబాద్ కు తరలించిన బైక్ లను ఖాళీ ప్రదేశాల్లో దాచి అనంతరం బైక్లను స్క్రాప్ దుకాణాల్లో అమ్మి వచ్చిన డబ్బులను పంపకాలు చేసుకునే వీరిలో ఒక్కడు మంగళవారం తెల్లవారు జామున 5 గంటల సమయంలో మండల కేంద్రంలోని తొర్రూరు చౌరస్తా తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమా నంతో బైక్ పై వచ్చిన వ్యక్తి ఆపి వివరాలు అడుగుతుండగా పొంతనలేని సమాదానాలు ఇస్తుండడం, సరైన డాక్యుమెంట్లు లేకపోవడంతోపాటు వైర్ కట్టర్ ఉండడంతో ఆ వ్యక్తిని అదుపు లోకి తీసుకొని పోలీసులు విచారణ చేయడంతో బైక్ దొంగతనాల గుట్టు బైటపడిందని,ఇటీవల వలిగొండలో బత్తిని శెట్టయ్యకు చెందిన బైడ్కు దొగింలించిచడంతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలల్లో 12 బైక్లు దొంగతనం చేసినట్లుగా నిందితుడు అంగీకరించడాని,నిందితున్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుచగా న్యాయ మూర్తి నిందితునికి రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఇద్దరు బాల నేరుస్తులు పరారీలో ఉన్నారని,ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలి పారు.ఈ కార్యక్రమంలో రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు,ఎస్సై యుగంధర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# తాజ్పూర్ లో బడిబాట కార్యక్రమం

### ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య - సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్

యాదాద్రి భువనగిరి మే 19 ప్రజా కలం ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామంలో సర్పంచ్ ర్యాకల సంతోష్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థుల ను కలిసి ప్రభుత్వ పాఠశాలలలో ఉన్న సౌకర్యాలు, అర్హత కలిగిన ఉపాధ్యాయుల గురించి వివరించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పం చ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, ఎస్కే గాలిబ్ యాకుబ్, బొమ్మరపు రామకృష్ణ, బొమ్మరపు లక్ష్మీ బాలరాజు, బిట్కూరు మహేష్, వరిగంటి మానస నాగ రాజు, ఎస్కే హైమద్, ఉపాధ్యాయులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.





# అరుంధతి హాస్పిటల్లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ దుండిగల్ గ్రామానికి చెందిన కంజర్ల అశోక్ (రోడ్డు ప్రమాదంలో గాయపడగా) గొప్పరాజు నారాయణ(జాండిస్ వ్యాధితో) బాధపడుతూ నగరంలోని అరుంధతి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న వారిని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ మంగళవారం పరామర్శించారు. ఈసందర్భంగా సంబంధిత వైద్యులను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన మరియు నాణ్యతమైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ క్లిష్ట సమయంలో తాను వారికి అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు భరోసా ఇస్తూ వారు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జక్కుల శ్రీనివాస్ యాదవ్, బండారి మహేందర్ యాదవ్, సుధాకర్ రెడ్డి, భరత్ కుమార్, పాక్స్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, నాయకులు ఈ శ్రీనివాస్, రంజిత్ రెడ్డి, నర్సింగ్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్, కుటుంబ సభ్యులు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# జడల యషిల్ గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజ్ఞాన్ విద్యార్థికి 1లక్ష రూపాయలు నగదు ఆర్థిక సహాయం

యాదాద్రి భువనగిరి మే 18 ప్రజా కలం ప్రతినిధి :
ఇటీవల విడుదల అయిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా టాప్ ర్యాంకు భువనగిరి పట్టణంలోని విజ్ఞాన్ హై స్కూల్ విద్యార్థి సారా సాయి మాధవ్ 581/600 సాధించారు. వారి ఉన్నత చదువుల కొరకు యాదాద్రి భువనగిరి



జిల్లా చెందిన జడల యషిల్ గౌడ్ (జె వై జి )ఫౌండేషన్ చైర్మన్ జడల యషిల్ గౌడ్ ఇంటర్మీడియట్ చదువుకై పూర్తి బాధ్యత తీసుకున్నట్లు మరియు ముందస్తుగా నగదు 1లక్ష రూ ఆర్థిక సహాయం జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ జడల అమరేందర్ గౌడ్ చేతుల మీదుగా వారి తండ్రి సారా మల్లేశం గౌడ్ కి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారి భవిష్యత్తు చదువులకై పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానని భవిష్యత్తులో మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారి తండ్రి సార మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ నా కుమారుడి చదువుకై ఆర్థిక సహాయం అందజేస్తున్న జడల యషిల్ గౌడ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మన్ డా.పగిడాల జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

### -లబ్ధిదారులకు రూ.14.15 లక్షల ఆర్థిక సాయం అందజేసిన ప్రభుత్వ విప్ ఆది.

రాజన్న సిరిసిల్ల,వేములవాడ, మే 19 టప్రజా కలం ప్రతినిధిఊ : వేములవాడ నియోజకవర్గ పరిధిలో అర్హులైన పేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) చెక్కులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం పంపిణీ చేశారు. వేములవాడ పట్టణ పరిధిలోని 30 మంది లబ్ధిదారులకు రూ.9 లక్షల 83 వేల విలువైన చెక్కులు, వేములవాడ రూరల్ మండల పరిధిలోని 13 మంది లబ్ధిదారులకు రూ.4 లక్షల 32 వేల విలువైన చెక్కులను అందజేశారు. మొత్తం 43 మంది లబ్ధిదారులకు రూ.14 లక్షల 15 వేల ఆర్థిక సహాయం అందినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, పేద ప్రజలకు వైద్య చికిత్సలు, అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందుకోవడంతో లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి మరియు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.





## మల్కాజిగిరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆలంపల్లి సురేష్ కు ఘన సన్మానం

మల్కాజిగిరి మే 19 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మామ సూదిని పద్మా రెడ్డి, తెలంగాణ గ్రామపంచాయతీ ట్రైబ్యునల్ చైర్మన్ సూదిని రాం రెడ్డిలు మల్కాజిగిరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా సురేష్ అలంపల్లి ఎన్నికైన సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం మల్కాజిగిరి లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో లో నిర్వహించారు.సంఘ సభ్యులు,ప్రముఖులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుదిని రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి అలంపల్లి సురేష్ మరింత కృషి చేసి సంఘాన్ని ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.అలాగే సూదిని పద్మారెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో యువ నాయకత్వం ఎంతో అవసరమని,మల్కాజిగిరి ఆర్యవైశ్య సంఘం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.అనంతరం అలంపల్లి సురేష్ ని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## విద్యుత్ శాఖ ఏడి కి వినతి పత్రానందించిన కాంగ్రెస్ నాయకులు

మల్కాజిగిరి,మే 19(ప్రజా కలం ప్రతినిధి)

మౌలాలి ప్రాంతంలో రిజిస్ట్రేషన్,నోటరీలతో ఉన్న ఇళ్లకు విద్యుత్ శాఖ విద్యుత్ మీటర్లను ఇవ్వడంలో స్థానికులకు ఎదురవుతున్న సమస్యలపై పరిష్కరించాలని కోరుతూ మౌలాలి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఏడి కి మంగళవారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికులు సమస్యను మా దృష్టికి తీసుకురావడంతో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కు వివరించగా వారు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు భరోసా కల్పించాలని చెప్పారు. వారి సూచనలతో విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రాన్ని అందించామని తెలిపారు.త్వరలోనే విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అమిత్, రహమాన్ ఉద్దీన్, యూసుఫ్ బాయ్, దేవాసాయం,షకిల్,మల్లేష్, మల్కాజిగిరి యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ గవర్నర్ చేతులమీదుగా డాక్టర్ ఎ.మోహన్ కు "ఎక్సలెన్సీ అవార్డ్ ప్రధానం

హైద్రాబాద్ మే 19(ప్రజాకలం న్యూస్)

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రజ్ఞిక ఫౌండేషన్, ప్రజ్ఞిక ఆర్ట్స్ అకాడమీ,సీల్‌వెల్ కార్పొరేషన్ ఆద్వర్యంలో హైద్రాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం నిర్వహించిన "ఎక్సలెన్సీ అవార్డ్స 2026" కార్యక్రమంలో భాగంగా సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా అమ్మఒడి వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎ.మోహన్




కు "ఎక్సలెన్సీ అవార్డ్ 2026" ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్,మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.తెలంగాణ రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు,యువజన, క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక అతిథులుగా హాజరై అవార్డ్స్ ప్రధానం చేశారు. ప్రముఖ సినీ గాయకుడు మనో, సినీనటిమనులు కవిత,శివపార్వతి,మాజీ ముఖ్య కార్యదర్శి (త్రిపుర రాష్ట్ర ప్రభుత్వం)యు. వెంకటేశ్వర్లు సమక్షంలో డాక్టర్ ఎ.మోహన్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు.తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ అనుగు నరసింహారెడ్డి, సీల్‌వెల్ కార్పొరేషన్ చైర్మన్ బండారు సుబ్బారావు, ప్రజ్ఞిక ఫౌండేషన్ ప్రతినిధులు, పలువురు సినీ, సాంస్కృతిక, సామాజిక ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ మాట్లాడుతూ అనాధలు, నిరుపేదలు, ఆపదలో ఉన్న చిన్నారుల సంక్షేమం కోసం అమ్మఒడి వాలంటరీ ఆర్గనైజేషన్ చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును అందించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా తన సేవా ప్రయాణానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత బాధ్యతతో సమాజ సేవలో ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

# ప్రతి మున్సిపాలిటీకి రూ.15 కోట్ల భారీ నిధుల విడుదల

### -పటాన్‌చెరు నియోజకవర్గంలో ముమ్మరంగా సాగిన మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటన

### - ఒకేరోజు రూ.84 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన




పటాన్ చేరు మే 19 (ప్రజా కలం )ప్రతినిధి

పటాన్‌చెరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి నేడు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ కాట శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక ప్రజలు వేలాదిగా తరలివచ్చి మంత్రికి ఘన స్వాగతం పలికారు ఈ సందర్భంగా ఇస్నాపూర్, ఇంద్రేశం, జిన్నారం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. మొత్తంగా నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ.84 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే భానూర్‌లో రూ.8.30 కోట్ల వ్యయంతో విశాఖ పీడబ్ల్యూడీ రోడ్డు నుండి శంకరపల్లి పటాన్‌చెరు రోడ్డు వరకు కంచర్లగూడెం మీదుగా నిర్మించనున్న బీటీ రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ కేజీబీవీలో రూ.60.94 లక్షలు, జిన్నారం కేజీబీవీలో రూ.70.95 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల పనులకు శంకుస్థాపన చేసి, సోలక్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు

ఈ సందర్భంగా మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ 1985లో స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ గారు ఈ ప్రాంతానికి బీడీఎల్, ఓడీఎఫ్ వంటి ప్రతిష్టాత్మక రక్షణ రంగ పరిశ్రమలను తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఆమె సేవలను స్మరించుకుంటూ ఈ ప్రాంతంలో ఇందిరమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సముచితమన్నారు. భానూర్ కార్మికుల హౌసింగ్ సొసైటీకి స్థల కేటాయింపు చేపడతామని, పటాన్‌చెరు నుండి శంకర్‌పల్లి వరకు 100 ఫీట్ల రహదారి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత పదేళ్లలో లేని విధంగా ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని, జూన్ 2వ తేదీ నుండి కొత్త పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు పటాన్‌చెరు కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పటాన్‌చెరు అభివృద్ధికి, ముఖ్యంగా విద్యా మరియు మౌలిక వసతుల రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఒకేరోజు రూ.84 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో టీ జి ఐ ఐ సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.








Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com